అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

బుధవారం 29-3-2023


సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 87 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50



ఫ్రాన్స్‌ పెన్షన్‌ సంస్కరణలకు వ్యతిరేకంగా నిరసన కవాతు.

భారత్‌ వెలిగిపోతోందంటూ మోడీ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. కేంద్రంలోని బీజేపీ సర్కార్‌ కార్పొరేట్లను వదిలేసి,పేదజనంపై ఎడాపెడా పన్నులు భారాలు మోపుతున్నా ఖజానా నిండటంలేదు.ఇంకా జనాన్ని ఎలా పీల్చిపిప్పి చేయాలనే ఆలోచన చేస్తున్నది.మరోవైపు ఆవురావురామంటూ ఎక్కడ బడితే అక్కడ అప్పులను తీసుకుంటోంది. ఆర్బీఐ మొదలుకుని ప్రపంచ బ్యాంకు వరకూ.. ఇలా అప్పు దొరికిన చోటల్లా ఎగబడుతోందని కేంద్రమే పార్లమెంట్‌ సాక్షిగా ప్రకటించింది.



# అప్పు 155.8 లక్షల కోట్లు

వడ్డీరూపంలో 9.4 లక్షల కోట్లు: కేంద్రం

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం అప్పు రూ.155.8 లక్షల కోట్లకు చేరిందని, దీనికి వడ్డీనే రూ.9.4 లక్షల కోట్లు అవుతుందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్‌ చౌదరి తెలిపారు. రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ వి.శివదాసన్‌ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022-23 సవరించిన బడ్జెట్‌ అంచనాల్లో కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.155.8 లక్షల కోట్లు కాగా, అందులో రూ.148.8 లక్షల కోట్లు దేశీయ అప్పు, రూ.7 లక్షల కోట్లు విదేశీ అప్పు అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అప్పు కూడా ఏడాదికి ఏడాది భారీగా పెరుగుతోంది. 2017-18లో కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.82.9 లక్షల కోట్లు కాగా, 2018-19లో రూ.92.5 లక్షల కోట్లకు, 2019-20లో రూ.105.2 కోట్లకు, 2020-21లో రూ.122.1 లక్షల కోట్లకు, 2021-22లో రూ.138.9 కోట్లకు, 2022-23లో అది కాస్తా రూ.155.8 లక్షల కోట్లకు పెరిగింది. దేశ స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో అప్పుల వాటా 2017-18లో 48.5 శాతం, 2018-19లో 49 శాతం, 2019-20లో 52.4 శాతం, 2020-21లో 58.7 శాతం, 2022-23 (సవరించిన బడ్జెట్‌ అంచనా)లో 57.3 శాతం ఉంది. దీన్ని బట్టీ చూస్తే జీడీపీలో అప్పుల వాటా కూడా ఏడాదికి ఏడాది పెరుగుతోంది.

**రూ. 82కి పడిపోయిన రూపాయి విలువ**

అమెరికా డాలర్‌తో పోల్చితే దేశీయ కరెన్సీ రూపాయి విలువ రూ.82కి పడిపోయిందని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్‌ చౌదరి తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రూ. 82.4845కి రూపాయి విలువ పతనం అయిందని తెలిపారు.

**దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం**

దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతోందని కేంద్ర ప్రభుత్వం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్‌ చౌదరి ఇచ్చిన సమాధానంతో దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుదల స్పష్టమైంది. 2022-23 (ఏప్రిల్‌- ఫిబ్రవరి) మధ్య 6.75 శాతం వినియోగదారు ధరల సూచిక-కంబైన్డ్‌ (సీపీఐ-సీ) ద్రవ్యోల్బణం ఉన్నదని కేంద్ర మంత్రి తెలిపారు. 2021-22లో సీపీఐ-సీ ద్రవ్యోల్బణం 5.51 శాతం ఉందని పేర్కొన్నారు.



## ఐదేండ్లలో కార్పొరేట్లకు రూ.8.72 లక్షల కోట్లు మాఫీ

- కేంద్ర మంత్రి భగవంత్‌ ఖరాడ్‌

**న్యూఢిల్లీ :** గత ఐదేండ్లలో దేశంలోని కార్పొరేట్లు తీసుకున్న రుణాలు రూ.8,72,778 కోట్లు మాఫీ చేసినట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవంత్‌ ఖరాడ్‌ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2017-18 నుంచి 2021-22 వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ. 6,31,693 కోట్లు, ప్రయివేట్‌ రంగ బ్యాంకులు రూ.2,24,855 కోట్లు, విదేశీ బ్యాంకులు రూ.16,230 కోట్లు మాఫీ చేశాయని తెలిపారు

## పంట నష్టపరిహారమివ్వండి



అర్హులైన వారికి పోడు భూముల పంపిణీకి సిద్ధం

- గృహలక్ష్మి విధివిధానాలను ఖరారు చేయండి
- సీఎస్‌కు సీఎం ఆదేశం

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌**

అకాలంగా కురిసిన వడగండ్ల వానలతో నష్టపోయిన పంటలకు, ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయాన్ని అందించేందుకు చర్యలు చేపట్టాలనీ, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారిని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌ రావు ఆదేశించారు. పంట నష్టం, పోడు భూములు, గొర్రెల పంపకం, పేదలకు ఇండ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం..తదితర అంశాలపై మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రెవెన్యూ కార్యదర్శి నవీన్‌ మిట్టల్‌, వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు, డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌ కార్యదర్శి రాహుల్‌ బొజ్జా, సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగరావు, సీఎం కార్యదర్శులు రాజశేఖర్‌ రెడ్డి, భూపాల్‌ రెడ్డి పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

**నష్టపోయిన పంటలకు ఆర్థికసాయం**

నష్ట పోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామంటూ సీఎం ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేయాలని ...5లో

### పేదల ఇండ్ల నిర్మాణానికి సాయం



ఖాళీ జాగాలు ఉన్న అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణం కోసం ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన మూడు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు. ఇందుకు సంబంధించి, విధి విధానాలను రూపొందించి జారీ చేయాలని స్పష్టం చేశారు.

### సీతారాముల కళ్యాణ నిర్వహణకు కోటి రూపాయలు

శ్రీరామ నవమి సందర్భంగా 30 న భద్రాచలంలో జరుగనున్న శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల నిర్వహణకోసం ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి కోటి రూపాయలను సీఎం మంజూరు చేశారు. కరోనా కారణంగా గత రెండు సంవత్సరాలుగా భద్రాచల దేవస్థానం ఆదాయం కోల్పోయిన నేపథ్యంలో దేవాదాయ శాఖ అభ్యర్థన మేరకు కళ్యాణ నిర్వహణకోసం సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు

## మెట్రో విస్తరణపై కేంద్రం వివక్ష

ఫీజుబులిటీ లేదనడం విడ్డూరం



- నగరంలోకి 500 ఎలక్ట్రానిక్‌ బస్సులు
- ఖాజాగూడ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు మంత్రి కేటీఆర్‌ శంకుస్థాపన

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

మెట్రో విస్తరణకు కేంద్రం నిధులు ఇచ్చినా ఇవ్వకున్నా చేపడతామని మున్సిపల్‌ శాఖ మంత్రి కేటీఆర్‌ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని లక్డికాపూల్‌ నుంచి బీహెచ్‌ఈఎల్‌ వరకు, నాగోల్‌ నుంచి ఎల్బీనగర్‌ వరకు మెట్రో విస్తరణ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా ఫీజిబులిటీ లేదని నివేదిక ఇచ్చారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం మెట్రో విస్తరణ పనులు చేపడుతుందన్నారు. మంగళవారం ఖాజాగూడ పెద్ద చెరువు సుందరీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందినట్టు కాదా? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. నగరంలో ప్రజా రవాణా కోసం 500 ఎలక్ట్రానిక్‌ బస్సులను తీసుకొస్తున్నట్టు తెలిపారు. నగరంలోని 50 చెరువులను కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబిలిటీ కింద అభివృద్ధి, సుందరీకరణ చేసేందుకు ...5లో

## విద్వేష ప్రసంగాలపై చర్యలేవి?

మతసామరస్యానికి కట్టడి అవసరం : సుప్రీం




**న్యూఢిల్లీ:** విద్వేష ప్రసంగాలపై సుప్రీం కోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలో మత సామరస్యాన్ని కాపాడుకునేందుకు విద్వేషపూరిత ప్రసంగాలను కట్టడి చేయడం అవసరమని పేర్కొంది. విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా దాఖలు చేసిన ఓ పిటిషన్‌పై జస్టిస్‌ కేఎం జోసెఫ్‌, జస్టిస్‌ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

విద్వేష ప్రసంగాలకు సంబంధించి 18 కేసులు నమోదు చేసినట్టు సొలిసిటర్‌ జనరల్‌ తుషార్‌ మెహతా ఈ సందర్భంగా ధర్మాసనం ...5లో

## పీఎఫ్‌పై 5 పైసల వడ్డీ పెంపు

- 2022-23కు 8.15శాతంగా నిర్ణయం




వివరాలు 5లో..


## ఈడీ లేఖకు ఎమ్మెల్సీ కవిత సమాధానం

- ఈడీ కార్యాలయానికి వెళ్లిన సోమా భరత్‌

వివరాలు 5లో..

## అత్యాశే కొంపముంచింది

- టీఎస్‌పీఎస్సీ పేపర్‌ లీక్‌ కేసులో ముగిసిన నిందితుల సిట్‌ కస్టడీ




**నవతెలంగాణ-సిటీబ్యూరో**

టీఎస్‌పీఎస్సీ పేపర్‌ లీకేజ్‌ కేసులో నిందితుల సిట్‌ కస్టడీ ముగిసింది. కస్టడీలో వున్న ప్రవీణ్‌, రాజశేఖర్‌, డాక్యా, రాజేశ్వర్‌ నుంచి సిట్‌ అధికారులు కీలక సమాచారం సేకరించినట్టు తెలిసింది. అత్యాశే వారి కొంపముంచిందని తెలుస్తోంది. రేణుక ఇద్దరికి ఏఈ పేపర్‌ విక్రయించగా, ఆమె భర్త అత్యాశకు పోయి ...3లో

## మోడీదంతా ప్రచారమే..

ఒక్క పరిశ్రమా పెట్టలేదు.. ఉన్నవాటినే అమ్మేస్తున్నారు

- భువనగిరిలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు
- జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభం




**నవతెలంగాణ - భువనగిరి**

ప్రజల్లో మత విద్వేషాలను ప్రేరేపించి బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తుందని, రానున్న కాలంలో బీజేపీ పీడను వదిలించుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పిలుపునిచ్చారు. ఆదిలాబాద్‌ జిల్లాలో ప్రారంభమైన సీపీఐ(ఎం) జన చైతన్య యాత్ర మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా యాత్రకు ఆ పార్టీ జిల్లా శ్రేణులు ఘన స్వాగతం పలికారు. డప్పు, కోలాటాల కళాకారుల నృత్యాలతో యాత్రకు స్వాగతం పలికారు. ర్యాలీలో భాగంగా డాక్టర్‌ అంబేద్కర్‌, బాబు జగ్జీవన్‌రామ్‌ విగ్రహాలకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌.వీరయ్య, బృందం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) భువనగిరి జిల్లా కార్యాలయాన్ని (దుంపల మల్లారెడ్డి భవనం) రాఘవులు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ...6లో

## నేడే జనచైతన్య యాత్ర ముగింపు సభ

- హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌ వద్ద ఏర్పాట్లు
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ప్రకాశ్‌ కరత్‌

వివరాలు 5లో..

## ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

ఎర్రకోట వద్ద శాంతి కాగడా మార్చ్‌ ... నేతలను అడ్డుకున్న పోలీసులు





**న్యూఢిల్లీ:** రాహుల్‌ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు వ్యతిరేకిస్తూ, అదానీ వ్యవహారంపై జేపీసీ వేయాలని డిమాండ్‌ చేస్తూ ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య పరిరక్షణ శాంతి కాగడ ప్రదర్శన నిర్వహించాయి. మంగళవారం నాడిక్కడ ఎర్ర కోట నుంచి పాత ఢిల్లీలోని చాందినీ చౌక్‌లో టౌన్‌ హాల్‌ వరకు ప్రతిపక్ష నేతలు కాగడ మార్చ్‌ నిర్వహించారు. అయితే శాంతి భద్రతల సమస్యలను పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు అనుమతిని నిరాకరించారు. సీఆర్‌పీసీ సెక్షన్‌ 144 ఆంక్షలు విధించారు. వేదిక వద్దకు వెళ్లకుండా ప్రతిపక్ష నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కొంత మంది నేతలను వాహనాల్లోకి కుక్కి వివిధ పోలీస్‌ స్టేషన్లకు తరలించారు. ఉత్తరాఖండ్‌ మాజీ ముఖ్యమంత్రి హరీశ్‌ రావత్‌ సహా పలువురు ఎంపీలను అదుపులోకి తీసుకున్నారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని నినాదాల హోరెత్తించారు. నియంతకు తాము భయపడమని నేతలు పేర్కొన్నారు.

## 40 శాతం టికెట్లు యువతకే

కష్టపడినవారికి పార్టీలో గుర్తింపు

- 42 పార్లమెంటు కేంద్రాల్లో ఎన్టీఆర్‌ శతజయంతి వేడుకలు: టీడీపీ పొలిట్‌బ్యూరో తీర్మానం
- పార్టీని మరింత బలోపేతం చేస్తాం: చంద్రబాబు
- జగన్‌ది హీనచరిత్ర: అచ్చెన్నాయుడు
- 119 నియోజకవర్గాల్లో పోటీ: కాసాని జ్ఞానేశ్వర్‌



**నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్‌**

వచ్చే ఎన్నికల్లో 40 శాతం టికెట్లు యువతకు ఇవ్వాలని తెలుగుదేశం పొలిట్‌బ్యూరో నిర్ణయించింది. కష్టపడేవారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో పార్టీ జాతీయ అధినేత ఎన్‌.చంద్రబాబునాయుడు అధ్యక్షతన పొలిట్‌బ్యూరో భేటీ జరిగింది. దీనికి తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌, ఏపీ శాఖ అధ్యక్షులు అచ్చెన్నాయుడుతోపాటు పొలిట్‌బ్యూరో ...5లో

నవతెలంగాణ



# చదువుకు దూరం

## ఎన్‌సీఎల్‌పీ స్కూళ్ల మూతతో అంధకారంలో బాలకార్మికుల భవితవ్యం





- పెరిగిన డ్రాపౌట్లు.. పట్టించుకోని మోడీ ప్రభుత్వం
- ఉద్యోగాలను కోల్పోయిన 36 వేల మంది ఉపాధ్యాయులు
- విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తల ఆందోళన

**దేశంలో బాలకార్మిక వ్యవస్థలో చిక్కుకుపోయి.. ఉచిత నిర్బంధ విద్యకు దూరమైన చిన్నారుల కోసం ఉద్దేశించిన జాతీయ బాల కార్మిక ప్రాజెక్టు (ఎన్‌సీఎల్‌పీ) పాఠశాలలు ఏడాది నుంచి మూసివేయబడి ఉన్నాయి. స్కూళ్ల మూసివేత కారణంగా ఉపాధ్యాయులు నిరుద్యోగులయ్యారు. ఈ స్కూళ్లను రెగ్యులర్‌గా నడిచే ప్రభుత్వ స్కూళ్లతో కలపడం కారణంగా అక్కడి విద్యార్థుల స్థాయిలో బాల కార్మికులు చదవలేకపోతున్నారు. ఫలితంగా డ్రాపౌట్లు అధికమవుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, స్కూల్‌కు వెళ్లాల్సిన చిన్నారుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టివేయబడిందని విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు**

**న్యూఢిల్లీ :** ఎన్‌సీఎల్‌పీ స్కూళ్ల మూసివేతతో లక్షలాది బాలకార్మికులు తమ విద్యావకాశాలను, దాదాపు 36 వేల మంది ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను కోల్పోయారు. వీధిన పడిన నిరుద్యోగ ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారు. తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఈనెల 15న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనను కూడా చేశారు. స్కూళ్ల మూసివేత కారణంగా ఉపాధ్యాయులు ఎంత నష్టపోయారో.. పిల్లలు కూడా అంతే బాధపడ్డారని ఉపాధ్యాయుడొకరు అన్నారు. "సంవత్స రాలుగా వ్యక్తిగత శ్రద్ధతో.. పిల్లల ఇండ్లను క్రమం తప్పకుండా చుట్టుముట్టిన తర్వాత విద్యలోకి వచ్చిన ఏ పిల్లవాడినైనా సాధారణ ప్రభుత్వ పాఠశాలలో సర్దుబాటు చేయడం సాధ్యం కాదు. వారి తోటివారు వారి కంటే చాలా చిన్నవారు. వారు ప్రాథమిక అంశాలను అర్థం చేసుకోవడానికి కష్టపడుతుంటారు" అని పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఉపాధ్యాయుడు, నేషనల్ చైల్డ్ లేబర్ స్కూల్స్ టీచర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ ఫిరోజ్ షేక్ అన్నారు. 10-11 సంవత్సరాల వయస్సులో తన విద్యను ప్రారంభించిన పిల్లవాడు అదే తరగతిలోని 6 సంవత్సరాల పిల్లలతో సర్దుబాటు చేయడం అసాధ్యమని తెలిపారు. భార్గవ్ పప్పు(45) మధ్య ప్రదేశ్ లోని రేవా జిల్లాకు చెందినవారు. 2006 నుంచి ఎన్‌సీఎల్‌పీ పాఠశాల ప్రాజెక్ట్‌ల కింద బోధిస్తున్నాడు. అతను అడవుల మధ్య ఉన్న ప్రాంతంలో బోధించేవాడు. ఇక్కడ పిల్లలు ప్రధానంగా ఆదివాసీలు, కలప సేకరించేవారు. "వారు వచ్చిన ప్రాంతం, తల్లిదండ్రులు ఇద్దరూ సాధారణంగా 'దేశీ' మద్యం సేవిస్తారు. ఇంటిని నడపడానికి, వారి మద్యం ఖర్చులకు అవసరమైన కనీస మొత్తాన్ని సంపాదించడానికి వారు తమ పిల్లలను ఇలాంటి పనులకు పంపుతారు" అని తెలిపాడు. 90వ దశకం చివరిలో ప్రాజెక్ట్ ప్రారంభమైనప్పుడు ఉపాధ్యాయులను ఎంపిక చేసుకునే ప్రమాణాలు చాలా సరళంగా ఉన్నాయి. వారు తమ విద్యార్హత వివరాలతో పాటు స్థానిక పత్రాలను సమర్పించాలి. తర్వాత రాత పరీక్షలు, వైవాలు కూడా తీసుకున్నారు. అయినప్పటికీ, ఇది ఇప్పటికీ చాలా సులభం. మరోవైపు, ఈ ఉపాధ్యాయులను 'సేవ'లో ఉంచలేదు. వారికి ఇచ్చేది కేవలం గౌరవ వేతనం మాత్రమే. ఇది 90వ దశకం చివరిలో దాదాపు రూ. 800గా ఉండేది. 2022 మార్చి చివరి నాటికి కార్యక్రమం మూసివేయబడినప్పుడు అది కేవలం రూ.1400కి మాత్రమే పెరిగింది. చెల్లింపులు సరిగా లేకపోవడంతో ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం ఇతర పనులు వెతుక్కోవాల్సి వచ్చింది. కొందరు ఆటోరిక్షా నడిపారు. మరికొందరు పూర్తి సమయం వ్యవసాయం, పార్ట్‌టైమ్ బోధనను ఆశ్రయించారు. మిగిలినవారు నెలవారీ ఖర్చులకు ట్యూషన్‌లు చెప్పడం వంటివి చేశారు. పలు సందర్భాల్లో ఉన్న కొద్దిపాటి జీతం కూడా సరిగ్గా అందలేదని తెలిపారు. జార్ఖండ్‌కు చెందిన కొందరు ఉపాధ్యాయులు తమకు గత ఆరేండ్లుగా వేతనాలు ఇవ్వడం లేదని చెప్పారు. తాము ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చిన పిల్లల్లో నేడు కొందరు వైద్యులు, మరికొందరు ఇంజినీర్లు, మరికొందరు న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారని తెలిపారు. ఈ స్కూళ్లను మూసివేసి నప్పటి నుంచి అనేక మంది విద్యార్థులు తిరిగి బాల కార్మికులుగా మారిపోయారని ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు చెప్పారు. ఎందరో విద్యార్థులను ఉన్నత స్థానాలకు తీసుకొచ్చి, వారి భవిష్యత్తులో కాంతులు నింపిన అలాంటి స్కూళ్లను మూసివేయం సరైనది కాదని పూర్వ విద్యార్థులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు.

# బంగ్లా ఖాళీ చేస్తా

- లోక్‌సభ సెక్రెటేరియట్‌కు రాహుల్ లేఖ



**న్యూఢిల్లీ :** తన హక్కులకు భంగం వాటిల్లకుండా అధికారులు లేఖలో పేర్కొన్న విధంగా బంగ్లాను ఖాళీ చేస్తానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం తెలిపారు. అధికారుల ఆదేశాలను తుచ తప్పకుండా పాటిస్తానని పేర్కొంటూ లోక్‌సభ సెక్రెటేరియట్‌కు ఓ లేఖ రాశారు. 12- తుగ్లక్ లేన్‌లో నాకు కేటాయించిన నివాసాన్ని ఖాళీ చేయమంటూ లోక్‌సభ సెక్రెటేరియట్ పంపిన లేఖ అందింది. అందుకు కృతజ్ఞతలు. ప్రజల తీర్పుతో నాలుగు సార్లు లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై నేను ఈ బంగ్లాలో ఉంటున్నాను. ఇక్కడ నాకు చాలా మధుర జ్ఞాపకాలున్నాయి. నా హక్కులకు భంగం కలగకుండా.. లేఖలో పేర్కొన్న విధంగా వ్యవహరించడానికి నేను ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నాను. అది నా బాధ్యత. బంగ్లాను ఖాళీ చేస్తా" అని రాహుల్ తన లేఖలో వెల్లడించారు. పరువు నష్టం కేసులో రెండేండ్లపాటు జైలు శిక్ష పడటంతో రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఇటీవల లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో నిబంధనల ప్రకారం.. నెల రోజుల్లోపు అధికారిక నివాసాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే 12-తుగ్లక్‌లేన్‌లోని అధికార బంగ్లాను ఏప్రిల్ 22లోగా ఖాళీ చేయాలంటూ రాహుల్‌కు లోక్‌సభ హౌసింగ్ కమిటీ సోమవారం నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపైనే రాహుల్ స్పందించారు. మరోవైపు, లోక్‌సభ సభ్యుడిగా రాహుల్‌కు ఉండే ప్రయోజనాలన్నింటినీ కూడా అధికారులు పున్ణపరిశీలిస్తున్నారు.



# నకిలీ మందులు తయారు చేస్తున్న 18 ఫార్మా సంస్థల అనుమతులు రద్దు

**న్యూఢిల్లీ :** నకిలీ, కల్తీ మందులు తయారు చేస్తున్న 18 ఫార్మా సంస్థల అనుమతులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. నాణ్యతలేని మందుల తయారీకి వ్యతిరేకంగా ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణా సంస్థలు సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన మొదటి దశ డ్రైవ్‌లో భాగంగా 76 ఫార్మా సంస్థల్లో తనిఖీలు నిర్వహించాయి. నకిలీ, కల్తీ మందులు తయారు చేస్తున్న 18 సంస్థలు అనుమతులు రద్దు చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. దేశవ్యాప్తంగా గత 15 రోజుల్లో 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. నకిలీ, కల్తీ మందులు తయారు చేస్తున్న 18 సంస్థల అనుమతులు రద్దు చేశామని, మరో 26 సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ డ్రైవ్‌లో మొత్తంగా 203 ఫార్మా సంస్థలను గుర్తించినట్లు చెప్పారు. అత్యధికంగా హిమాచల్ ప్రదేశ్‌లో 70 సంస్థలు ఉన్నాయని, తరువాత ఉత్తరాఖండ్‌లో 45, మధ్యప్రదేశ్‌లో 23 సంస్థలు ఉన్నట్లు చెప్పారు. ఇటీవల భారత ఫార్మా సంస్థలు తయారు చేస్తున్న ఔషధాల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత ఏడాదిలో భారత్‌లో ఉత్పత్తి అయిన దగ్గు మందులతో ఆఫ్రికా దేశాల్లో కొంత మంది చిన్నారులు మృతి చెందగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో తమిళనాడులోని గ్లోబల్ ఫార్మా హెల్త్‌కేర్ ఉత్పత్తి చేసిన కంటి చుక్కల మందు అమెరికాలో కొంత మంది చూపు కోల్పోవడానికి కారణమయింది.

# హక్కుల ఉల్లంఘనేముంది?

- ఫైజల్ 'అనర్హత' పిటిషన్‌పై సుప్రీం

**న్యూఢిల్లీ:** తనపై అనర్హత వేటును లోక్‌సభ సెక్రటేరియట్ తొలగించకపోవడంపై లక్షద్వీప్ మాజీ ఎంపీ, ఎన్‌సీపీ నేత మహ్మద్ ఫైజల్ దాఖలు చేసిన పిటిషన్.. మంగళవారం సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు కొచ్చింది. ఈ వ్యాజ్యాన్ని పరిశీలించిన జస్టిస్ కె.ఎం. జోసఫ్, జస్టిస్ బి.వి. నాగరత్నతో కూడిన ధర్మాసనం.. ఇందులో ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే ముందని ప్రశ్నించింది. పిటిషనర్ హైకోర్టుకు ఎందుకు వెళ్లలేదని అడిగింది. ఓ హత్యాయత్నం కేసులో ఫైజల్‌కు 10 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ దిగువ కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో లోక్‌సభ సచివాలయం ఆయనను అనర్హుడిగా ప్రకటించింది. దీనిపై ఫైజల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జైలుశిక్ష తీర్పుపై కేరళ హైకోర్టు స్టే విధించినప్పటికీ తన సభ్యత్వాన్ని లోక్‌సభ సెక్రెటేరియట్ పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. ఈ క్రమంలోనే ఫైజల్ పిటిషన్ నేడు ధర్మాసనం ముందుకు రాగా.. కోర్టు పలు ప్రశ్నలు సంధించింది. "ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగితేనే ఆర్టికల్ 32 కింద వేసిన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తుంది. ఈ కేసులో ఏ ప్రాథమిక హక్కు ఉల్లంఘనకు గురైంది?" అని ధర్మాసనం ప్రశ్నించింది. దీనికి ఫైజల్ తరఫు న్యాయవాది బదులిస్తూ.. 'తన నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించే హక్కును తీసేసుకున్నారు' అని సమాధానమిచ్చారు. దీంతో కోర్టు స్పందిస్తూ.. 'అది ప్రాథమిక హక్కు ఉల్లంఘన అవుతుందా?' అని మరో ప్రశ్న వేసింది. అయితే, జైలు శిక్షపై స్టే విధించినా.. అనర్హతను ఎత్తివేసేందుకు నిరాకరించడం ఏకపక్ష నిర్ణయమని, దీనిపై తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని ఫైజల్ న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. ఇక, ఈ పిటిషన్‌పై ముందు హైకోర్టుకు ఎందుకు వెళ్లలేదని ధర్మాసనం ప్రశ్నించగా.. "జైలు శిక్షపై హైకోర్టు ఇచ్చిన స్టేను సవాల్ చేస్తూ లక్షద్వీప్ అడ్మినిస్ట్రేషన్ వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో ఉన్నందున.. నేరుగా ఇక్కడికే వచ్చాం" అని ఫైజల్ తరఫు న్యాయవాది బదులిచ్చారు. ఈ వివరణ అనంతరం ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపడుతామని ధర్మాసనం వెల్లడించింది.

# విత్‌హెల్డ్‌లో బీబీసీ పంజాబ్ న్యూస్

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తితో బీబీసీ పంజాబ్ న్యూస్ ఖాతాను ట్విట్టర్ విత్‌హెల్డ్‌లో ఉంచింది. ఈ విషయాన్ని ఒక ప్రముఖ మీడియా సంస్థ వెల్లడించింది. అయితే ట్విట్టర్ సంస్థ దీనిపై ఇప్పటి వరకూ ఎలాంటి అధికారిక సమాచారం ఇవ్వలేదు. ఖలిస్తాన్ డిమాండ్ మద్దతుదారుడు అమృత్‌పాల్ సింగ్, అతని అనుచరులు కోసం పంజాబ్ పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్న సమయంలో ఇలాంటి చర్య జరిగింది. బీబీసి పంజాబ్ న్యూస్ ఖాతాతో పాటు దాదాపు 120 ఖాతాలపై కూడా తాత్కాలికంగా నిషేధం విధించినట్లు సమాచారం. వీటిలో జర్నలిస్టులు, ఉద్యమకారులు, ప్రముఖుల ఖాతాలతో పాటు శిరోమణి అకాళీదళ్‌కు చెందిన పార్లమెంట్ సభ్యులు సిమ్రాన్‌జిత్ సింగ్ ఖాతా కూడా ఉంది. అలాగే పంజాబ్‌లో అనేక ప్రాంతాల్లో గత వారం రోజుల నుంచి మొబైల్ ఇంటర్నెట్‌ను కూడా నిలిపివేశారు.



# ఇబ్రహీంపట్నం గడ్డపై ఎర్రజెండా ఎగరాలి

## పేదవారి నిఖార్సైన జెండాను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలి : జనచైతన్య యాత్రలో తమ్మినేని వ్యాఖ్యలు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

బీజేపీ సాదాసీదా పార్టీ కాదనీ, సమాజాన్ని శతాబ్దాలకాల వెనక్కి తీసుకుపోయేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. కేంద్రంలో బీజేపీ సర్కారు బీసీ గణన విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ మినహా అన్ని పార్టీలు బీసీ గణన అడుగుతుంటే, ఆ పార్టీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు కావాలంటే, వారి సంఖ్య తేలాల్సిందేనన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో తమ్మినేని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు బీజేపీ వ్యతిరేకమైనదన్నారు. అందుకే మనుధర్మ సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని కులాలను అణగద్రొక్కేందుకు బ్రాహ్మణాధిపత్య వ్యవస్థను స్థాపించాలని కలలు కంటున్నదనీ, అటువంటి ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. దేశంలోని సర్వమతాలు అన్నదమ్ముల్లా బతుకుంటే, వారి మధ్య అగ్గిరాజేసి రాజకీయ లబ్దిపొందుతున్నదని విమర్శించారు. అంబేద్కర్ ఆశయాలను, విలువలను ధ్వంసం చేస్తున్నదని చెప్పారు. అందులో భాగంగా రాజ్యాంగం పరమ చెత్త అంటూ ఆర్ఎస్ఎస్, బీజేపీ వ్యాఖ్యానిస్తున్నాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం గడ్డపై ఈసారి ఎర్రజెండా ఎగరాలని చెప్పారు. అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి గడప తొక్కాలని సూచించారు. పేదవారి నిఖార్సైన జెండాను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు.

**ప్రతి కార్యకర్త పనిలో ఉండాలి... ప్రతి గడప తొక్కాలి**

### ఏ ఒక్క హామీని బీజేపీ నెరవేర్చలేదు : మల్లు లక్ష్మి



గత ఎన్నికల్లో దేశ ప్రజలకు బీజేపీ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి విమర్శించారు. ఆపార్టీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణాల్లో పేదలు ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను ఎదుర్కొంటున్నారని చెప్పారు. గ్యాస్‌బండ ధర రూ 410 ఉంటే, బీజేపీ వచ్చాక రూ 1250కి పెరిగిందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ఏకాభిప్రాయం లేదనే సాకుతో కాలయాపన చేస్తున్నదని విమర్శించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, మధుసూధన్‌రెడ్డి, జగదీష్, నాయకులు పి.జంగారెడ్డి, రాంచందర్, కందుకూరి జగన్, అంజయ్య, కవిత, ఆలంపల్లి నర్సింహ్మ రవికుమార్, మంచాల మండల కార్యదర్శి శ్యాంసుందర్, అరుట్ల గ్రామ కార్యదర్శి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలంక ప్రధాని గతే మోడీకి..

## మోడీవి అచ్చేదిన్ కాదు చచ్చే దిన్

- రైతు ఉద్యమాల వల్లే నల్ల చట్టాలు వెనక్కి
- ఎర్రజెండా ద్వారానే దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు : సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విజ్జుకృష్ణన్



**నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి (పరిపూర్ణం)/ వనపర్తి**

ప్రజా పోరాటాలను కాలదన్నిన శ్రీలంక ప్రధానికి పట్టిన గతే మోడీకి పట్టడం ఖాయమని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు విజ్జు కృష్ణన్ అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన చైతన్య యాత్ర మూడోరోజు మంగళవారం గద్వాల నుంచి వనపర్తి, నాగర్‌కర్నూల్ కల్వకుర్తి పట్టణాల మీదుగా జరిగింది. వనపర్తిలో అంబేద్కర్ విగ్రహానికి విజ్జు కృష్ణన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా డిపో రోడ్డులో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి యం.డి. జబ్బార్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో విజ్జు కృష్ణన్ ప్రసంగించారు. మోడీ అధికారంలోకి వస్తే అత్యధిక ఉద్యోగాలు ఇస్తామని నమ్మించారని తెలిపారు. అనేక వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మురిపించి గద్దెనెక్కిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నేడు హామీలు మరిచి మతతత్వ రాజకీయాలకు తెర లేపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 9 ఏండ్ల కిందట గ్యాస్ ధర రూ.450 రూపాయలుంటే నేడు 1200కు చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.50 ఉన్న లీటర్ పెట్రోల్ ధర నేడు వంద రూపాయలు దాటిందని చెప్పారు. దేశంలో చాలా మంది ఆసక్తి చూపే ఆర్మీ ఉద్యోగంలోనూ కాంట్రాక్టు వ్యవస్థ తీసుకురావడం అత్యంత దుర్మార్గమన్నారు. గిట్టుబాటు ధర కావాలంటే స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేయాలన్నారు. పారిశ్రామికవేత్తలకు లబ్ది చేకూర్చేందుకే రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తెచ్చి రైతుల నడ్డివిరిచే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే పెద్దఎత్తున దేశ వ్యాప్త ఉద్యమం చేసి ఆ నల్ల చట్టాలను రద్దు చేయించి మోడీ చేత క్షమాపణ చెప్పించిన ఘనత ఈ దేశ రైతులకే దక్కుతుందన్నారు. కరోనా సమయంలో దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా నాణ్యమైన వైద్యం అందించి లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన ఘన చరిత్ర కేరళ రాష్ట్ర ప్రభుత్వానిదని వివరించారు. ఆ సమయంలో 20 రకాల నిత్యావసర వస్తువులను పేద ప్రజలకు ఇంటింటికీ తిరిగి ఉచితంగా అందించామన్నారు. నేడు ఎర్రజెండా ద్వారా దేశంలో ప్రత్యామ్నాయ వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు.

## మసీదులను కూల్చేందుకు బీజేపీ పలుగు, పార పట్టుకుని తిరుగుతది : పోతినేని



బీజేపీ అధికారంలోకి వస్తే మసీదులను కూల్చేందుకు పలుగు, పార పట్టుకుని తిరుగుతారని జనచైతన్య యాత్ర రథసారధి, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ హెచ్చరించారు. రాష్ట్రంలో ఆపార్టీకి అధికారం లేక పోయినా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయం గుమ్మటాలను కూల్చేస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. అయితే మతోన్మాదం గురించి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలకు చెప్పాల్సిన పనిలేదనీ, ఎందుకంటే పార్టీ నేతలు పాషా, నరహరిని బలితీసుకున్నదని మతోన్మాదులేనని గుర్తు చేశారు. ఒక్క అవకాశం ఇవ్వాలంటూ బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ అంటున్నారని తెలిపారు. అధికారంలోకి వస్తే మసీదులను కూలగొట్టి కింద లింగాలొస్తాయో, శవాలు వస్తాయో చూస్తామంటున్నారని చెప్పారు. లింగాలు వస్తే ముస్లింలు ఆలయాలను కూల్చేశారని చెప్పేందుకు ప్రయత్నిస్తారని తెలిపారు. అటువంటి మూర్ఖులను రాష్ట్రం నుంచి తరిమేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ నుంచి ప్రజల ఆస్తులను, ప్రజా స్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు.

## పేదలకు ఒక్క ఇల్లైనా ఇచ్చారా?

తెలంగాణలోని బీజేపీ నాయకులకు దమ్ము.. ధైర్యం ఉంటే నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం నుంచి పేదలకు ఒక్క ఇల్లునైనా తీసుకొచ్చి ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ డిమాండ్ చేశారు. దేశంలో 2014 ఎన్నికల సందర్భంగా బీజేపీ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ మతోన్మాద, కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఈ యాత్ర కొనసాగుతోందన్నారు. తొమ్మిదేండ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఎంతమందికి ఇండ్లు నిర్మించి ఇచ్చిందని ప్రశ్నించారు. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చాక కార్మికులను దోచి పెద్దలకు పంచుతున్నారని విమర్శించారు. కమ్యూనిస్టులు బలంగా ఉన్న రాష్ట్రాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూకలు దాడులకు తెగబడుతున్నాయన్నారు. దేశంలో కార్మికవర్గంపై దాడి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు రమణ, రమ, వెంకట్‌రాములు, భూపాల్, అరుణజ్యోతి, గద్వాల జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు ధర్మానాయక్, విజయ్, సోమన్న, ఆంజనేయులు, బాల్ రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు డప్పులతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కళారూపాలు ప్రదర్శించారు. ప్రతిచోటా జాత బృందానికి ఘనంగా స్వాగతం పలికారు.



## అత్యాశే కొంప ముంచింది

(మొదటిపేజీ తరువాయి)

మరికొందరికి పేపర్ విక్రయించినట్టు తెలిసింది. మంగళవారంతో నిందితుల కస్టడి ముగియడంతో వైద్యపరీక్షల అనంతరం నలుగురిని నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, ఈ కేసులో మరో ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మూడ్రోజుల విచారణలో నిందితులిచ్చిన వివరాలపై దృష్టి సారించిన అధికారులు మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశాలున్నాయి.

### కీలక విషయాలు వెలుగులోకి..

పేపర్ లికేజీ కేసులో ప్రవీణ్, రాజశేఖర్, డాక్యా, రాజేశ్వర్‌ను మూడో రోజు విచారణలో భాగంగా మంగళవారం ఉదయం పోలీసులు సిట్ కార్యాలయానికి తీసుకొచ్చారు. వీరు ఎంతమందికి పేపర్ అమ్మారనే విషయాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో రేణుక, డాక్యా నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు అత్యధికంగా ప్రశ్నాపత్రాలు వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. ఇదిలావుండగా, మేడ్చల్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కేతావత్ శ్రీనివాస్ ద్వారా గోపాల్, నీలేష్ రేణుకకు పరిచయమయ్యారు. వారికి నీలేష్ సోదరుడు రాజేంద్రనాయక్ డబ్బులు సమకూర్చాడు. ముందుగా ఇద్దరు అభ్యర్థులు కలిసి రూ.20లక్షలు చెల్లించే విధంగా రేణుకతో ఒప్పందం చేసుకున్నారు. కానీ, ఒకరు రూ.9లక్షలు చెల్లించగా, మరో అభ్యర్థి రూ.4.50లక్షలు చెల్లించినట్టు దర్యాప్తులో తేలింది. వారినుంచి మొత్తం రూ.13.50లక్షలు తీసుకున్న రేణుక అందులో నుంచి ప్రవీణ్‌కు రూ.10లక్షలు చెల్లించి ఏఈ పేపర్స్‌ను తీసుకుంది. అయితే, సులువుగా పెద్దమొత్తంలో డబ్బులు సంపాదించొచ్చని ఆశపడిన ఆమె భర్త డాక్యానాయక్ మాత్రం చాలా మందికి ప్రశ్నాపత్రం విక్రయించినట్టు అధికారుల విచారణలో తేలినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీలో పనిచేసే కొంత మంది సిబ్బందితోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురికి రహస్యంగా ప్రశ్నాపత్రాలను విక్రయించినట్టు గుర్తించిన అధికారులు వారి వివరాలపై ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో మరో ముగ్గురిని అరెస్టు చేశారు.

### ముగ్గురికి ఐదురోజుల కస్టడీ

ఈ కేసులో మరో ముగ్గురికి ఐదు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. కమిషన్ ఉద్యోగులైన షమీమ్, రమేష్, సురేష్‌ను విచారిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయని గుర్తించిన సిట్ అధికారులు వారిని ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టును కోరారు. అయితే, కోర్టు వారిని ఐదురోజుల కస్టడీకి అనుమతించింది. చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారిని బుధవారం సిట్ అధికారులు కస్టడీకి తీసుకుని విచారించనున్నారు.

## ఒకే కాన్పులో నలుగురు పిల్లలు



**నవతెలంగాణ - ముస్తాబాద్**

ఒకే కాన్పులో ఒకరు ఇద్దరు పుట్టడం సహజం. కానీ నలుగురు జన్మించడం విశేషం. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని పీపుల్స్ ఆస్పత్రిలో జరిగింది. తల్లీపిల్లలు క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్‌కు చెందిన గొట్టేముక్కల లావణ్యకు రెండో కాన్పులో నలుగురు పిల్లలు(ముగ్గురు మగ, ఒక ఆడపిల్ల) జన్మించారు. మొదటి నెల నుంచి కూడా పీపుల్స్ ఆస్పత్రిలోనే లావణ్యకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు చేశామని వైద్యులు శంకర్, అఖిల, తేజస్వి తెలిపారు. పది లక్షల మందిలో ఒకరికి ఇలా ఒకే కాన్పులో నలుగురు జన్మించే అవకాశం ఉంటుందని వైద్యులు చెప్పారు. ప్రస్తుతం నలుగురు పిల్లలను సిద్ధిపేటలోని పిల్లల ఆస్పత్రికి పంపించినట్టు తెలిపారు.

# చరిత్రలేని పార్టీ బీజేపీ

- రాహుల్ అంటే మోడీకి భయం
- రాజ్యాంగ స్ఫూర్తిని ధ్వంసం చేస్తున్న మోడీ
- బీజేపీని ఓడించేందుకు కలిసొచ్చే వాళ్లకు మద్దతు : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి**

చరిత్ర లేని చండాలపు పార్టీ బీజేపీ అని, ఆ పార్టీని గద్దె దించే వరకు కమ్యూనిస్టుల పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని టీఎన్జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనబోమని ప్రకటించి బ్రిటీషోళ్లకు తొత్తులుగా వ్యవహరించి, దేశద్రోహానికి పాల్పడిన హీన చరిత్ర ఆర్ఎస్ఎస్, ఆనాటి హిందూ మహాసభదన్నారు. ఆ సంస్థల వారసులుగా ఉన్న బీజేపీకి జాతీయోద్యమ చరిత్ర లేదని తెలిపారు. ఆ సంస్థలను నడిపిన కేబీ హెడ్గేవార్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనొద్దని ప్రజలకు పిలుపు నివ్వగా సావర్కర్ క్షమాభిక్ష కోరిందని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ అంటే మోడీకి భయం పట్టుకుందన్నారు. ఒక రాజకీయ వ్యాఖ్య చేసినందుకు కోర్టు రెండేండ్ల శిక్ష వేసిందని, ఎంపీగా అనర్హత వేటు వేశారని, అదే ప్రధాని మోడీ రాహుల్‌ను ఉద్దేశించి.. 'నీ జన్మ ఎక్కడా..? నీ తండ్రి ఎవరు..? గాంధీ అని ఎందుకు పెట్టుకున్నవ్.. నెహ్రూ అని ఎందుకు పెట్టుకోలేదు' అంటూ వ్యాఖ్యలు చేసినందుకు వందేండ్ల శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అదానీ అంటే మోడీకి పెంపుడు కొడుకని, అదానీ తప్పు చేయలేదని మోడీ నమ్మే దేవుళ్లపై ప్రమాణం చేసి చెప్పగలడా అని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తూ ప్రభుత్వ రంగ సంస్థలు, జాతి సంపదైన పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, ఎల్ఐసీ, బ్యాంకుల్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నాడని విమర్శించారు. అదానీ అక్రమాలపై జేపీసీ వేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ మిత్రులకు రూ.2 లక్షల కోట్ల పన్నులు మాఫీ చేసిన మోడీ, పేదల సంక్షేమానికి మాత్రం రూ.4 లక్షల కోట్లకు మించి ఖర్చు చేయట్లేదని తెలిపారు. లౌకిక, సమాఖ్య విధానాలు, సార్వభౌమత్వం వంటి రాజ్యాంగ స్ఫూర్తిని బీజేపీ ధ్వంసం చేస్తుందని విమర్శించారు. పేదల కడుపుకొడుతున్న మోడీని ఓడించే వరకు కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని స్పష్టంచేశారు. బీజేపీని గద్దెదించేందుకు కలిసొచ్చే పార్టీలు, శక్తులకు మద్దతు ఇస్తామని తెలిపారు. అదే క్రమంలో రాష్ట్రంలో పేదల సమస్యలపైనా పోరాటాలు చేస్తామని చెప్పారు. మార్క్సిజం కాలం చెల్లిన సిద్ధాంతం కాదు కాలానికి దశ-దిశ చేసే సిద్ధాంతమని తెలిపారు. మనుషులున్నంత కాలం మార్క్సిజం ఉంటుందన్నారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ, సిద్దిపేట జిల్లా కార్యదర్శి పవన్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జిలాల్, మెదక్ జిల్లా కార్యదర్శి తాలిక్, నాయకులు యూసుప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## మినీ మేడారం జాతర హుండీల లెక్కింపు

- వనదేవతల మొత్తం ఆదాయం రూ.1,02,60,605

**నవతెలంగాణ -తాడ్వాయి**

ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు జరిగిన మేడారం సమ్మక్క సారలమ్మ మినీ జాతర సందర్భంగా సందర్శకులు హుండీలో సమర్పించిన నిధులు, విలువైన బంగారం, వెండి ఆభరణాలు, విదేశీ కరెన్సీ, తదితరు కానుకలను మంగళవారం ఎండోమెంట్ ఈవో రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, రెవెన్యూ అధికారి సునీల్ ఆధ్వర్యంలో మేడారం ఎండోమెంట్ ఆవరణలో తాడ్వాయి కెనరా బ్యాంక్ శాఖ అధికారులు నేతృత్వంలో లెక్కించారు. సమ్మక్క వనదేవత హుండీ ఆదాయం రూ. 52,81,584. సారలమ్మ వనదేవత హుండీ ఆదాయం రూ. 46,34,211. పగిడిద్దరాజు హుండీ ఆదాయం రూ. 1,60,830. గోవిందరాజు హుండీ ఆదాయం రూ. 1,83,980. మొత్తం వనదేవతల ఆదాయం రూ.1,02,60,605. అమెరికా డాలర్లు 37, దినార్ 2 నోట్లు మొత్తం 39 విదేశీ కరెన్సీ నోట్లు, 15 తులాల బంగారం, సుమారు 8 కిలోల చిల్లర వెండి వచ్చినట్టు ఎండోమెంట్ ఈవో రాజేంద్రం ప్రకటించారు. స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ సివిల్ పోలీసుల పహారా మధ్యలో భారీ బందోబస్తు నడుమ హుండీల లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ సూపరింటెండెంట్ క్రాంతి, అధికారులు జగదీష్, రాజేశ్వరరావు, బాలకృష్ణ, మధు, రమా, రఘుపతి, పీరన్న, అధికారులు, రెవిన్యూ అధికారి సునీల్, పూజారులు, ఎండోమెంట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇంకెన్నాళ్లు మోడీ జీ..?

- ఉప్పల్‌లో ఐదేండ్లు దాటినా 40 శాతం పూర్తికాని ఎలివేటెడ్ కారిడార్ పనులు
- నిరసన వ్యక్తం చేస్తూ ప్రధాని బొమ్మతో పోస్టర్లు

**నవతెలంగాణ-హైదరాబాద్**

హైదరాబాద్‌లో ప్రధాని మోడీ పోస్టర్లు మరోసారి కలకలం సృష్టించాయి. వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ జాప్యంపై ప్రధాని మోడీకి వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. ట్రాఫిక్ సమస్యను తగ్గించడం కోసం ఎలివేటెడ్ కారిడార్ పనులకు 2018లో రూ.675 కోట్లతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాల్లో పనుల పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని.. కానీ ఇప్పటికీ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఈ క్రమంలో 'మోడీ గారు ఈ ఫ్లైఓవర్ ఇంకెన్ని సంవత్సరాలు కడతారు..? పని ప్రారంభం 5 మే 2018, 5 ఏండ్లు అయినా ఉప్పల్ ఫ్లై ఓవర్ 40 శాతం కూడా పూర్తి కాలేదు' అంటూ గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం ఫ్లై ఓవర్ పిల్లర్లకు పోస్టర్లు అంటించారు. దాంతో ఈ పోస్టర్లు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ఇదిలా ఉండగా, ఈ నిర్మాణ పనులతో ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతి నడంతో జనం నిత్యం ఇబ్బందిపడుతున్నారు.

## టీఎస్‌పీఎస్సీ బోర్డుని ప్రక్షాళన చేయాలి

### చెప్పులు కుడుతూ ఎస్ఎఫ్ఐ నిరసన





**నవతెలంగాణ-కంఠేశ్వర్**

టీఎస్‌పీఎస్సీ పేపర్లను లీకేజీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు చెప్పులు కుడుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. బోర్డు నిర్లక్ష్యం వల్ల నాలుగు లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బోర్డు చైర్మెన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజ్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని కోరారు. పేపర్ల లీకేజీ జరిగి పది రోజులవుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించకపోవడం దుర్మార్గమని, తక్షణమే స్పందించి నిరుద్యోగులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ వల్ల నష్టపోయిన నిరుద్యోగులందరికీ రాష్ట్ర ప్రభుత్వం నెలకి రూ.20వేలు ఆర్థిక సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిస్వాల్ కమిటీ చెప్పిన ఉద్యోగాలన్నింటికీ నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వం నిలబడాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్టు నిరుద్యోగ భృతిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక, నాయకులు వేణు, గణేష్, సాయి కిరణ్, రాహుల్, ఆశీర్వాదం, తదితర నాయకులు పాల్గొన్నారు.

అధికారాన్ని ఎదుర్కోనంత కాలం మేథస్సు
పూర్తి శక్తివంతం కాదు - మేడమ్ డిస్టేల్

సంపాదకీయం

# వెన్నంటిన కడుపులు

'మీ ఇంట్లో ఎవరెవరు ఉంటారు..?' యాంకర్ ప్రశ్న. 'నేను, అమ్మా, నాన్నా, ఇంకా మోడీజీ...' చిన్నారి సమాధనం.'ఔను మేలు చేసేవారు మన ఇంట్లోనే కాదు...గుండెల్లో ఉంటారు' అంటూ ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం గుప్పిస్తున్న ఇలాంటి ప్రకటనలు ఎంతటి హాస్యాస్పదమో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ పార్లమెంట్‌కు శనివారం లిఖితపూర్వకంగా

> నేటీ పరిస్థితికి, దేశ పాలకులకు 'ఇంట్లో ఈగల మోత.. వీధిలో పల్లకీల మోత...' సామెత సరిగ్గా సరిపోతుంది. మాటలు కోటలు దాటుతాయి కానీ, చేతలు పేదోడికి ఒక పూట తిండి కూడా పెట్టడం లేదు. వారు ప్రకటనలో చెప్పినట్టు మోడీనే ప్రతి ఇంట్లో ఉంటే ఇలా ఎందుకుండేది? దేశ సంపదను కేంద్రం కార్పొరేట్లకు ధార పోస్తున్నదనేది జగమెరిగిన సత్యం. అప్పుల భారం తీర్చుకోవడానికి ప్రభుత్వరంగ సంస్థలను తన మిత్రులకు అప్పనంగా కట్టబెడుతున్నది. అక్కడి నుంచి తెచ్చిన డబ్బులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. ఒక వైపు దేశ పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది.

ఇచ్చిన సమాధానం తేటతెల్లం చేస్తోంది. పౌష్టికాహార లోపాలున్న పిల్లలు భారతదేశంలోనే అధికంగా ఉండటం దేనికి సంకేతం. దేశంలో ఆరేండ్లలోపు పిల్లలు 22కోట్ల మంది ఉన్నారు. రాబోయే కాలంలో వివిధ రంగాల్లో సేవలు అందించే ఈ తరం ఆరోగ్యంపైనే దేశ ఆర్థిక వ్యవస్థ, సమాజ పురోభివృద్ధి ఆధారపడి ఉంటుంది. వేగంగా మారుతున్న ప్రపంచంలో... అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో పౌష్టికాహార లోపం ఈ తరాన్ని తీవ్రంగా వేదిస్తోంది.

మిషన్ పోషన్ కింద 'పోషన్ ట్రాకర్' ప్రకారం ఫిబ్రవరిలో 5.6కోట్ల మంది చిన్నారుల్లో 43లక్షల మంది (7.7శాతం మంది) పోషకాహార లోపాన్ని కలిగి ఉన్నట్టు గుర్తించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (2019-21) సమాచారాన్ని కేంద్ర మంత్రి సభలో వెల్లడించారు. ఈ సమాచారం ప్రకారం... దేశంలోని ఐదేండ్లలోపు చిన్నారుల్లో పెరుగుదల సమస్యలున్నాయి. 35.5శాతం పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లేదు. ఎత్తుకు తగిన బరువులేని వారు 19.3శాతం ఉంటే, అయిదేండ్లలోపు పిల్లల్లో 44.3శాతం మంది తక్కువ బరువుతో ఉన్నారని ఈ నివేదిక పేర్కొంది. ఇది ఆందోళన కలిగించే అంశం. ఈ సర్వే నిర్వహించింది స్వయనా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖే కావడం గమనార్హం.



దేశంలోని మూడేండ్లలోపు పిల్లల్లో 47శాతం తక్కువ బరువుతో ఉన్నారని యునిసెఫ్ అంచనా. ప్రపంచంలోని మొత్తం పౌష్టికాహార లోపాలతో ఉన్న పిల్లల్లో మూడోవంతు మనదేశంలోనే ఉన్నారని యూనిసెఫ్ స్పష్టం చేస్తోంది. మరోవైపు ఆహార సంక్షోభం, ప్రపంచ ఆర్థిక మాంద్యం ఇప్పటికే తీవ్రంగా ఉన్న ఈ పౌష్టికాహార సమస్యను మరింత జటిలం చేశాయని నివేదికలు చెబుతున్నాయి. పిల్లల్లోనే కాదు, తల్లుల్లో కూడా ఈ సమస్య తీవ్రంగా ఉందని వివిధ అధ్యయనాలు తెలుపుతున్నాయి. దేశంలోని పిల్లల్లో 80శాతం, మహిళల్లో 56శాతం రక్తహీనతతో బాధపడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది. ఇతర అన్ని రంగాల్లో మాదిరిగానే పౌష్టికాహార లోపాల్లోనూ అణగారిన వర్గాల ప్రజలు తీవ్రస్థాయిలో వెనుకబడి ఉన్నారనేది వాస్తవం. వారిలోనే తక్కువ బరువున్న పిల్లలు 14 నుంచి 20శాతం అధికంగా ఉన్నారు. బాలికల్లో ఇంకాస్త ఎక్కువగా ఇది ఉంది. ఇది వారి పట్ల నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది.

ఆహార ద్రవ్యోల్బణం కూడా పౌష్టికాహార లోపాలకు కారణమవుతోంది. దేశంలోని 30శాతం కుటుంబాలు పెరుగుతున్న ధరల వల్ల ఆహార వినిమయాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది. భారత్‌లో 24శాతం పిల్లలు రోజంతా ఆహారం లేకుండా ఉంటున్నారని 'సేవ్ ది చిల్డ్రన్ ఇంటర్నేషనల్' అనే స్వచ్ఛంద సంస్థ జరిపిన సర్వేలో వెల్లడైంది. ప్రజల ఆహార భద్రతను రక్షించడంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం కీలకం. పౌష్టికాహార లోపం కేవలం ఆరోగ్యపరమైన సమస్య మాత్రమే కాదు. వ్యక్తి, కుటుంబం, సమాజంపై ఇది విస్తత దుష్ప్రభావాన్ని చూపుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ఇది ఆర్థికాభివృద్ధిని దెబ్బతీస్తుంది. పేదరికాన్ని పెంచుతుంది. శారీరక శ్రమ శక్తిని తగ్గిస్తుంది. ఫలితంగా ఉద్పాదకత తగ్గిపోతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) విశ్లేషించింది. రోగనిరోధక శక్తిని తగ్గించి, అంటురోగాల దుష్ప్రభావాన్ని తీవ్రతరం చేస్తుంది. విద్య, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఆహార సబ్సిడీలు, ఆహార భద్రత కార్యక్రమాలపై విమర్శలు చేసేవారు దేశ పౌష్టికాహార స్థితిగతులపై వెల్లడవుతున్న ఈ గణాంకాలను చూసైనా అభివృద్ధి పట్ల సరైన దృక్పథాన్ని పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

నేటీ పరిస్థితికి, దేశ పాలకులకు 'ఇంట్లో ఈగల మోత.. వీధిలో పల్లకీల మోత...' సామెత సరిగ్గా సరిపోతుంది. మాటలు కోటలు దాటుతాయి కానీ, చేతలు పేదోడికి ఒక పూట తిండి కూడా పెట్టడం లేదు. వారు ప్రకటనలో చెప్పినట్టు మోడీనే ప్రతి ఇంట్లో ఉంటే ఇలా ఎందుకుండేది? దేశ సంపదను కేంద్రం కార్పొరేట్లకు ధార పోస్తున్నదనేది జగమెరిగిన సత్యం. అప్పుల భారం తీర్చుకోవడానికి ప్రభుత్వరంగ సంస్థలను తన మిత్రులకు అప్పనంగా కట్టబెడుతున్నది. అక్కడి నుంచి తెచ్చిన డబ్బులు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు. ఒక వైపు దేశ పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. అయినా మేం గొప్పవాళ్లం, దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నామంటూ చెప్పుకోవడం సిగ్గుచేటు.

# ఎదురుదెబ్బలు తగిలినా ఆగని అమెరికా యుద్ధోన్మాదం!

ఇటీవలి వరకు అమెరికా తొత్తుగా ఉన్న హొండూరాస్ - ఎలా ఉందంటే తైవాన్‌ను ఒక దేశంగా గుర్తించి సంబంధాలు పెట్టుకున్నది - ఆదివారంనాడు దానితో సంబంధాలను తెగతెంపులు చేసుకొని చైనాతో దౌత్య సంబంధాలను ఏర్పాటు చేసుకుంది. అక్కడ వామపక్షశక్తులు అధికారానికి రావటమే ఈ మార్పుకు కారణం. మారుతున్న బలాబలాలకు నిదర్శనంగా 2016 నుంచి ఇప్పటి వరకు తొమ్మిది దేశాలు తైవాన్‌ను వదలి చైనాతో సంబంధాలు పెట్టుకున్నాయి. హొండూరాస్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఒక ప్రతినిధి వర్గాన్ని పంపిన అమెరికా చివరికి చేసేదేమీలేక మీ నిర్ణయాన్ని గౌరవిస్తామంటూ హొండూరాస్‌కు చెప్పింది. ఈ పరిణామం తైవాన్‌ను గుర్తిస్తున్న ఇతర దేశాల మీద కూడా పడుతుందని వేరే చెప్పనవసరం లేదు. తైవాన్‌ను గుర్తించినందుకు ప్రతిఫలంగా అమెరికా, తైవాన్ నుంచి కూడా సదరు దేశాలకు పెట్టుబడులు, ఇతరంగా ప్రతిఫలం ముడుతున్నది. అది ఎంతో కాలం కొనసాగించలేరని ఒక్కొక్కటి జారుకుంటున్న తీరు వెల్లడిస్తున్నది. ఈ నెల 29 నుంచి ఏప్రిల్ ఏడవ తేదీ వరకు తైవాన్ ప్రాంత పాలకురాలు త్సై ఇంగ్ వెన్ లాటిన్ అమెరికా, అమెరికా తదితర దేశాలను సందర్శించనున్నారు. తైవాన్ వేర్పాటు వాదులకు ప్రపంచంలో ఎంతో మద్దతు ఉందని చెప్పి విశ్వాసం కల్పించేందుకు ప్రధానంగా ఆమె వెళుతున్నారు. పైకి ఏమి చెప్పినప్పటికీ తమకు చైనా నుంచి ముప్పు వస్తున్నదని ప్రచారం చేసేందుకు పూనుకున్నారు. ఇదంతా అమెరికా ఆడిస్తున్న నాటకం అన్నది తెలిసిందే.



ఎం. కోటేశ్వరరావు

ఇటీవలి కాలంలో తమ ఆధిపత్యానికి సవాలు ఎదురవుతున్నదనే భయం అమెరికాను పట్టి పీడిస్తున్నది. 'నడమంత్రపు సిరి నరం మీది పుండు కుదురుగా ఉండనివ్వవు' అన్నట్లుగా అమెరికా ఆయుధ ఉత్పత్తిదారులు నిరంతరం ఎక్కడో ఒక చోట ఉద్రిక్తత, రక్తపాతాన్ని కోరుకుంటారు. దానికి అనుగుణంగా అమెరికా ప్రభుత్వం పని చేస్తుంది. గత వారంలో అమెరికా మిలిటరీ జాయింట్ ఛీఫ్‌ల చైర్మన్ మార్క్ మిలే, అమెరికా రక్షణ మంత్రి లాయడ్ ఆస్టిన్ రక్షణశాఖ పార్లమెంటరీ ఉపకమిటీ ముందు మిలిటరీ విధానం, ఆలోచనల గురించి మాట్లాడారు. రికార్డు స్థాయిలో మిలిటరీ బడ్జెట్ ప్రధానంగా చైనాకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టినదని స్పష్టం చేశారు. చైనాతో పోరుకు తమను సన్నద్దం చేస్తుందని అన్నారు. ఉప సంఘం చైర్మన్ కెన్ క్లవర్ట్ తొలి పలుకులు పలుకుతూ అవసరమైతే ఈ రాత్రికి రాత్రే పోరుకు సిద్ధంగా ఉండాలి. ప్రపంచంలో ఎదురులేని శక్తిగా వేగంగా నవీకరించాలని ప్రకటించాడు. చైనా మిలిటరీతో అమెరికా వ్యూహాత్మక పోటీ దృష్టితో రూపొందించిన బడ్జెట్ అని ఆస్టిన్ చెప్పాడు. మార్క్ మిలే మాట్లాడుతూ రానున్న పది సంవత్సరాల్లో పశ్చిమ పసిఫిక్, ఆసియాలో చైనా పెద్దదిగా ఉంటుందని, 2049 నాటికి మొత్తంగా సామర్థ్యంలో అమెరికా మిలిటరీని అధిగమించనుందని వర్ణించాడు. ప్రస్తుతం మొత్తం 10,330 యూనిట్లు ఉన్నాయని, వాటిలో 4,680 చురుకైన విధుల్లో ఉన్నట్లు, అవి ఎంతగా అంటే వాటిలో అరవైశాతాన్ని 30 రోజుల్లో, పదిశాతాన్ని కేవలం 96గంటల లోపుగానే మోహరించవచ్చని చెప్పాడు. ఈ సన్నద్ధతను కొనసాగించేందుకు జోబైడెన్ ప్రభుత్వం రికార్డు స్థాయిలో బడ్జెట్‌ను కేటాయించిందన్నారు. దీనితో ప్రతి విభాగాన్ని సంసిద్ధం గావించవచ్చన్నారు. మొత్తం లక్ష కోట్ల డాలర్లను బైడెన్ సర్కార్ సిద్ధం చేసింది. ఉక్రెయిన్‌పై రష్యా మిలిటరీ చర్యను అవకాశంగా తీసుకొని ఎలాంటి టెండర్లతో నిమిత్తం లేకుండా అమెరికాతో సహ అనేక దేశాల్లో నేరుగా పరికరాలు, అస్త్రాలను కొనుగోలు చేస్తున్నారు. మిలిటరీ ఎత్తుగడల గురించి కూడా మిలే, ఆస్టిన్ వెల్లడించారు. దేశ ఉద్దేశ్యాలు శాంతియుతమైనవే, హింసాకాండ జరగవచ్చనే బెదిరింపులతో అమెరికా తన ఆలోచనలను రుద్దాలి అవి విఫలమైతే హింసాకాండకు దిగాలి అన్నారు. యుద్ధం కంటే ఖర్చు ఎక్కువ కానప్పటికీ యుద్ధసన్నద్ధత, నిరోధించటం కూడా అసాధారణ రీతిలో ఖర్చుకు దారితీస్తుంది. ఈ భారీ బడ్జెట్ యుద్ధాన్ని నిరోధిస్తుంది, అవసరమైతే పోరుకు మనల్ని సన్నద్ధ పరుస్తుందని మిలే వాదించాడు. ఇలాంటి మాటలతో అమెరికన్లను, ప్రపంచ జనాలను మభ్యపెట్టేందుకు గతంలో అనేక మంది మిలిటరీ అధికారులు చూశారు. దీని వెనుక మిలిటరీ పరిశ్రమల అధిపతులకు లబ్ది చేకూర్చే ఎత్తుగడ ఉంది. నిజానికి చరిత్రలో హిట్లర్ మిలిటరీ అధికారులు కూడా ఇదేవిధంగా మాట్లాడారు, జర్మన్లను మభ్యపెట్టారు. వారిలో ఒకడైన ఎరిక్ రాడెర్ జర్మన్ నావికాదళ అధికారి, రెండవ ప్రపంచ యుద్ధ నేరాలను విచారించిన న్యూరెంబర్గ్ కోర్టులో చేసిన ఇదే వాదనలను తిరస్కరించి జీవితకాల శిక్ష వేశారు. జర్మనీకి దుష్ట ఆలోచనలు లేవని, మిలిటరీ బలంగా ఉంటే కోరుకున్న ప్రాంతాలను యుద్ధంతో నిమిత్తం లేకుండా బలాన్ని చూపి పొందవచ్చని వాదించాడు. నిజానికి మిలిటరీని పెంచటమేగాక, దాడుల పథకంలో కూడా ఎరిక్ రాడెర్ చురుకైన పాత్రధారి అని కోర్టు నిర్ధారించింది. ఆర్థికంగా దిగజారుడును మిలిటరీ హింసాకాండ ద్వారా పూడ్చుకోవచ్చని అమెరికా అధికారులు చెబుతున్నారు. "ఏ దేశంలోనూ లేని విధంగా చైనాలో సంపద, వృద్ధి జరుగుతున్నట్లు మనకు కనిపిస్తున్నది. విపరీతంగా సంపద పెరిగితే ప్రపంచ వ్యాపితంగా అధికారం కూడా అలాగే పెరుగుతుంది. ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న మనం ఎల్లవేళలా అదే స్థానంలో ఉండాలని" మిలే చెప్పాడు.

సినిమాలు, టీవీ చిత్రాల ద్వారా అమెరికన్లకు ముప్పు ఎలా ఎటు వైపు నుంచి వస్తున్నదో చూపటం అక్కడ జరుగుతున్నది. వాటిలో గతంలో రష్యన్లు, ఇతర అమెరికా వ్యతిరేకులను ప్రతినాయకులుగా చూపే వారు. వారి మీద అమెరికన్లలో ద్వేషం పుట్టించేవారు. ఇప్పుడు చైనా, ఇతర దేశాల వారిని కూడా ప్రధానంగా చూపుతున్నారు. దానిలో భాగంగానే ఇటీవల కొన్ని అమెరికా సంస్థలు, పార్లమెంటులోని రిపబ్లికన్ పార్టీ సభ్యులు కొన్ని ఊహాజనిత యుద్ధ క్రీడలను కంప్యూటర్లలో సృష్టించి జనానికి చూపుతున్నారు. వాటి ప్రకారం 2025నాటికి తైవాన్ అంశం మీద అమెరికా-చైనా పోరుకు తలపడతాయని, దానిలో చైనా ఓడిపోతుందని చిత్రించారు. ఇది హాలీవుడ్ సినిమా వంటిదే. వాటిలో అమెరికా సిఐఏ గూఢచారులను తెలివిగలవారిగా ఇతర దేశాల వారిని దద్దమ్మలుగా చిత్రిస్తారు. నిజానికి ఇంతవరకు ఏ ఒక్క యుద్ధంలోనూ అమెరికా గెలిచిన ఉదంతం లేదు. దాన్ని సీఐఏ పసిగట్టి తమ నేతలను హెచ్చరించి పరువు నిలిపిందీ లేదు. అమెరికా రిటైర్డ్ నావీ అధికారి మార్క్ మాంట్‌గోమరీ ఓర్లాండోలో రిపబ్లికన్ ఎంపీలకు చైనాతో పోరు అనే ఒక ఊహ చిత్రాన్ని చూపాడు. దానిలో వేలాది మంది అమెరికన్లు మరణిస్తారని, విమానవాహక నావలను ముంచివేస్తారని చిత్రించాడు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో మిలిటరీలో పని చేస్తున్న వారిలో 15 నుంచి 50 మంది లేదా దేశం మొత్తంగా ఐదు

> 1959లో టిబెట్‌లో దలైలామా తిరుగుబాటు, అదే ఏడాది చైనా అణుకార్యక్రమానికి సహకరించేది లేదని సోవియట్ ప్రకటించింది. రెండు దేశాల పార్టీల మధ్య సైద్ధాంతిక విబేధాలు తీవ్రమవుతున్న తరుణంలో అన్ని అంశాలను చూసినపుడు వెనక్కు తగ్గటమే మంచిదని నాటి చైనా నాయకత్వం భావించింది. తరువాత దేశాన్ని పటిష్టం గావించటం మీద శ్రద్ధ పెట్టింది. ఇప్పుడు ఆ బలహీనతలన్నింటినీ అధిగమించింది. గతంలో ఐసెన్ హొవర్ మాదిరే ఇప్పుడు జో బైడెన్ కూడా ఉక్రెయిన్ మాదిరి కాకుండా అవసరమైతే మిలిటరీని దింపుతామని ప్రకటించాడు. గతంలో మావో మాదిరి ఇప్పుడు షీ జిన్‌పింగ్ వెనక్కు తగ్గేందుకు సిద్ధం కాదు. అన్ని రంగాల్లో ఢీ అంటే ఢీ అనేందుకు ధీటుగా దేశాన్ని రూపొందిస్తున్నాడు. అందుకే నిప్పుతో చెలగాటాలాడవద్దని బైడెన్‌తో భేటీలో షీ జిన్‌పింగ్ హెచ్చరించగలిగాడు.



నుంచి ఇరవైవేల మంది ఒక వారంలో మరణిస్తారని చూపాడు. దానిలో తైవాన్ రక్షణకు అమెరికా దళాలు చైనా ప్రధాన ప్రాంతంపై ఎలాదాడి చేసేది, దాని నౌకలను ఎలా ముంచేది, మిలిటరీని ఎలా చక్రబంధం చేసేది, వివిధ కోణాల్లో జరిగే పర్యవసానాలను చూపారు. ఇలాంటి వాటిని బూచిగా చూపి అమెరికా తన దుర్మార్గాలను జనంతో ఆమోదింప చేసుకునేందుకు చూస్తున్నది. ఉక్రెయిన్ మాదిరి కాకుండా తైవాన్ ఆక్రమణకు చైనా పూనుకుంటే నేరుగా అమెరికా మిలిటరీని దింపుతారా అన్న ప్రశ్నకు జో బైడెన్ అవును అని సమాధానమిచ్చాడు.

ప్రజాబలం, పట్టుదలలో ఎంతో ఉన్నతంగా ఉన్నప్పటికీ మిలిటరీ రీత్యా అమెరికాతో 50సంవత్సరాల నాడు వియత్నాం సరితూగే స్థితిలో లేదు. అయినా బతుకు జీవుడా అంటూ అమెరికా మిలిటరీ ఎలా పారిపోయిందీ ప్రపంచమంతా చూసింది. ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిందీ అదే. తాలిబాన్లకు సలాం కొట్టి అమెరికన్లు వెళ్లారు. అలాంటిది చైనాతో ఢీకొనగలమని అమెరికన్లను నమ్మించేందుకు అక్కడి యుద్ధోన్మాదులు చూస్తున్నారు. "నూతన యుగంలో తైవాన్ సమస్య, చైనా పునరేకీకరణ" అనే పేరుతో 2022 ఆగస్టు పదవ తేదీన చైనా ఒక శ్వేత పత్రాన్ని ప్రకటించింది. తైవాన్ తనలో అంతర్భాగమే అని మరోసారి స్పష్టం చేసింది. ఒకే చైనా సూత్రానికి ఐరాస సాధారణ అసెంబ్లీ 2758వ తీర్మానం ద్వారా కల్పించిన చట్టబద్ధతపై ఎలాంటి సందేహం లేదని, ప్రపంచమంతటా గుర్తింపు పొందిందని దానిలో పేర్కొన్నారు. శాంతియుతంగా పునరేకీకరణ జరగాలని, తప్పనిసరైతే బలప్రయోగం తప్పదని కూడా స్పష్టం చేశారు. ఒకే దేశం-రెండు వ్యవస్థలనే విధానం కింద తైవాన్‌కు హామీ ఇస్తున్నట్లు తెలిపింది.

ఏడు దశాబ్దాల నాడున్న చైనాకు నేటి చైనాకు ఏ విధంగానూ పోలికే లేదు. ఇరాన్-సౌదీ ఒప్పందాన్ని కుదిర్చి తన పలుకుబడి ఏమిటో ప్రదర్శించింది. ఇక గతానికి సంబంధించి చూస్తే1949లో చైనా విముక్తి జరిగినప్పటికీ దాన్ని సుస్థిరం కావించుకొనేందుకు కమ్యూనిస్టులకు పది సంవత్సరాలు పట్టింది.డేనియల్ ఎల్స్‌బర్గ్ బహిర్గతపరచిన పెంటగన్ పత్రాల్లో ఉన్న సమాచారం తైవాన్ విలీనం గురించి కొన్ని అంశాలను వెల్లడించింది. 1958లో తైవాన్ విలీనానికి పూనుకోవాలని మావో నిర్ణయించారు. దాన్ని గ్రహించిన అమెరికన్లు వెంటనే సప్తమ నౌకా దళాన్ని దాడికి వీలైన దూరానికి నడిపించారు. ఒక వేళ మిలిటరీ తైవాన్‌ను కాపాడలేకపోతే అణ్వస్త్రాలను ప్రయోగించేందుకు అధ్యక్షుడు ఐసెన్ హొవర్ అనుమతి ఇచ్చాడు. తైవాన్ పాలకుడు చాంగ్‌కై షేక్‌ను, తైవాన్‌ను ఎలాగైనా కాపాడటం అమెరికాకు ప్రాముఖ్యత కలిగిన అంశం. అందుకు పూనుకొని విఫలం కావటం ఆసియాలో పరువు తక్కువ, దాన్ని కాపాడుకొనేందుకు ఎంతకైనా తెగించాల్సిందేనని మిలిటరీ జనరల్స్ చెప్పారు. అప్పటికే అవసరం లేకున్నా జపాన్‌పై అణు దాడి జరిపిన అమెరికా కమ్యూనిజం విస్తరణను అడ్డుకొనేందుకు ఎంతకైనా తెగించేందుకు పూనుకుంది. తైవాన్‌కు సమీపంలోని ప్రధాన భూభాగంలో ఒక చిన్న మిలిటరీ కేంద్రం తప్ప చైనా వద్ద అప్పటికి అణుబాంబులు గానీ, విమానవాహక నౌకలుగానీ లేవు. ఆర్థికంగా పటిష్టత కూడా లేదు. సోవియట్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేదు. 1959లో టిబెట్‌లో దలైలామా తిరుగుబాటు, అదే ఏడాది చైనా అణుకార్యక్రమానికి సహకరించేది లేదని సోవియట్ ప్రకటించింది. రెండు దేశాల పార్టీల మధ్య సైద్ధాంతిక విబేధాలు తీవ్రమవుతున్న తరుణంలో అన్ని అంశాలను చూసినపుడు వెనక్కు తగ్గటమే మంచిదని నాటి చైనా నాయకత్వం భావించింది. తరువాత దేశాన్ని పటిష్టం గావించటం మీద శ్రద్ధ పెట్టింది. ఇప్పుడు ఆ బలహీనతలన్నింటినీ అధిగమించింది. గతంలో ఐసెన్ హొవర్ మాదిరే ఇప్పుడు జో బైడెన్ కూడా ఉక్రెయిన్ మాదిరి కాకుండా అవసరమైతే మిలిటరీని దింపుతామని ప్రకటించాడు. గతంలో మావో మాదిరి ఇప్పుడు షీ జిన్‌పింగ్ వెనక్కు తగ్గేందుకు సిద్ధం కాదు. అన్ని రంగాల్లో ఢీ అంటే ఢీ అనేందుకు ధీటుగా దేశాన్ని రూపొందిస్తున్నాడు. అందుకే నిప్పుతో చెలగాటాలాడవద్దని బైడెన్‌తో భేటీలో షీ జిన్‌పింగ్ హెచ్చరించగలిగాడు.

సెల్: 8331013288



## గూడు చెదిరిన పక్షులు

పొద్దున్నే మోగే అలారం
సడీ సప్పుడులేకుండా
ఆగిపోయింది
గుప్పెడు కోరికల గింజల్ని
నాటుకున్న నిరుద్యోగ పక్షిపిల్లలు
గూడు చెదిరి
అల్లకల్లోలమయ్యాయి

భుజాల మీది కలలపావురాలను
ఎవడో ఎత్తుకెళ్ళాడు
ఎవరి దేహం వారికి బరువయ్యి
ఒకటే నరకయాతన

సందేహాలు
నీలినీడల్లా కమ్ముకొని
వేయాల్సిన అడుగులను
కత్తిరిస్తున్నాయి
దుప్పటి కప్పుకుని
నిద్రిస్తున్న వ్యవస్థలన్నీ
ఎవడి చేతిలోనో
పావులయి కలవరపెడుతున్నాయి

లోలోపలి దిగుల్ల దూగుళ్ళన్ని
సూర్యుని వైపు చూస్తూ
స్వచ్ఛమైన కిరణాలను కాసే
ఒకానొక ఉదయాన్ని కాంక్షిస్తూ
వేచిచూస్తున్నాయి.

- తండ హరీష్ గౌడ్
8978439551

# పెత్తనం కేంద్రానిది... బాధ్యతలు రాష్ట్రాలకు... భారాలు ప్రజలకు...

పెత్తనం కేంద్రానిది. లాభాలు ఆశ్రిత పెట్టుబడిదారులవి, కార్పొరేట్ సంస్థలవి. బరువు బాధ్యతలు రాష్ట్రాలవి. భారాలు ప్రజలకు. విద్యుత్ రంగంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి, విధానాల పర్యవసానాల సారాంశం ఇది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రాష్ట్రాలపై బాధ్యతలు పెరుగుతున్నాయి. వినియోగదారులపై భారాలు పెరుగుతున్నాయి. కేంద్రం ఎటువంటి బాధ్యతను వహించటం లేదు. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను (డిస్కామ్) గట్టెక్కించే పేరుతో షరతులతో కూడిన పథకాలను కేంద్రం ప్రవేశపెడుతున్నది. డిస్కాముల పేరుకుపోయిన నష్టాలు, అప్పులలో అధిక భాగం రాష్ట్ర ప్రభుత్వాలు భరించటం ఈ పథకాల సారాంశం. ఆర్థిక పునర్నిర్మాణ పథకం, ఉజ్వల్ డిస్కాం ఎస్యూరెన్స్ యోజన (ఉదయ్), అందరికి విద్యుత్ వంటి పథకాలను కేంద్రం ప్రతిపాదించింది. వాటిపై రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి డిస్కాములతో ఒప్పందాలపై సంతకాలు చేయించింది. ఈ పథకాల ప్రకారం ఉభయ తెలుగు రాష్ట్రాలు గత ఎనిమిదేళ్ళుగా వేల కోట్ల రూపాయల మేరకు వాటి డిస్కాముల పేరుకుపోయిన నష్టాలను, అప్పులను భరిస్తూ వస్తున్నాయి. 2015 నవంబరు 20న ప్రవేశపెట్టిన ఉదయ్ పథకం కింద తెలంగాణ ప్రభుత్వం 2022-23 వరకు రూ.15,976.80 కోట్ల మొత్తాన్ని డిస్కామ్‌లకు సమకూర్చింది. ఇందులో రూ.8015.91 కోట్లు గ్రాంటు కాగా, రూ. 7960.89 కోట్లు ఈక్విటీగా చేసిన సర్దుబాటు. ఈ మొత్తాలు మన రాష్ట్ర ప్రభుత్వం ఏటేటా సమకూర్చుతున్న వేల కోట్ల రూపాయల సబ్సిడీలకు అదనం. 2023-24లో తెలంగాణ ప్రభుత్వం రూ.9124.82 కోట్ల మేరకు సబ్సిడీ ఇచ్చేందుకు అంగీకరించింది. దీనికి తోడు తెలంగాణ ప్రభుత్వం టిఎస్ఇఆర్‌సి నిర్ధారించిన ట్రూఅప్ (2022-23 వరకు ఏడేళ్ళ కాలానికి) నిమిత్తం రూ.12718.40 కోట్ల మొత్తాన్ని డిస్కామ్‌లకు చెల్లించేందుకు అంగీకరించింది. ఈ భారాల పెరుగుదలకు తన విధానాలు ప్రధాన కారణమైన మోడీ ప్రభుత్వం మాత్రం తానుగా ఇందుకు దమ్మిడీ ఆర్థిక సహాయం చేయటం లేదు. గత ఎనిమిదేళ్ళ మోడీ ప్రభుత్వ కాలంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇచ్చిన రుణాల పారుబకాయిలు దాదాపు పదకొండు లక్షల కోట్ల రూపాయల మేరకు మాఫీ అయ్యాయి. ఇందులో అత్యధిక భాగం ప్రయివేటు కార్పొరేట్ సంస్థల పారుబకాయిలే. రాష్ట్ర ప్రభుత్వాల డిస్కామ్‌ల రుణాల బకాయిలలో ఈ విధంగా ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు.




ఎం. వేణుగోపాలరావు
9441193749

### షరతులతో... కేంద్రం దోపిడీ!

డిస్కామ్‌లు వాటికి విద్యుత్ సరఫరా చేస్తున్న ఉత్పత్తిదారులకు, ముఖ్యంగా ప్రయివేటు ఉత్పత్తిదారులకు, భారీగా బకాయి పడటంతో కేంద్రం అప్పులు మంజూరు చేయించేందుకు ప్రతిపాదించి, అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ గ్యారంటీ ఇచ్చేందుకు షరతు విధించింది. కేంద్రానికి చెందిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, గ్రామీణ విద్యుత్ సంస్థలతో అలా మంజూరు చేయించిన రుణాల మొత్తాలను విద్యుత్ ఉత్పత్తిదారులకు నేరుగా ఆ రుణ సంస్థలతో చెల్లింపచేసింది. డిస్కాములకు మంజూరు చేసిన ఆ సంస్థలు ఈ రుణాలపై బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ రేట్లు వసూలు చేస్తున్నాయి. దీనివల్ల ప్రయివేటు విద్యుత్ ఉత్పత్తిదారుల అవసరాలు తీరుతున్నాయి. రుణాలిచ్చిన కేంద్ర ఆర్థిక సంస్థలకు లాభదాయక వడ్డీ వ్యాపారం జరుగుతున్నది. ఇలాంటి పథకాల వల్ల విద్యుత్ ఉత్పత్తిదారులకు డిస్కాముల బకాయిలు కేంద్ర రుణ సంస్థలకు చెల్లించాల్సిన రుణాల బకాయిలుగా మారుతున్నాయి. డిస్కాముల ఆర్థిక పరిస్థితి మెరుగుపడేందుకు ఇలాంటి ఏర్పాట్లు ఏ మాత్రం దోహదం చేయటం లేదు.

మంత్రివర్గంలో, పార్లమెంటులో, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండా ప్రధానమంత్రి మోడీ





అంతర్జాతీయ వేదికలపై ఏకపక్షంగా పునరుత్పత్తి విద్యుత్తును (ఆర్.ఇ) దేశం అదనంగా చేర్చే లక్ష్యాలుగా ప్రకటించారు. వాటికి అనుగుణంగా, అవసరం లేని ఆర్.ఇ ని ఆర్‌పిపిఓ పేరుతో, దాని కింద నిర్ణయించిన మితిమీరిన లక్ష్యాలకు మించి డిస్కాములు కొనుగోలు చేయటం వల్ల నివారించదగిన అదనపు భారాలు వినియోగదారులపై పడుతున్నాయి.

అవసరం లేని ఆర్ఇ కొనుగోలు వల్ల విపరీతంగా మిగులు విద్యుత్ తేలి, వినియోగదారులపై ట్రూఅప్ రూపంలో భారాలు పడుతున్నాయి. వాటిని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయటం లేదు. మిగులు విద్యుత్తుతో విద్యుత్ ప్రాజెక్టుల ఉత్పత్తి సామర్థ్యం నిరుపయోగంగా ఉన్న మేరకు రాష్ట్రాలు పిపిఎల ప్రకారం పొందని విద్యుత్‌కు స్థిర ఛార్జీలను వేల కోట్ల రూపాయల మేరకు చెల్లించాల్సి వస్తున్నది. ఆ భారాలు వినియోగదారులపై పడుతున్నాయి. ఇది ఆందోళనకర అంశమని పేర్కొంటూ, అలా చెల్లిస్తున్న స్థిర ఛార్జీల నిమిత్తం కేంద్రం సహాయం అందించాలని ఫోరం ఫర్ రెగ్యులేటర్స్ సిఫార్సు చేసింది. కేంద్ర ప్రణాళికా నిధులను సమకూర్చుతున్న పద్ధతిలోనే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ఈ భారాన్ని 60:40 నిష్పత్తిలో భరించాలని ఫోరం సిఫార్సు చేసింది. మోడీ ప్రభుత్వం నుండి దీనిపై చలనం లేదు.

స్వచ్ఛ ఇంధన సుంకాన్ని (సిఇఎస్) టన్ను బొగ్గుకు రూ.400 చొప్పున కేంద్రం వసూలు చేస్తున్నది. దీనిని తగ్గించాల్సిన అవసరం ఉందని, పరిసరాల నియమాలను పాటించేందుకయ్యే ఖర్చుల నిమిత్తం సియిఎస్ మొత్తాన్ని విద్యుత్ రంగానికివ్వాలని ఫోరం సిఫార్సు చేసింది. సియిఎస్‌ను కేంద్రం జీఎస్‌టిలో చేర్చి వసూలు చేస్తున్నది. బొగ్గు, సహజ వాయువు ధరలను సహేతుకంగా నిర్ణయించాలని, ఇందుకు స్వతంత్ర రెగ్యులేటర్ను నియమించాలని ఫోరం సిఫార్సు చేసింది. బొగ్గు రవాణాకు రైల్వే చార్జీలలో కేంద్రం సబ్సిడీ యిచ్చే అంశాన్ని పరిగణించాలని సిఫార్సు చేసింది. కేంద్రం చేసిన కేటాయింపుల మేరకు సహజ వాయువును సరఫరా చేయించక పోవటంతో, ఆ ఇంధనంతో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు నిరుపయోగంగా ఉన్నాయి. అయినా, పిపిఎల నిబంధనల ప్రకారం డిస్కాంలు వాటికి స్థిర ఛార్జీలను చెల్లించాల్సి వస్తున్నది. ఈ స్థిర చార్జీలను చెల్లించేందుకు కేంద్రం డిస్కాంలకు సహాయం అందించాలని ఫోరం సిఫార్సు చేసింది. మోడీ ప్రభుత్వం ఈ సహేతుక సూచనలను పట్టించుకోకుండా యథావిధిగా మొరాయిస్తున్నది. బొగ్గు దిగుమతి చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆదేశిస్తున్న మోడీ ప్రభుత్వం, అందుకయ్యే అధిక వ్యయ భారాన్ని వినియోగదారులపై తగ్గించేందుకు ఎలాంటి సహాయం చేయటం లేదు.

వ్యవసాయేతర విద్యుత్ కనెక్షన్లకు ముందస్తు చెల్లింపు (ప్రీ పెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయటం, మొత్తం సాంకేతిక, వాణిజ్య (ఎ.టి అండ్ సి) నష్టాలను 12-15 శాతానికి తగ్గించటం, సగటు కాస్ట్ ఆఫ్ సర్వీస్ (ఎసిఎస్) కు, మొత్తం రెవెన్యూ అవసరానికి (ఎఆర్ఆర్)కు మధ్య తేడాను పూర్తిగా తగ్గించి వేయటం రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం లక్ష్యాలు. డిస్కామ్‌లు ఈ పథకాన్ని అమలు చేస్తే, ప్రీ పెయిడ్ మీటర్ల కొనుగోలుకు మీటరుకు రూ. 900 చొప్పున గ్రాంట్‌గా ఇస్తామని కేంద్రం ప్రతిపాదించింది. ప్రీ పెయిడ్ మీటర్ల వల్ల వినియోగదారులకు చేకూరే లాభం ఏమీ లేదు. పైగా వినియోగదారులకు చేతి చమురు వదులుతుంది. మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన విధంగా విద్యుత్ పంపిణీ రంగంలోకి ప్రవేశించే ప్రైవేటు పెట్టుబడిదారుల పబ్బం గడిపేందుకే ఈ ప్రీ పెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయించేందుకు పై గ్రాంటును కేంద్రం ఎరగా వేసింది. కొనుగోళ్లు అంటే అధికార వర్గాలు ఉబ్బితబ్బిబ్బు అవుతాయి. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించేందుకు కంకణం కట్టుకున్న మోడీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల డిస్కామ్‌లను నేరుగా ప్రయివేటీకరించే అధికారం తనకు లేకపోవటంతో, ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నది.

> సాంకేతిక కారణాలను మినహాయించి, డిస్కాంలు వినియోగదారులకు విద్యుత్తును నిరంతరం సరఫరా చేయటంలో విఫలమైతే జరిమానాలను చెల్లించాలనే దాకా మోడీ ప్రభుత్వం వెళ్ళింది. విద్యుత్ ప్రాజెక్టులకు తాను చేసిన కేటాయింపుల మేరకు బొగ్గు, సహజ వాయువు వంటి ఇంధనాలను సరఫరా చేయించటంలో విఫలమౌతూ, వాటికి కృత్రిమ కొరత సృష్టిస్తూ, వాటి ధరలను సహేతుకంగా నియంత్రించటంలో, తగు రవాణా ఏర్పాట్లు చేయించటంలో విఫలమౌతూ, విద్యుత్ కొరతకు కారణమవుతున్న తన వైఫల్యాలకు మాత్రం మోడీ ప్రభుత్వం ఎలాంటి బాధ్యత, జవాబుదారీతనం వహించటం లేదు.

సాంకేతిక కారణాలను మినహాయించి, డిస్కాంలు వినియోగదారులకు విద్యుత్తును నిరంతరం సరఫరా చేయటంలో విఫలమైతే జరిమానాలను చెల్లించాలనే దాకా మోడీ ప్రభుత్వం వెళ్ళింది. విద్యుత్ ప్రాజెక్టులకు తాను చేసిన కేటాయింపుల మేరకు బొగ్గు, సహజ వాయువు వంటి ఇంధనాలను సరఫరా చేయించటంలో విఫలమౌతూ, వాటికి కృత్రిమ కొరత సృష్టిస్తూ, వాటి ధరలను సహేతుకంగా నియంత్రించటంలో, తగు రవాణా ఏర్పాట్లు చేయించటంలో విఫలమౌతూ, విద్యుత్ కొరతకు కారణమవుతున్న తన వైఫల్యాలకు మాత్రం మోడీ ప్రభుత్వం ఎలాంటి బాధ్యత, జవాబుదారీతనం వహించటం లేదు. తన విధానాలు, వైఫల్యాల వల్ల డిస్కామ్‌లపై, వినియోగదారులపై పడుతున్న భారాలను తగ్గించేందుకు ఎలాంటి సహాయం అందించటం లేదు

"సాహితీ సృజన చేయడానికి వెనుక నేనేం చేసాను అంటే చేయాల్సిందెంతో ఉందని మాత్రం చెప్పగలను. సాహిత్యమనే సంద్రంలో ఈత నేర్చుకుని తొలి అడుగుల్లో ఉంటూ సముద్రపు అందాలను చూస్తున్నాను. లోతులను గమనిస్తున్నాను. అద్భుతాలను అవలోకనం చేసుకుంటున్నాను. ఆటుపోట్లను తెలుసుకుంటున్నాను" అంటారు ప్రముఖ రచయిత్రి డా.సమ్మెట విజయ. పెండ్లయి పిల్లలు పుట్టిన తర్వాత ఇటు కుటుంబాన్ని చూసుకుంటూనే నాటక రంగంలో పరిశోధన చేశారు. కవితలు, కథలు రాస్తూ తన ఆలోచనలు ప్రపంచం ముందు పెడుతున్నారు. అక్షరయాన్‌తో మమేకమై ఎన్నో సాహిత్య కార్యక్రమాలు చేస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...






# 'నన్ను నేను మలుచుకున్నా'

అమ్మ లక్ష్మీ తులసి, గృహిణి. నాన్న సమ్మెట పోతరాజు. అసిస్టెంబర్ లెబర్ ఆఫీసర్‌గా చేసేవారు. ఆయన ఉద్యోగ రీత్యా అనేక ప్రాంతాలు తిరిగాము. నేను హైదరాబాద్‌లో పుట్టాను. నాకు ఇద్దరు అక్కలు, అన్నా, చెల్లి ఉన్నారు. అందరం సాహిత్యం పట్ల అభిమానం వున్న వాళ్ళమే. నాన్న ట్రాన్స్‌ఫర్ల మధ్య నా చదువు చాలా ఊర్లలో జరిగింది. నిజామాబాద్, శ్రీరాం సాగర్, కరీంనగర్, కొత్తగూడెంలో స్కూలు చదువు పూర్తి చేశా. ఇంటర్ ఖమ్మంలో, డిగ్రీ మంచిర్యాలలో, బి.యిడి మహబూబాబాద్‌లో, ఎం.ఎ, ఎంఫిల్, పి.హెచ్‌డీ హైదరాబాద్‌లో పూర్తి చేశాను. స్కూల్లో చదువుతూనే లైబ్రరీ నుండి పుస్తకాలు తెచ్చుకొని చదువుకునే దాన్ని. నాన్న కూడా అనేక పత్రికలు, పుస్తకాలు ఇంటికి తీసుకొచ్చేవారు. వాటిని కూడా ఇంట్లో మేమందరం చదివేవాళ్ళం. నేనూ మా చిన్నక్క ఉమాదేవి రచనా రంగంలో వున్నాం. తను వయసులో పెద్దదైనా ఇద్దరం మంచి స్నేహితులం.

## సాహిత్యానికి చేరువ చేసింది చదువే

చిన్నతనం నుంచి నాకు చదువంటే పిచ్చి. చదువే లోకంగా పెరిగాను. ఆ చదువే నన్ను సాహిత్యానికి చేరువ చేసింది. ఆ చదువే గొప్ప రచయితలను, రచనలను, మనుషుల మనస్తత్వాలను పరిచయం చేసింది. నన్ను నడిపించి నా చదువును కొనసాగించేలా చేసిన వారు నా తల్లిదండ్రులు. వివాహానంతరం నాకు తోడుగా నిలిచి ముందుకు పంపింది నా భర్త, అత్తమామలు. అలాగే పెద్దక్క దేవకీదేవి ప్రోత్సాహం నన్ను నన్నుగా నిలబెట్టింది. చదువుకోవాలనే పట్టుదల వివాహం అయినా, పిల్లలు పుట్టినా ఎం.ఏ, బి.ఇడితో ఆగక ఎం.ఫిల్, పి.జి డిప్లమా పబ్లిక్ రిలేషన్స్, ఎం.ఇడి, పి.హెచ్‌డి వరకు కొనసాగింది.

## నా లక్ష్యం నెరవేర్చుకున్నాను

నా సబ్జెక్ట్ తెలుగు కనుక తెలుగు ఉపాధ్యాయురాలిగా జీవనం మొదలైంది. కుటుంబం కోసం కళాశాలకు వెళ్లకుండా (వేరే ఊర్లకు వెళ్ళలేక) బడి ఉద్యోగానికే పరిమితమయ్యాను. సాహిత్యం తెలుసుకోవాలంటే ముందు బాగా చదవాలని తెలుసుకున్నాను. అందుకు మామయ్య అంగీకారంతో, భర్త సహకారంతో చేస్తున్న ఉద్యోగానికి సెలవుపెట్టి (జీతం లేకుండా) ఒకటిన్నర వయసున్న బాబుకు పాలు, బట్టలు సర్ది అత్తవారింట వదిలి మూడు బస్సులు మారి తార్నాకా నుంచి కేంద్రీయ విశ్వవిద్యాలయానికి వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చి బాబును చూసుకుంటూ చదువుకున్నాను. ఇక పి.హెచ్.డి కి ఎన్ని బస్సు లెక్కానో, నాటక రంగంలో పరిశోధనకు ఎందరిని కలిసి ఇంటర్వ్యూలు చేసానో లెక్కలేదు. ఉద్యోగం చేస్తూ, కుటుంబ బాధ్యతలు నెరవేరుస్తూ నా లక్ష్యం నెరవేర్చుకున్నాను. ఈ ప్రయత్నంలో ఇంకా చదువంటూ తిరుగుతుందనే విమర్శను ఎదుర్కొన్నా.



## 'సమ్మెట విజయ సౌజన్య'

ఇంటర్ నుంచి రచనలు చేస్తున్నాను. స్త్రీల సమస్యలపై 'సమ్మెట విజయ సౌజన్య' పేరుతో 40కి పైగా రాసిన వ్యాసాలు వివిధ పత్రికల్లో వచ్చాయి. తొలి కథ 'అమ్మాయి ప్రయాణం' భారతి పత్రికలో చూసుకున్నప్పుడు ఆనందం కలిగించింది. ఆ తర్వాత పరిశోధకురాలిగా ఉస్మానియా, తెలుగు, ఆదికవి నన్నయ్య, ద్రవిడ విశ్వవిద్యాలయాలలో పత్రసమర్పణలు చేశాను. ఒకప్పుడు డాక్టర్ కావాలని బైపీసీ తీసుకున్న నేను తెలుగు సాహిత్యంలో డాక్టరేట్ చేసాను. నాకు లభించిన మరో అద్భుతమైన అవకాశం నా పి.హెచ్‌డి. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కాన్వకేషన్ ముఖ్యఅతిథి ఎ.పి.జె.అబ్దుల్ కలామ్, వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సమక్షంలో డాక్టరేట్ తీసుకోవడం. నా జన్మలో మరిచిపోలేని రోజు అది. అబ్దుల్ కలామ్ ప్రసంగం నాలుగడుగుల దూరంలో వినడంతో ఆత్మ విశ్వాసం, పట్టుదల ఆ రోజు నుంచే అలవరుచుకున్నాను. ఆయన మాటలను ఆదర్శంగా తీసుకున్నాను.






## కవితలు విరివిగా రాశాను

పి.హెచ్‌డి అయ్యాక ఆ పుస్తకం "తెలుగులో నాటక రచన 1991-2000" అభినయ జాతీయ నాటక రంగ సంస్థ అభినయ శ్రీనివాస్ నిర్వహణలో డా.సి.నారాయణ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించబడింది. తర్వాత నా తొలి కవితా సంపుటి 'భావనాంజలి' వచ్చింది. నేను రచించిన వ్యాసాలతో ఒక వ్యాస సంకలనంగా తేవాలన్నది నా కోరిక. కానీ పుస్తక ప్రచురణకు అయ్యే ఖర్చు భరించలేక ఆగిపోయాను. ఇంతకు ముందు రాసి సిద్ధంగా ఉన్న 'తెర వెనుక', మరి రెండు పుస్తకాలు కూడా అలాగే ఉండిపోయాయి. కవయిత్రిగా కవితలు విరివిగా రాసాను. అనేక కవి సమ్మేళనాలలో పాల్గొన్నాను. హైదరాబాదుతో పాటు యానాం, ఖమ్మంలోనూ బహుమతులు అందుకున్నాను. నేను పనిచేస్తున్న రైల్వే మిశ్రమోన్నత పాఠశాలలో కవితల పరంపర కొనసాగుతూనే ఉంది.

## నాటక రంగం పరిశోధకురాలిగా...

అబ్బూరి ఛాయాదేవి కథల మీద ఎం.ఫిల్ చేసిన నేను కథలు చదవడం, రాయడంపై ఆసక్తిని పెంచుకున్నాను. నేను రచించిన ఓ కథ అర్చనా ఫైన్ ఆర్ట్స్ అకాడమి వారి బహుమతికి ఎంపికైంది. వివిధ కథా సంకలనాలలో నా కథలున్నాయి. వ్యాస రచయిత్రిగా భూమిక నుంచి బహుమతులు గెలుచుకున్నాను. నవతెలంగాణలో, సారంగలో నా వ్యాసాలు, పుస్తక సమీక్షలు వచ్చాయి. డా.ప్రభాకర్ జైని రచించిన 'హీరో' నవలపై నేను రచించిన సమీక్ష ప్రత్యేక బహుమతికి ఎంపికైంది. నాటకరంగ పరిశోధకురాలిగా ఎన్నో వ్యాసాలు రచించాను. తెలంగాణ నాటక సాహిత్యం గ్రంథంలో తెలంగాణ నాటక రంగంలో మహిళల గురించి వ్యాసం రాసాను. బడి నేపథ్యంలో రచించిన 'బడే నా లోకం' నవల ముద్రణలో ఉంది.

## భాషకు సేవ చేయగలిగాను

అక్షరయాన్ రూపొందినప్పటి నుంచి నేటి వరకూ మహిళా కవయిత్రులను సంఘటితంగా ఒక విశిష్ట సంస్థగా రూపొందాలని తపించాము. అందుకోసం వ్యవస్థాపక అధ్యక్షురాలు అయినంపూడి శ్రీలక్ష్మితో కలిసి పలు సాహితీ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. హైదరాబాద్‌కు జిల్లా ప్రతినిధిగా రెండు సంవత్సరాలు చేసి ఆ తర్వాత పత్రికా ప్రతినిధిగా నా వంతు సహకారాన్ని అందిస్తున్నాను. అక్షరయాన్ వెలువరించిన పుస్తకాలలో నా రచనలు కూడా చోటు చేసుకున్నాయి. లైంగిక దాడుల వల్ల గురైన స్త్రీల కుటుంబాలను కలిసి ఉమెన్ సేఫ్టీ వింగ్ సహకారంతో ప్రత్యక్షంగా మాట్లాడి కథలు రాసాము. కరోనా పై యుద్ధం కవితలతో సంకలనం తీసుకొచ్చాము. విత్తన సదస్సు నిర్వహించాము. పూలసింగిడి పేరుతో బతుకమ్మ కవితలు రాసాము. పరమవీరచక్ర సైనిక వీరులకు కవితల హారతినిచ్చాము. సీనియర్ రచయిత్రులకు మాతృవందనం చేసాం. సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లో మక్కువ ఉన్న నాకు తెలుగు భాషకు సేవచేసే అవకాశం కలిగించింది. అందుకు అక్షరయాన్ బాసటగా నిలిచింది. నా ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ బాధ్యతలు అప్పుడప్పుడూ రచనలు చేసే విషయంలో కొంత విరామం కలిగించినా నాటకరంగం, కథలు, కవితలు అన్ని మాధ్యమాల్లో పరిశీలించి అధ్యయనం చేస్తూనే ఉంటాను. ఆయా రచయితల రచనలకు స్పందన తెలియజేస్తాను. కనుక సాహిత్యంతో నా జీవితం మమేకం. అక్షరయాన్ ద్వారా సాహిత్యానికి ఈ జీవనం అంకితం. మరిన్ని మంచి రచనలు చేయడానికి నన్ను నేను మెరుగులు దిద్దుకుంటాను.

**ఆత్మీయ సంగమంగా మార్చింది**



తెలుగు సాహిత్యం పట్ల మక్కువ ఎందుకు అంటే అమ్మ మీద మక్కువ ఎందుకు అని ప్రశ్నించినట్లే. తెలుగు నా మాతృభాష, ప్రాణం ఉన్నంత వరకు తెలుగు భాషకు నా వంతు సేవ చేయాలి. తెలుగు వెలుగులను దశదిశలా చాటాలి. ఇటీవల సరోజిని నాయుడు జయంతి సందర్భంగా సరోజిని నాయుడు పురస్కారం లభించడం కవిత్వం పట్ల నా బాధ్యత మరింత పెంచింది. కర్ణాటక తెలుగు సమాఖ్య, బెంగుళూరు వారి ఉగాది పురస్కారం దేశ వ్యాప్తంగా పలు సాహితీ సంస్థలలో చేసిన సేవలకు ఎంపిక చేసిన వారికి ఇచ్చే పురస్కారం. మార్చి 19, 2023న అక్షరయాన్ సంస్థ నుంచి నాకు లభించడం నన్ను మాత్రమే కాదు అక్షరయాన్ రచయిత్రులందరినీ దేశంలోని సాహితీ సంస్థల మధ్య సగర్వంగా నిలబెట్టింది. అలాగే సాహిత్యానికి 'తెలంగాణ సాహితి' చేస్తున్న కృషి సర్వదా ప్రశంసనీయం. తెలంగాణ సాహితితో విడదీయరాని అనుబంధం ఖమ్మం నుంచీ ఉంది. అనేక సాహితీ సమావేశాల్లో పాలుపంచుకుని కవితలు చదివి, పత్రసమర్పణ చేసి ఆత్మీయ సంగమంగా మార్చింది.

**- సలీమ**

# నేడే జనచైతన్య యాత్ర ముగింపు సభ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన జనచైతన్య యాత్ర ముగింపు సభ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బుధవారం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్ హాజరవుతున్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతోపాటు యాత్రకు నాయకత్వం వహించిన రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, పోతినేని సుదర్శన్, జాన్‌వెస్లీ ఇతర బృంద సభ్యులు పాల్గొంటారు. ఈనెల 17న వరంగల్‌లో, 23న ఆదిలాబాద్‌లో, 24న నిజామాబాద్‌లో మూడు ప్రాంతాల నుంచి బస్సుజాతాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా జనం జేజేలు పలికారు. ఎర్రజెండాలు కట్టుకుని బైక్ ర్యాలీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ అనుసరిస్తున్న మతోన్మాదం, కార్పొరేట్ అనుకూల విధానాలపై ప్రజలను అప్రమత్తం చేయడమే లక్ష్యంగా ఈ యాత్ర జయప్రదంగా సాగింది. రాజ్యాంగాన్ని రక్షిద్దాం, దేశాన్ని పరిరక్షిద్దాం అనే నినాదంతో ప్రజలను జాగృతం చేసింది. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణతో నిరుద్యోగులు రిజర్వేషన్లతోపాటు ఉద్యోగాలు ఎలా కోల్పోతారో నాయకులు వివరించారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ మూల సిద్ధాంతం అయిన మనువాద భావజాలాన్ని చాతుర్వర్ణ వ్యవస్థను, కులవ్యవస్థను కొనసాగించడం కోసం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టింది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తోపాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వల్ల సామాన్యులు ఎంత సతమతమవుతున్నారో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రజాసంక్షేమానికి కోతలు పెడుతూ కార్పొరేట్ శక్తులకు రాయితీలు కల్పించే మోడీ ప్రభుత్వ ద్వంద్వ విధానాలను వివరించింది. వామపక్ష, అభ్యుదయ భావజాలం బలంగా ఉన్న తెలంగాణలో ప్రజల ఐక్యతకు చిచ్చుపెట్టి రాజకీయంగా బలపడాలన్న బీజేపీ గుట్టును చిత్తుచేసింది. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలనూ సీపీఐ(ఎం) నాయకులు ఈ యాత్రలో ప్రస్తావించారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇండ్లు, పోడు భూములకు పట్టాలు, కార్మికులకు కనీస వేతనాలు వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# పంట నష్టపరిహారమివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను ఆయన ఆదేశించారు. ఆయా జిల్లా కలెక్టర్లు తమ తమ జిల్లా పరిధిలో, క్లస్టర్ల వారీగా స్థానిక వ్యవసాయ అధికారులతో (ఏఈవో) సర్వే చేయించి జరిగిన పంట నష్టం వివరాలను పూర్తి సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి అందజేయాలని తెలిపారు. ఈమేరకు తక్షణ చర్యలు ప్రారంభించాలని సీఎస్ శాంతికుమారికి, వ్యవసాయశాఖకార్యదర్శి రఘునందన్‌రావును ఆదేశించారు. పంట దెబ్బతిన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఈ నిధులను జమ చేయాలన్నారు.

**గృహలక్ష్మి విధివిధానాలు ఖరారు చేయాలి**

అర్హులైన పేదలకు 'గృహలక్ష్మి' పేరిట రూ.మూడు లక్షల ఆర్థిక సాయం చేసేందుకు విధివిధానాలు ఖరారు చేయాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు.

**గొర్రెల పంపిణీ**

రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని సీఎం అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోనే గొర్రెల కొనుగోలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఆ ప్రకారమే గొర్రెల కొనుగోలు పంపిణీ వ్యవహారాలు సాగాలన్నారు.

**పోడు భూముల పంపిణీకి సంసిద్ధత**

పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో...అర్హులైన వారికి పోడు పట్టాల పంపిణీకి అధికార యంత్రాంగం సంసిద్ధంగా వుందా అనే అంశానికి సంబంధించి సీఎస్‌తో చర్చించారు. నాలుగు లక్షల ఎకరాలకు సంబంధించి.. ఒక లక్షా 55 వేల మంది అర్హులకు పోడు పట్టాలు అందించేందుకు.. పాస్ బుక్కులు ముద్రించి సిద్ధంగా వున్నాయని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ నేపథ్యంలో.. అర్హులకు పోడు భూముల పట్టాల పంపిణీ కోసం తేదీని త్వరలోనే ప్రకటిస్తామని సీఎం తెలిపారు.

# మెట్రో విస్తరణపై కేంద్రం వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

ముందుకొచ్చిన నిర్మాణ రంగ సంస్థలు వరల్డ్ సిటీ స్థాయిలో పనులు చేపట్టాలని కోరారు.

హైదరాబాద్ నగరానికి అధునాతన సదుపాయాలు కల్పించడానికి రూ.2,400 కోట్లతో లింక్ రోడ్లు, రూ.10 వేల కోట్లతో మూసీ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రామోజీ ఫిలిం సిటీ లాంటి ఫిలిం సిటీని రాచకొండలో అత్యంత ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచం అబ్బురపడేలా తీసుకొస్తామని, ఒలంపిక్ స్థాయిలో స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తామని చెప్పారు. హైదరాబాద్ కృష్ణా బేసిన్‌లో ఉన్నదని, 94 శాతం నీరు గ్రావిటీ ద్వారా మూసీ నదిలోకే ప్రవహిస్తుందన్నారు. సీఎస్‌ఆర్ పద్ధతి ద్వారా చేపట్టే చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్, సేద తీరడానికి కుర్చీల ఏర్పాటు, వ్యాయామశాల, ఆట స్థలం, థీమ్ పార్కు, టాయిలెట్స్, లైటింగ్, సెక్యూరిటీ గార్డ్ వంటి అధునాతన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. చెరువులలో ప్రయివేట్ ల్యాండ్ ఉన్నచో వాటికి టీడీఆర్ జారీ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 13 చెరువుల్లో ఉన్న 115 ఎకరాల ప్రయివేటు భూములను సేకరించి 200 శాతం విలువతో టీడీఆర్‌లను జారీ చేసినట్టు తెలిపారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను సంప్రదించొచ్చని సూచించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను డీమార్క్ చేసి మ్యాప్‌లు సిద్ధంగా ఉన్నాయన్నారు.

2022లో మన హైదరాబాద్‌కు ఆఫీస్ ఫేస్‌లో నెంబర్ 1 వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం వ్యాక్సిన్ నగరంగా పేరుగాంచిందని, భవిష్యత్‌లో 1400 కోట్ల వ్యాక్సిన్‌లను ప్రపంచ దేశాలకు సరఫరా చేయనున్నట్టు తెలిపారు. దుర్గం చెరువును డెవలప్ చేయడం ద్వారా టూరిస్ట్ అట్రాక్షన్, సినిమా షూటింగ్‌లకు నిలయంగా మారిందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 185 చెరువుల అభివృద్ధి, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సుందరీకరణ, మెయింటెనెన్స్‌కు ఎంఓయూ చేసుకునేందుకు ఆసక్తి గల వారు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా 51 చెరువులకు సంబంధించి ఎంఓయూ పత్రాలను వారికి అందజేశారు. ఇటీవల ఫాక్స్‌ఖాన్ చైర్మెన్ హైదరాబాద్‌ను సందర్శించిన నేపథ్యంలో ముఖ్యమంత్రిని కలిసినప్పుడు హైదరాబాద్ సిటీ అద్భుతంగా ఉందని కితాబు ఇచ్చారని గుర్తు చేశారు. కొంగరకలాన్‌లో ఆ సంస్థ పెట్టుబడులు పెట్టడం ద్వారా 30వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, ఆకులలలిత, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, కమిషనర్ డిఎస్.లోకేష్‌కుమార్, సీసీపీ దేవేందర్‌రెడ్డి, సీఈ సురేష్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్లు బాబా ఫసియుద్దీన్, గంగాధర్, మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఇంజినీరింగ్ విభాగం అధికారులు, నిర్మాణ రంగ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏండ్లు విధులకు రాకున్నా...

- ఓ టీచర్‌కు ఉద్యోగమిచ్చిన జగిత్యాల డీఈవో

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని తాట్లవాయి ఎంపీపీఎస్‌లో పనిచేసిన టి శ్రీనివాస్ అనే టీచర్ 2003, సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు అంటే 20 ఏండ్లపాటు విధులకు హాజరు కాలేదు. అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గైర్హాజరయ్యారు. అయినప్పటికీ జగిత్యాల డీఈవో బి మదన్‌మోహన్ ఆయనకు ఉద్యోగమివ్వడం చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటికొండాపూర్ ఎంపీయూపీఎస్‌లో ఆయనకు పోస్టింగ్ ఇస్తూ గతనెల 20వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే క్లాసిఫికేషన్, కంట్రోల్ అప్పీల్ (సీసీఏ) రూల్ ప్రకారం ఓ ఉద్యోగి సంబంధిత శాఖ ఉన్నతాధికారుల అనుమతితో గరిష్టంగా ఐదేండ్లపాటు సెలవు తీసుకునే అవకాశమున్నది. అధికారులకు చెప్పకుండా ఏడాదిపాటు విధులకు గైర్హాజరైతే ఆ ఉద్యోగి తన ఉద్యోగాన్ని కోల్పోవాల్సి ఉంటుంది. కానీ 20 ఏండ్లపాటు విధుల్లో లేకపోయినా టి శ్రీనివాస్ అనే టీచర్‌కు మళ్లీ ఉద్యోగమివ్వడం గమనార్హం.

# 40 శాతం టికెట్లు యువతకే

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదీర్ఘ మంతనాల అనంతరం పొలిట్‌బ్యూరో పలు తీర్మానాలను ఆమోదించింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ పార్టీని ఇరు రాష్ట్రాల్లో బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎన్టీఆర్ శతజయంతి కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. బుధవారం మే 28 వరకు శతజయంతి ఉత్సవాలను 42 పార్లమెంట్ నియోజకవర్గాల్లో నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్యేల కొనుగోలుపై వైసీపీ పిచ్చి ప్రేలాపణలు ఆపాలని పొలిట్‌బ్యూరో సమావేశం అనంతరం అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ అన్నారు. సైకిల్‌గుర్తుపై గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలను ఎంతకు కొన్నాడో జగన్ చెప్పాలని ప్రశ్నించారు. వైసీపీ ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా, యువగళం పాదయాత్ర విజయవంతంగా సాగుతున్నదని చెప్పారు. ఏపీకి చెంది 13, తెలంగాణకు సంబంధించి నాలుగు మొత్తం 17 అంశాలపై తీర్మానాలు చేసినట్టు ప్రకటించారు. అకాల వర్షాలపై సీఎం ఇప్పటివరకు కనీసం సమీక్ష చేయకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు. జీవో నెంబరు ఒకటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ వచ్చాకే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. నాలుగేండ్లుగా రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. కొత్త పరిశ్రమల సంగతి పక్కబెడితే, ఉన్నవి మూతపడుతున్నాయని గుర్తు చేశారు.

**ఘనంగా ఆవిర్భావ దినం: కాసాని**

తెలుగుదేశం తెలంగాణ శాఖ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో 119 నియోజకవర్గాల్లో పోటీచేస్తామని ప్రకటించారు. ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల విజయంతో క్యాడర్‌తో ఉత్సాహం ఉరకలేస్తున్నదని చెప్పారు. ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని కోరారు. కేసీఆర్ ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్స్ గ్రౌండ్స్‌లో బుధవారం సాయంత్రం మూడు గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 15 వేల మంది హాజరవుతున్నారని చెప్పారు. ఈమేరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సన్నాహాలు చేసినట్టు తెలిపారు.



## పీఎఫ్‌పై 5 పైసల వడ్డీ పెంపు

**న్యూఢిల్లీ :** ఉద్యోగ, కార్మికుల పీఎఫ్‌పై కేవలం 5 పైసలు వడ్డీ పెంచారు. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23కు గాను 8.15 శాతం వడ్డీ చెల్లించడానికి మంగళవారం జరిగిన ఈపీఎఫ్‌ఓ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖకు ట్రస్టీ ప్రతిపాదనలు పంపించనున్నది. ఇంతక్రితం 2021-22లో 8.10 శాతం వడ్డీని అందించారు. గత నాలుగు దశాబ్దాల్లో పీఎఫ్‌పై ఇదే తక్కువ వడ్డీ రేటు కావటం గమనార్హం. దీంతో పోల్చితే అతి స్వల్పంగా 0.05 శాతం లేదా 5 పైసల పెంపుదల చోటు చేసుకుంది. కేంద్రం నుంచి ఆమోదం లభించిన తర్వాత ఈపీఎఫ్‌ఓ వడ్డీ రేటును అధికారికంగా గెజిట్‌ను విడుదల చేయనుంది. ఆ తర్వాత వడ్డీని ఖాతాదారుల ఖాతాల్లో జమ చేయనుంది. మోడీ సర్కార్ అధికారంలోకి రాక ముందు 2013-14లో పీఎఫ్‌పై గరిష్టంగా 8.75 శాతం వడ్డీ రేటు అమల్లో ఉంది. క్రమంగా దీన్ని తగ్గిస్తూ వచ్చింది. ఈపీఎఫ్‌ఓలో 5 కోట్ల పైగా ఖాతాదారులు ఉన్నారు.

## ఈడీ లేఖకు ఎమ్మెల్సీ కవిత సమాధానం

**న్యూఢిల్లీ :** బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తరఫున ఆ పార్టీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ ఈడీ కార్యాలయానికి వెళ్లారు. కె.కవితకు ఈడీ జాయింట్ డైరెక్టర్ లేఖ రాశారు. తాము కవిత అందించిన మొబైల్ ఫోన్లను తెరిచేందుకు సిద్ధమయ్యామని లేఖలో తెలిపారు. ఫోన్లు ఓపెన్ చేసేటప్పుడు స్వయంగా హాజరుకావడం, లేదా తన ప్రతినిధిని పంపాల్సిందిగా లేఖలో ఈడీ పేర్కొంది. అందువల్ల కవిత తరఫున ఈడీ కార్యాలయానికి బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి సోమా భరత్ మంగళవారం వెళ్లారు. ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయన ఈడీ కార్యాలయంలోనే ఉన్నారు.

## హార్టికల్చర్ ఆఫీసర్ పరీక్ష వాయిదా

- జూన్ 17న నిర్వహణ : టీఎస్‌పీఎస్సీ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వచ్చేనెల నాలుగో తేదీన నిర్వహించాల్సిన రాతపరీక్షను వాయిదా వేస్తున్నట్టు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. 22 హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 22న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షను తిరిగి జూన్ 17న నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ నేపథ్యంలో ఇప్పటికే నాలుగు పరీక్షలను రద్దు చేసిన విషయం విదితమే. రెండింటిని వాయిదా వేసింది. గ్రూప్-1 ప్రిలిమినరీతోపాటు డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏవో), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ), అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పరీక్షలను రద్దు చేసింది. టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్ (టీపీబీవో), వెటర్నరీ అసిస్టెంట్ పరీక్షలు వాయిదా పడ్డాయి. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను జూన్ 11న నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. మిగతా రద్దయిన పరీక్షలతోపాటు వాయిదా పడిన వాటికి త్వరలోనే కొత్త తేదీలను ఖరారు చేసి ప్రకటించే అవకాశమున్నది.

## విద్వేష ప్రసంగాలపై చర్యలేవి?

(మొదటిపేజీ తరువాయి)

దృష్టికి తీసుకొచ్చారు. అయితే, కేవలం కేసుల నమోదుతో ఈ సమస్య పరిష్కారం కాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. నమోదైన ఎఫ్ఐఆర్‌ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారని సొలిసిటర్ జనరల్ మెహతాను ప్రశ్నించింది. తదుపరి విచారణ నిమిత్తం కేసును బుధవారానికి వాయిదా వేసింది. విద్వేష ప్రసంగాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సర్వోన్నత న్యాయస్థానం గతంలోనూ పేర్కొంది. ఫిర్యాదు కోసం ఎదురుచూడకుండా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఎంతో తీవ్రమైన ఈ సమస్యపై చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం ఏదైనా జాప్యం చేస్తే.. కోర్టు ధిక్కారంగా పరిగణిస్తామని కూడా హెచ్చరించింది.

# నవచిత్రం

## త్రీడీలో థ్రిల్ చేసే శాకుంతలం

- దిల్ రాజు

గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పౌరాణిక ప్రేమకథా చిత్రం 'శాకుంతలం'. సమంత, దేవ్ మోహన్ జంటగా నటించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 14న రిలీజ్ అవుతుంది. శ్రీ వెంకటేశ్వరక క్రియేషన్స్ దిల్ రాజు సమర్పణలో గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 3డీ టెక్నాలజీతో విజువల్ వండర్‌గా తెలుగు, హిందీ, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో ఈ సినిమా ప్రేక్షకులను అలరించనుంది. మంగళవారం త్రీడీ ట్రైలర్‌ను చిత్ర బృందం రిలీజ్ చేసింది.
ఈ సందర్భంగా నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ, 'ఈ సినిమాను 3డీ టెక్నాలజీలోకి మార్చాలనే ఆలోచన దిల్‌రాజుదే. ఇప్పుడు త్రీడీ ట్రైలర్ చూస్తుంటే ఆయన ఆలోచన ఎంత గొప్పదో అర్థమవుతుంది. మన మైథాలజీని ఇలా త్రీడీలో సినిమా చేయటం ఇదే తొలిసారి అనుకుంటా. ఏప్రిల్ 14 కోసం ఎగ్జయిట్‌మెంట్‌తో వెయిట్ చేస్తున్నాను' అని అన్నారు.
'ఇప్పుడు తెలుగు సినిమా గ్లోబల్ రేంజ్‌కు చేరుకుంది. తెలుగు సినిమాలను ఇంకా ప్రపంచానికి చూపిస్తూ ఉండాలనే ఉద్దేశంతో నేను వేసిన మొదటి అడుగు 'శాకుంతలం'. బ్యూటీఫుల్ ఫ్యామిలీ డ్రామా.. విజువల్ వండర్‌గా సినిమా తెరెక్కింది. ఓ థియేటర్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చే సినిమా. ఈ సమ్మర్‌లో మా సినిమాని మీ ముందుకు తీసుకొస్తున్నాం. సినిమా చూసి బయటకొచ్చేటప్పుడు అల్లు అర్హ రూపంలో ఓ సర్‌ప్రైజ్ ఉంటుంది' అని దిల్‌రాజు చెప్పారు. దర్శకుడు గుణ శేఖర్ మాట్లాడుతూ, "ఇది సమంత 'శాకుంతలం'. ఆమె ప్రాణం పెట్టి శకుంతల పాత్రకు ప్రాణ ప్రతిష్ట చేశారు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని విజువల్‌గా మీ ముందుకు తీసుకొచ్చే క్రమంలో లింకుల కోసం చిన్న చిన్న ఇంప్రవైజేషన్ చేశాం తప్ప.. దాదాపు 90 ఒరిజినల్ కథనే సినిమాగా తీశాం. దిల్‌రాజు ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్, నిర్మాత. పైగా ఆడియెన్స్ పల్స్ తెలిసిన నిర్మాత. ఆయన్ని వాడుకోవాల్సిన అవసరం మాకు ఉంది. అలాంటి ఆయన్ని వాడుకోకపోతే మా మూర్ఖత్వం అవుతుంది' అని అన్నారు.



సమంత

## అబ్బాయిలంటే పడని పాత్ర

మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో కిరణ్ అబ్బవరం హీరోగా తెరకెక్కిన మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ 'మీటర్'. నూతన దర్శకుడు రమేష్ కడూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 7న సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలో హీరోయిన్ అతుల్య రవి మీడియాతో మాట్లాడుతూ, ""మీటర్'తో తెలుగు పరిశ్రమలోకి రావడం, మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ లాంటి ప్రముఖ సంస్థలు నిర్మిస్తున్న సినిమాలో అవకాశం దక్కడం చాలా హ్యాపీగా ఉంది. కథ చెప్పినప్పుడే చాలా నచ్చింది. ఇందులో నా పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. అబ్బాయిలు అంటే ఇష్టం లేని పాత్ర నాది. చాలా సీరియస్‌గా ఉంటుంది. అయితే అందులో నుంచే కామెడీ జనరేట్ అవుతుంది. ఇది పక్కా కమర్షియల్ మూవీ అయినప్పటికీ ఇందులో అద్భుతమైన ఎమోషన్స్ కూడా ఉన్నాయి. పాటలు, డ్యాన్సులు కూడా బావుంటాయి. మాస్ ఫైట్స్, రొమాన్స్, లవ్‌తో పాటు ఫాదర్ సెంటిమెంట్ కీలకంగా ఉంటుంది. హీరో కిరణ్, నాకు ఉన్న కాంబినేషన్ సీన్స్ చాలా సరదాగా ఉంటాయి. సినిమాల పరంగా ఫీల్ గుడ్ లవ్ స్టోరీస్, రస్టిక్ సినిమాలు, ప్రయోగాత్మక పాత్రలు కూడా చేయాలని ఉంది. ప్రస్తుతం తమిళ్‌లో హరీష్ కళ్యాణ్‌తో 'డీజిల్' సినిమా చేస్తున్నా' అని తెలిపింది.



అతుల్య రవి

## పిల్లలపై చదువు ఒత్తిడి పెరిగితే..?

షర్మన్ జోషి, శ్రియా శరణ్, షాన్, సుహాసిని మూలే, ప్రకాష్ రాజ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మ్యూజిక్ స్కూల్'. ఇళయరాజా సంగీత సారథ్యం వహిస్తున్న ఈ మల్టీ లింగ్వువల్ మ్యూజికల్ మూవీ మే 12న రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుతో కలిసి మేకర్స్ ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు.
ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ, 'ప్రస్తుతం పిల్లలపై ఎడ్యూకేషన్ సిస్టమ్ వల్ల ఎంత ప్రెషర్ పడుతుందనేది తెలియజేసే చిత్రమే ఇది. ఇదొక సీరియస్ పాయింట్ కానీ దాన్ని వినోదాత్మకంగా, మ్యూజికల్ ఫిల్మ్‌గా చేశారు పాపారావుగారు. ఇళయరాజా సంగీతం అందించిన 11 పాటలతో ఇదొక మ్యూజికల్ ఎంటర్‌టైనర్‌గా అలరించనుంది. ఈ సినిమాను తెలుగులో మేం, మిగతా నేషనల్ వైడ్ పి.వి.ఆర్ వాళ్లు రిలీజ్ చేస్తున్నారు' అని తెలిపారు.
ఐఏఎస్ ఆఫీసర్, సినిమా అంటే ప్యాషన్ ఉన్న పాపారావు బియ్యాల ఈ చిత్రం దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయన మాట్లాడుతూ, 'పిల్లలపై చదువు పేరుతో ఒత్తిడిని పెంచేస్తున్నారు. దీని వల్ల వారిలో అభివృద్ధి జరగటం లేదు, సరి కదా అదే వారి ఎదుగుదలకు సమస్యగా మారుతోంది అని చెప్పే ప్రయత్నమే ఈ సినిమా' అని చెప్పారు. యామిని ఫిల్మ్స్ బ్యానర్‌పై హిందీ, తెలుగులో చిత్రీకరించి ఈ చిత్రాన్ని తమిళలో అనువాదం చేశారు.

'మ్యూజిక్ స్కూల్'లో ఒక దృశ్యం



# మనోలో రాజీనామా

- హైదరాబాద్ ఎఫ్‌సీతో మూడేండ్ల బంధానికి తెర
- కొత్త కోచ్ అన్వేషణలో హెచ్‌ఎఫ్‌సీ

నవతెలంగాణ-హైదరాబాద్

భారత ఫుట్‌బాల్ కేంద్రంగా స్వర్ణ యుగం చూసిన హైదరాబాద్‌కు.. సాకర్‌లో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫ్రాంచైజీ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ కృషి ఎనలేనిది!. ఇక మూడేండ్లుగా హైదరాబాద్ ఎఫ్‌సీ చీఫ్ కోచ్‌గా మనోలో మార్క్వెజ్ (స్పెయిన్) దక్కన్ టైగర్స్‌ను ఐఎస్‌ఎల్‌లో బలమైన జట్టుగా నిలిపారు. 2021-22 సీజన్ ఐఎస్‌ఎల్ చాంపియన్‌ను హైదరాబాద్ ఎఫ్‌సీ నిలిచింది. ఈ ఏడాది ఐఎస్‌ఎల్ సీజన్లో సెమీఫైనల్స్‌కు చేరుకుని నిలకడ చూపించింది. మనోలో మార్క్వెజ్ శిక్షణ సారథ్యంలో హైదరాబాద్ ఎఫ్‌సీ అగ్రజట్టుగా రూపుదిద్దుకుంటున్న క్రమంలో.. ఫ్రాంచైజీతో బంధానికి మనోలో మార్క్వెజ్ తెరదించారు. ఈ సీజన్లో సూపర్ కప్ అనంతరం హైదరాబాద్ ఎఫ్‌సీ డ్రెస్సింగ్‌రూమ్‌ను వీడనున్నట్టు మనోలో మార్క్వెజ్ ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్ ఎఫ్‌సీ యాజమాన్యం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇక ఏడాది సీజన్ ఆఖరులో సూపర్ కప్‌లో పోటీపడే హైదరాబాద్ ఎఫ్‌సీకి మనోలో చీఫ్ కోచ్‌గా కొనసాగనున్నారు. ఏప్రిల్ 8-25 వరకు కేరళలో జరిగే సూపర్ కప్‌లో విజయం సాధిస్తే.. ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య కాంటినెంటల్ టోర్నీకి అర్హత సాధించే అవకాశం ఉంది. దీంతో హైదరాబాద్ సహా ఇతర ఐఎస్‌ఎల్, ఐ-లీగ్ జట్లు సూపర్ కప్‌పై ఇప్పుడు దృష్టి నిలిపాయి.



### ఫిబ్రవరిలోనే నిర్ణయం

2022-23 ఐఎస్‌ఎల్ సీజన్‌లో హైదరాబాద్ రాణించింది. లీగ్ దశలో అగ్రస్థానం కోసం చివరి వరకు పోటీలో నిలిచింది. క్వాలిఫయర్స్‌తో సంబంధం లేకుండా నేరుగా సెమీఫైనల్స్‌కు చేరుకుంది. అయినా, మనోలో మార్క్వెజ్ హైదరాబాద్ ఎఫ్‌సీ వీడాలనే నిర్ణయాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలోనే తీసుకున్నారు. 'హెచ్‌ఎఫ్‌సీ తరఫున మనోలో మార్క్వెజ్ మూడు సీజన్లు అద్భుతంగా పని చేశారు. హెచ్‌ఎఫ్‌సీలో ప్రతి ఒక్కరి తరఫున మనోలోకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. హెచ్‌ఎఫ్‌సీని ఐఎస్‌ఎల్‌లోనే అగ్రజట్టుగా నిలిపాడు మనోలో' అని హెచ్‌ఎఫ్‌సీ యాజమాని వరుణ్ త్రిపురనేని అన్నారు. రాజీనామా నిర్ణయాన్ని మనోలో మాకు ఫిబ్రవరి ఆరంభంలోనే తెలియజేశారు. క్లబ్ పట్ల మనోలో అంకితభావం ఎనలేనిది. ముందుగా తెలియజేయటంతో కొత్త కోచ్ అన్వేషణకు తగిన సమయం ఉండేలా జాగ్రత్త వహించారు. క్లబ్ పట్ల మనోలోకు ఉన్న గౌరవం అదని వరుణ్ తెలిపారు. 'హైదరాబాద్ తరఫున మూడు అద్భుత సీజన్లు పని చేయటం గొప్పగా ఉంది. క్లబ్‌లో సహకరించిన అందరికీ ధన్యవాదాలు. అయినా, ఈ ఏడాది సీజన్ ఇంకా ముగియలేదు. సూపర్ కప్‌లో హెచ్‌ఎఫ్‌సీ టైటిల్ కొట్టేలా ప్రణాళిక చేస్తున్నామని' మనోలో మార్క్వెజ్ పేర్కొన్నారు.

### గోవా ఎఫ్‌సీకి మనోలో?

స్పెయిన్‌కు చెందిన మనోలో మార్క్వెజ్ యూరోప్‌లో పలు ఫుట్‌బాల్ క్లబ్‌లకు పని చేశారు. మూడేండ్ల క్రితం హైదరాబాద్ ఎఫ్‌సీ చీఫ్ కోచ్‌గా పని చేసేందుకు భారత్‌కు వచ్చారు. తొలి సీజన్లో అంచనాలు అందుకోకపోయినా.. కోచ్‌గా రెండో సీజన్లోనే టైటిల్ పట్టారు. ఫ్రాంచైజీ, కోచ్ ఇద్దరూ విడిపోయేందుకు అంగీకారానికి వచ్చినట్టు తెలుస్తోంది. హెచ్‌ఎఫ్‌సీ చీఫ్ కోచ్‌గా యువ ఆటగాళ్లను మేటి ప్లేయర్లుగా తీర్చిదిద్దిన మనోలో మార్క్వెజ్ కోసం ఐఎస్‌ఎల్ ఫ్రాంచైజీ గోవా ఎఫ్‌సీ మంచి ఆఫర్ సిద్ధం చేసినట్టు సమాచారం. గోవా ఎఫ్‌సీతో పాటు ఇతర క్లబ్‌లు సైతం మనోలోకు ఆకర్షణీయ కాంట్రాక్టు ఆఫర్ చేయగా.. సూపర్ కప్ అనంతరం మనోలో కొత్త ఇన్నింగ్స్ వివరాలను వెల్లడించే అవకాశం కనిపిస్తోంది.

## ఆటలు

# సింధుపైనే ఫోకస్!

స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ



మాడ్రిడ్ : భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటుంది. ఈ ఏడాది బరిలో నిలిచిన నాలుగు టోర్నీల్లోనూ తేలిపోయిన సింధు.. తాజాగా మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్‌లో మెరిసేందుకు సిద్ధమవుతోంది. ఇండియా ఓపెన్, మలేషియా ఓపెన్, ఆల్ ఇంగ్లాండ్, స్విస్ ఓపెన్‌లో సింధు అంచనాలను అందుకోలేదు. స్విస్ ఓపెన్‌లో ఏకంగా అనామక షట్లర్ చేతిలో పరాజయం పాలైంది. చీలమండ గాయంతో నిరుడు ద్వితీయార్థం సీజన్‌కు పూర్తిగా దూరమైన సింధు.. పూర్తి ఫిట్‌నెస్ సాధించినా.. కోర్టులో మునుపటి దూకుడు కనిపించటం లేదు. మహిళల సింగిల్స్ విభాగంలో స్విట్జర్లాండ్ షట్లర్‌తో నేడు సింధు తలపడనుంది. ఇటీవల సింధుపై విజయాలు సాధించిన కుసుమ, బ్లిచ్‌ఫెల్ట్‌లు సెమీస్‌కు ముందు సవాల్ విసరనున్నారు. పేలవ ఫామ్‌తో 2016 తర్వాత తొలిసారి డబ్ల్యూబీఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో చోటు కోల్పోయిన పి.వి సింధు మాడ్రిడ్‌లో మెరవటంపైనే దృష్టి నిలిపింది. మెన్స్ సింగిల్స్ విభాగంలో కిదాంబి శ్రీకాంత్, బి. సాయి ప్రణీత్ టైటిల్ ఆశలు పెట్టుకోగా.. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ, మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలీ, గాయత్రి పుల్లెల నేడు తొలి రౌండ్ మ్యాచుల్లో బరిలోకి దిగనున్నారు. ఇక వెటరన్ షట్లర్ సైనా నెహ్వాల్ స్పెయిన్ మాస్టర్స్ టోర్నీకి సైతం దూరమైంది.

# రష్మిక, తమన్నా స్టెప్పులతో..!

ఐపీఎల్16 ఆరంభ వేడుకలకు సినీ గ్లామర్



ముంబయి : మూడేండ్ల విరామం అనంతరం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) పాత పద్ధతిలో జరుగుతోంది. పది జట్ల అభిమానులు ఐపీఎల్ వినోదం సొంత వేదికల్లో మళ్లీ వీక్షించనున్నారు. దీంతో ఐపీఎల్ 2023 ఆరంభ వేడుకలకు బీసీసీఐ భారీ ప్రణాళికలు రచిస్తోంది. అహ్మదాబాద్‌లోని మోతెరా స్టేడియంలో గురువారం (మార్చి 30) సాయంత్రం 6.30 గంటల నుంచే సందడి షురూ కానుంది. పుష్ప ఫేం రష్మిక మందన, బాహుబలి ఫేం తమన్నా భాటియాలు ఈ ఏడాది ఆరంభ వేడుకల్లో నృత్య ప్రదర్శన చేయనున్నారు. ఆరంభ వేడుకలను విజువల్ వండర్‌గా నిర్వహించేందుకు బోర్డు అన్ని సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఐపీఎల్ 2023 12 వేదికల్లో 52 రోజుల పాటు జరుగనున్న సంగతి తెలిసిందే.




జాతీయ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్స్‌లో తెలంగాణ ప్యాడ్లర్లు మహ్మద్ అలీ, వాన్ష్ సింఘాల్ జోడీ సిల్వర్ మెడల్ గెల్చుకుంది. సిల్వర్ మెడలిస్ట్‌లను తెలంగాణ టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి నాగేందర్ రెడ్డి, కోచ్ సోమ్‌నాథ్ ఘోష్ అభినందించారు

## రైళ్లపై రాళ్లేస్తే జైలుకే...

- అలాంటి పనులు చేయకండి :దక్షిణ మధ్య రైల్వే విజ్ఞప్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నడిచే రైళ్లపైకి రాళ్లు విసరడం విజ్ఞత కాదనీ, ఇలాంటి ఆకతాయి చర్యలకు పాల్పడిన వారిని రైల్వే చట్టం ప్రకారం నేరుగా జైలుకు పంపిస్తామని దక్షిణ మధ్య రైల్వే హెచ్చరించింది. ఇలాంటి ఘటనల వల్ల ప్రయాణీకులకు తీవ్ర గాయాలవుతాయనీ, రైల్వే ఆస్తులకూ నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ఎవరూ ఇలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ వద్దంటూ ప్రజలకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) విజ్ఞప్తి చేసింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లపై రాళ్ల దాడి శిక్షార్హమైనదని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే నేరస్థులపై రైల్వే చట్టంలోని సెక్షన్ 153 ప్రకారం ఐదేండ్ల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాజీపేట - ఖమ్మం, కాజీపేట - భువనగిరి, ఏలూరు - రాజమండ్రి రూట్లలో 9 ప్రాంతాల్లో వందే భారత్ రైళ్లపై దుండగులు రాళ్ల దాడులు చేశారని గుర్తుచేశారు. ఈ పరిస్థితులు రైళ్ల రీషెడ్యూల్‌కు దారితీశాయనీ, ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారనీ తెలిపారు. ఈ ఘటనల్లో రైలులో ప్రయాణిస్తున్న ఐదుగురు ప్రయాణీకుల తలలకు రాళ్లు తగిలి తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. ఈ ఘటనలకు పాల్పడిన 39 మంది నేరస్తులను గుర్తించి, అరెస్టు చేసి జైలుకు పంపామన్నారు. ఈ ఘటనల్లో 6 నుంచి 17 ఏళ్ల మధ్య వయసున్న పిల్లలు కూడా ఉన్నారనీ, తల్లిదండ్రులు ఈ విషయాలను గ్రహించాలని సూచించారు. అటువంటి సంఘటనలను చూసిన వ్యక్తులు 139కి డయల్ చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ విజ్ఞప్తి చేశారు. పెద్దలు తమ పిల్లలకు కౌన్సెలింగ్ ఇవ్వాలనీ, చిన్నపిల్లల చేష్టల కారణంగా తీవ్ర పరిణామాల గురించి అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## విధానాలు మార్చుకుంటారా...

# మూల్యం చెల్లించుకుంటారా...!

### సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి హెచ్చరిక

- పెండింగ్ బిల్లులన్నీ 31లోగా విడుదల చేయాల్సిందే
- ధనిక రాష్ట్రంలో జీతాల కోసం ధర్నా చేయడం సిగ్గుచేటు : యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యుల ఆగ్రహం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతినెల ఒకటో తేదీన జీతాలివ్వకపోవడం, ఈ-కుబేర్‌లో బిల్లులన్నీ పెండింగ్‌లో ఉండడం ప్రమాదకరమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విమర్శించారు. వారి కడుపుమండే బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ దిశగా విధానాలను మార్చుకుంటారా? లేదంటే తగిన మూల్యం చెల్లించుకుంటారా?అని సీఎం కేసీఆర్‌ను హెచ్చరించారు. ఎయిడెడ్ జీతాలు, పెండింగ్ బిల్లుల మంజూరు కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు వేతనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. ఎన్నో పథకాలకు రూ.వేల కోట్లు కేటాయించే ప్రభుత్వం ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం రూ.300 నుంచి రూ.500 కోట్లు కేటాయించలేకపోవటం ఏమిటని ప్రశ్నించారు. ఆ బిల్లుల చెల్లింపుల కోసం బడ్జెట్ ఉన్నప్పటికీ గత మూడు నెలలుగా ఎయిడెడ్ టీచర్లకు వేతనాలు ఇవ్వక పోవటం సిగ్గుచేటని విమర్శించారు. ధనిక రాష్ట్రమనీ, ఉద్యోగులకు అత్యధిక జీతాలిస్తున్నామనీ పదే పదే చెప్పే పాలకులు సప్లిమెంటరీ వేతనాలు, సెలవు జీతాలు, టీఎస్‌జీఎల్‌ఐ, జీపీఎఫ్ క్లైములు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలు వంటి బిల్లులన్నీ నెలల తరబడి మంజూరు చేయకపోవటం వల్ల ఉపాధ్యాయులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మరో పిఆర్సీ గడువు సమీపిస్తున్నా 18 వాయిదాల్లో ఇస్తామన్న రెండు నెలల గత పీఆర్సీ బకాయిలు 11 నెలలు గడిచినా కేవలం మూడు, నాలుగుకు మించి జమ కాలేదని చెప్పారు. మూడు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ట్రెజరీల్లో పాసైన అన్ని బిల్లులకు సంబంధించిన నగదును ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసేందుకు ఆర్థిక శాఖ చొరవ చూపాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల ఒకటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతుందనీ, బిల్లులు పెండింగ్‌లో లేకుండా నిర్దిష్ట విధానం రూపొందించాలనీ డిమాండ్ చేశారు. వచ్చేనెల 11న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై స్టే ఎత్తేసి చేపట్టాలని సూచించారు. లేదంటే ఉపాధ్యాయ నియామకాలపై ప్రభావం పడుతుందన్నారు. జీతాల ఆలస్యం, బిల్లుల పెండింగ్‌పై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నీ గొంతెత్తాలనీ, ఐక్యంగా పోరాడాలనీ ఆయన పిలుపునిచ్చారు. యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, ముత్యాల రవీందర్, ఎం సోమయ్య, ఎన్ యాదగిరి, వై విజయకుమార్, ఎస్ హరికృష్ణ, బి కొండయ్య, నజీర్, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి కృష్ణమూర్తి మాట్లాడుతూ ధనిక రాష్ట్రంలో జీతాల కోసం ధర్నా చేయాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటని విమర్శించారు. ఎయిడెడ్ టీచర్లకు మూణ్నెల్లుగా జీతాలివ్వకుంటే ఆ కుటుంబాలు ఎలా బతకాలని ప్రశ్నించారు. ఉపాధ్యాయులూ మనుషులేననీ, వారి అవసరాలు తీర్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రెజరీల్లో ఆమోదం పొంది ఆర్థికశాఖ వద్ద నెలల తరబడి పెండింగులో ఉన్న బిల్లులన్నీ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా విడుదల చేయాలని డిమాండ్ కోరారు. యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, వై అశోక్ కుమార్, టి లింగారెడ్డి అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు భద్రయ్య, వివిధ జిల్లాల నుంచి వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### యూఎస్‌పీసీ డిమాండ్లు :

- ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీనే వేతనాలివ్వాలి.
- ఎయిడెడ్ టీచర్లకు మూడు నెలలుగా బకాయి పడిన వేతనాలను వెంటనే విడుదల చేయాలి.
- ట్రెజరీల్లో పాసై ప్రభుత్వం వద్ద పెండింగులో ఉన్న సప్లిమెంటరీ వేతనాలు, పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు,మెడికల్ రీయింబర్స్‌మెంట్, సెలవు వేతనాలు,పెన్షనరీ బకాయిలు, టీఎస్‌జీఎల్‌ఐ, జీపీఎఫ్ క్లైములు తదితర బిల్లులన్నీ ఈనెల 31లోగా విడుదల చేయాలి.




# మోడీదంతా ప్రచారమే..

(మొదటిపేజీ తరువాయి)

బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.
స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బీజేపీ లేదు కానీ దాని మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ ఉందన్నారు. దానికి హిందూ, ముస్లింల మధ్య ఘర్షణ పెట్టాలని తప్ప ఏనాడూ ఉద్యమంలో పాల్గొనాలన్న ధ్యాస లేదన్నారు. ఫ్యూడల్, వెట్టి చాకిరీ, భూస్వామ్య పాలన నుంచి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమం జరిగిందన్నారు. ఆ విప్లవ పోరాటంలో పాల్గొన్న దుంపల మల్లారెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. 1947 తర్వాత కర్నాటకలో మత ఘర్షణలకు కారణం ఆర్‌ఎస్‌ఎస్ అని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు పుట్టిన బిడ్డ బీజేపీ నాడు కర్నాటక రాష్ట్రంలో చేసిన విధంగానే నేడు దేశవ్యాప్తంగా మతకల్లోలం సృష్టించాలని చూస్తోందన్నారు. ఎనిమిదేండ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వాన్ని నడిపింది ఆర్‌ఎస్‌ఎస్ అని చెప్పారు. మైనార్టీలపై దాడులు చేస్తే హిట్లర్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. బీజేపీ పాలను చూసి ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలుస్తుందన్నారు.
మేకిన్ ఇండియా ప్రభుత్వాన్ని తీసుకొస్తానని చెప్పి చైనా నుంచి, విదేశాల నుంచి పెద్దఎత్తున సరుకులను దిగుమతి చేసుకున్న ఘనత మోడీదేనని విమర్శించారు. ప్రజలపై భారాలు మోపుతూ.. అదానీ లాంటి వారికి దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడం వెనుక మోడీ కుట్ర ఉందన్నారు. ఇలాంటి కుట్రలు ఎప్పటికప్పుడూ సీపీఐ(ఎం) ఎండగడుతుందని చెప్పారు. దేశంలో ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లో మోడీ తన జేబు సంస్థలతో భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ రాహుల్ గాంధీ విషయంపై స్పందించడం అభినందనీయమన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ కవిత విషయంలో స్పందించలేదన్నారు. గవర్నర్ కేటీఆర్, కేసీఆర్‌పై ఫిర్యాదు చేయడం సమంజసం కాదన్నారు. ఫాసిస్టు విధానాలతో వస్తున్న మోడీని అడ్డుకోవాలంటే ప్రతిపక్షాలన్నీ ఐక్యం కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ మాత్రమే పని చేస్తుందని, కాంగ్రెస్ తన స్థాయికి తగ్గ పోరాటం చేయడం లేదని అభిప్రాయపడ్డారు.

### అవినీతి పాలనపై సమర శంఖం

### సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

మోడీ అవినీతి పాలనపై సమర శంఖం పూరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, స్కీం వర్కర్లు తమ డిమాండ్లను, హక్కులను అడుగుతుంటే పరిష్కరించకుండా మోడీ ముసి ముసి నవ్వులు నవ్వుతున్నారని విమర్శించారు. అంగన్వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖకు నిధుల కోత పెట్టారన్నారన్నారు. ఐకేపీ, వీఏఓ స్కీం వర్కర్ల వ్యవస్థను రద్దు చేయడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. ఆర్టీసీ లాంటి సంస్థలను నిర్వీర్యం చేయడానికి రవాణా రంగంలో కొత్త చట్టాలు తెచ్చారన్నారు. ఆదిలాబాద్ ప్రారంభమైన ఈ యాత్రలో వేలాదిమంది తమ వినతిపత్రాలు అందజేశారన్నారు.
బీజేపీ ఎంపీ సోయం బాపూరావు, బండి సంజయ్, అరవింద్ ఎన్నో మాటలు చెప్పారు తప్ప అమలు చేయలేదని విమర్శించారు. లౌకిక వాదం, సామాజిక వాదం, ఫెడరలిజం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి ప్రసంగించారు. ఈ యాత్రకు సీపీఐ, బీఎస్పీ మద్దతు తెలిపాయి. ఈ కార్యక్రమంలో జన చైతన్య యాత్ర బృందం సభ్యులు జయలక్ష్మి, లెల్లెల బాలకృష్ణ, స్కైలాబ్ బాబు, పైళ్ల ఆశయ్య, జగదీష్, అడివయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## 'మెట్రో'పై కేంద్రానిది వివక్షే

- రద్దీ లేదనడం అర్థరహితం: కేంద్రానికి కేటీఆర్ ఘాటు లేఖ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టు రెండవ దశ సాధ్యం కాదన్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని రాష్ట్ర పురపాలక, పారిశ్రామిక, ఐటీ శాఖల మంత్రి కే తారకరామారావు తప్పుపట్టారు. ఇది తెలంగాణపై మరోసారి వివక్ష చూపించడమే అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో రెండో దశకు హైదరాబాద్ నగర ట్రాఫిక్ రద్దీ సరిపోదనడం పూర్తిగా అర్థరహితమని ఆక్షేపించారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి, కాన్పూర్, ఆగ్రా, ప్రయాగ్‌రాజ్, మీరట్ వంటి చిన్న పట్టణాలకు కేంద్రం మెట్రో ప్రాజెక్టులు కేటాయించిందనీ, హైదరాబాద్ వాటికంటే చిన్న సిటీ అవుతుందా? అని ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం నాడాయన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరికి ఘాటుగా లేఖ రాసారు. మెట్రో రెండోదశ డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుతో (డీపీఆర్) పూర్తి సమాచారం అందించామని ఆ లేఖలో గుర్తుచేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైల్ విస్తరణ అర్హత లేదని చెప్పడం తనను చాలా ఆశ్చర్యానికి గురి చేసిందంటూ ఆ లేఖలో నిరసన వ్యక్తం చేశారు. ఇది కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం పక్షపాత దక్పథంతో తీసుకున్న నిర్ణయమేనని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి అన్ని అర్హతలు, అనుకూలతలు ఉన్న వివిధ ప్రాజెక్టులు, కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షను అనేకసార్లు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు తాను కూడా స్వయంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామని లేఖలో పేర్కొన్నారు. అయినా కేంద్రంనుంచి ఇప్పటిదాకా ఎలాంటి సానుకూల స్పందన రాలేదన్నారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ, పీహెచ్‌డీటీ గణాంకాలు, ఇతర అర్హతలు, సానుకూలతలతో డీటీఆర్ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.

బిజినెస్

## పాన్‌తో ఆధార్ లింక్ గడువు పొడిగింపు



**న్యూఢిల్లీ :** పాన్ కార్డ్‌తో ఆధార్ అనుసంధానం గడువును మరో మూడు మాసాలు పొడిగిస్తున్నట్లు ఆర్థిక శాఖ ప్రకటించింది. రూ.1000 జరిమానాతో మార్చి 31 నాటికే ఈ గడువు ముగియనుంది. కానీ కొన్ని కోట్ల మంది ఇప్పటికీ వీటిని లింక్ చేసుకోనందున గడువు పెంచాలని భావించిందని తెలుస్తోంది. దీంతో పాన్, ఆధార్ అనుసంధానానికి జూన్ 31 వరకు అవకాశం కల్పించింది. అనుసంధానం చేసుకోకపోతే జూలై ఒకటో తేదీ నుంచి పాన్ కార్డ్ పని చేయదని ఆర్థిక శాఖ హెచ్చరించింది. ఇప్పటికే పలు సార్లు గడువు పొడిగించింది. పాన్, ఆధార్ లింక్‌కు రూ.1,000 రుసుం చాలా భారమని అనేక మంది ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 51 కోట్ల పాన్‌లు ఆధార్‌తో అను సంధానం అయ్యాయని సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సిబిడిటి) పేర్కొంది.

## దక్షిణాదిలోకి జెకె ప్రీమియం కారు టైర్లు

- లెవిటాస్ అల్ట్రా టైర్ల విడుదల



**హైదరాబాద్ :** ప్రముఖ టైర్ల తయారీ కంపెనీ జెకె టైర్ కొత్తగా ప్రీమియం కార్లకు ఉపయోగించే లెవిటాస్ అల్ట్రా శ్రేణీ టైర్లను దక్షిణాది మార్కెట్లోకి విడుదల చేసింది. వీటిని మంగళవారం హైదరాబాద్‌లో జెకె టైర్ అండ్ ఇండస్ట్రీస్ ఎండి అన్షుమన్ సింఘానియా, అధ్యక్షులు అనూజ్ కథూరియాలు ఆవిష్కరించారు. ఇది పొడి, తడి నేలలు, బ్రేకింగ్, క్యాబిన్ లోపలి శబ్దాల పరంగా అసాధారణ పనితీరును కనబర్చనున్నాయని సింఘానియా, కథూరియాలు తెలిపారు. వారు ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌లో తమకు తొమ్మిది, మెక్సికోలో మూడు చొప్పున తయారీ ప్లాంట్లు ఉన్నాయన్నారు. ఏడాదికి 3.2 కోట్ల యూనిట్ల సామర్థ్యం కలిగి ఉన్నామన్నారు. దేశంలో ప్రస్తుతం ఈ పరిశ్రమ రూ.70,000 కోట్ల విలువ చేస్తుందని.. 2025 నాటికి రూ.1 లక్ష కోట్లకు చేరొచ్చని అంచనా వేశారు. తమ కంపెనీ రెండంకెల వృద్ధిని సాధిస్తుందన్నారు. భారత్‌లో లగ్జరీ కార్ల వినియోగం భారీగా పెరుగుతుందన్నారు. నూతన లెవిటాస్ అల్ట్రా శ్రేణీ టైర్లు ఏప్రిల్ 1 నుంచి కీలక నగరాల్లో లభ్యమవుతాయన్నారు.

## రెట్టింపైన వీసా దరఖాస్తులు



**హైదరాబాద్ :** కరోనా ముందు నాటి స్థాయికి వీసా దరఖాస్తుల సంఖ్య చేరుకుంది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ ఆంక్షలను ఎత్తివేయడానికి తోడు పర్యాటకానికి డిమాండ్ పెరగడంతో వీసా కోసం దరఖాస్తులు చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. విఎఫ్ఎస్ గ్లోబల్ సమాచారం ప్రకారం.. హైదరాబాద్ నుంచి దరఖాస్తుల సంఖ్య పరంగా చూస్తే 2019 కొవిడ్ ముందస్తు నాటి దరఖాస్తులలో 95 శాతానికి 2022లో చేరుకుంది. 2021తో పోలిస్తే ఏకంగా 129 శాతం వృద్ధి చోటు చేసుకుంది."భారత్ నుంచి 2022లో మేము భారీ డిమాండ్‌ను చూశాము. అసాధారణ ట్రావెల్ సీజన్‌గా ఇది నిలవడంతో పాటుగా డిసెంబర్ నెల వరకూ కూడా స్థిరంగా దరఖాస్తులను చూస్తూనే ఉన్నాము. ఈ వేగం మరింతగా పెరగనుందని అంచనా. ఈ క్రమంలో వీసా అభ్యర్థనలకు సంబంధించి తమ దరఖాస్తులను ముందుగానే పెట్టవలిసినదిగా సూచిస్తున్నాము. తద్వారా చివరి నిమిషంలో ఊహాతీత సంఘటనలను అధిగమించవచ్చు" అని విఎఫ్ఎస్ గ్లోబల్ సౌత్ ఆసియా చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రబుద్ధ సేన్ పేర్కొన్నారు.

## ఎఐతో పలు ఉద్యోగాలు కనుమరుగు

- గోల్డ్‌మాన్ శాక్స్ హెచ్చరిక

**న్యూఢిల్లీ :** కృత్రిమ మేధస్సు (ఎఐ)తో ప్రపంచ వ్యాప్తంగా భారీగా ఉద్యోగాలు ఊడొచ్చని గోల్డ్‌మాన్ శాక్స్ హెచ్చరించింది. ఎఐ టెక్నాలజీతో కొన్ని ఉద్యోగాలు కనుమరుగు కావొచ్చని ఒక నివేదికలో పేర్కొంది. నిర్వహణ, న్యాయ సేవల రంగాలపై పెను ప్రభావం ఉండొచ్చని తెలిపింది. ఎఐ ఆటోమేషన్ అధికంగా ఉన్న అమెరికా, యూరప్‌లో మూడింట ఒక్క వంతు ఉద్యోగాలను భర్తీ చేయగల సామర్థ్యం ఎఐకి ఉందని అంచనా వేసింది. ఎఐతో 44 శాతం న్యాయ సేవల ఉద్యోగాలు, 46 శాతం నిర్వహణ విభాగంలో సిబ్బంది తమ ఉనికిని కోల్పోవచ్చని తెలిపింది. నిర్మాణ రంగంలో 6 శాతం, మెయింటనెన్స్ రంగంలో 4 శాతం చొప్పున ఉద్యోగాలు పోవచ్చని పేర్కొంది. ఇటీవల చాట్‌జిపిటి తరహా టెక్నాలజీ రాకతో అనేక ఉద్యోగాలు పోవచ్చనే అంచనాలు పెరుగుతున్నాయి. ఈ టెక్నాలజీ వల్ల ముఖ్యంగా వినియోగదారుల సేవల రంగంలోని ఉద్యోగులు ఎక్కువగా ప్రభావితం కానున్నారని చాట్‌జిపిటి ప్రతినిధులే పేర్కొంటున్న విషయం తెలిసిందే.


## లాయిడ్ ఎసీలకు మహేష్ బాబు, తమన్నా ప్రచారం

HAVELLS
LLOYD

**హైదరాబాద్ :** లాయిడ్ గ్రాండే హెవీ డ్యూటీ ఎయిర్ కండీషనర్లు (ఏసీ)లకు ప్రముఖ నటులు మహేష్ బాబు, తమన్నా ప్రచారం కల్పించనున్నారని ఆ సంస్థ తెలిపింది. హావెల్స్ ఇండియాకు చెందిన లాయిడ్ తన ఈ ప్రచారం కోసం రూపొందించిన క్యాంపెయిన్‌లో మహేష్‌బాబు, తమన్నా నటించారు. దక్షిణాదిలో తమ బ్రాండ్లకు ఆదరణ పెరగడానికి ఈ ప్రచారం దోహదం చేయనుందని లాయిడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అలోక్ టిక్కూ పేర్కొన్నారు. లాయిడ్ గ్రాండే హెవీడ్యూటీ ఎసి ప్రచార కార్యక్రమాలను భారీగా చేపట్టనున్నట్లు హావెల్స్ ఇండియా ఇవిపి రోహిత్ కపూర్ తెలిపారు. 'ఖయాల్ జో ఘర్ కో ఘర్ బనాయే' అనే నినాదంతో ఎయిర్ కండీషనర్ పోర్ట్‌ఫోలియోపై ఎక్కువ విశ్వాసం, అనుబంధాన్ని పెంపొందించాలనేది తమ లక్ష్యమన్నారు.

## సివిల్ సర్వీసులకు ఎస్టీలు 166 మందే..!

- ఎస్సీలు 340.. ఓబీసీలు 695 మంది
- ఐదేండ్లలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌లుగా నియమితులైంది వీరే : కేంద్రం సమాచారం



**న్యూఢిల్లీ:** దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆలిండియా సివిల్ సర్వీసులకు ఎంపికవుతున్న ఎస్సీ, ఎస్టీల సంఖ్య చాలా తక్కువగా ఉంటున్నది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి సివిల్ సర్వీసులకు యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో ఎస్సీ, ఎస్టీల అభ్యర్థులు అధిక సంఖ్యలో ఎంపికయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వాలు చెప్తున్నప్పటికీ అలాంటి పరిస్థితులేమీ కనిపించడం లేదు. 2018-2022 మధ్య గత ఐదేండ్లలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక వర్గాల నుంచి సివిల్ సర్వీసులకు తక్కువ మొత్తంలో ఎంపికైన అభ్యర్థుల సంఖ్యను చూస్తే ఇది అర్థమవుతున్నది. కేంద్రం వెల్లడించిన అధికారిక సమాచారంలో ఈ విషయం వెల్లడైంది.

### 4365 మందిలో ఎస్సీ,ఎస్టీ,ఓబీసీలు 1201 మంది

కేంద్రం సమాచారం ప్రకారం.. సివిల్ సర్వీసుల్లో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి మూడు విభాగాలకు చెందిన 4365 పోస్టులకు గానూ ఎస్టీలు 166 మంది, ఎస్సీలు 340 మంది, ఓబీసీలు 695 మంది ఎంపికయ్యారు. నియామకం జరిగిన మొత్తం పోస్టులకు ఈ మూడు సామాజిక వర్గాల నుంచి నియమితులైనవారి సంఖ్య 1201గా (27.51శాతం) ఉన్నది.

ఇందులో 2,163 ఐఏఎస్ పోస్టులకు ఎస్టీలు 68 మంది, ఓసీలు 140 మంది, ఓబీసీలు 288 మంది నియమితులయ్యారు. 1403 ఐపీఎస్ పోస్టులకు ఎంపికైనవారిలో ఎస్టీలు 62 మంది, ఎస్సీలు 129 మంది, ఓబీసీలు 229 మంది ఉన్నారు. అలాగే, 799 మంది ఐఎఫ్ఎస్ అభ్యర్థులు నియమితులు కాగా.. ఇందులో ఎస్టీలు 36 మంది, ఎస్సీలు 71 మంది, ఓబీసీలు 178 మంది ఉన్నారు.

# నాలుగేండ్లలో కనిష్టానికి ఉపాధి

### తగ్గిన బడ్జెట్ కేటాయింపులు

- మార్పులతో కార్మికులకు ఉపాధి దూరం
- ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర :బి. వెంకట్



**న్యూఢిల్లీ :** దేశంలో ఉపాధి హామీ పనులు పడిపోయాయి. స్కీమ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న డేటా విశ్లేషణ ప్రకారం గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ఈ సంవత్సరం జనవరి, ఫిబ్రవరిలో సృష్టించబడిన ఉపాధి గత నాలుగేండ్లలో మొదటి సారిగా కోవిడ్‌కు ముందు స్థాయి కంటే దిగువకు పడిపోయింది. ఈ ఏడాది జనవరిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద రూపొందించిన వ్యక్తుల సంఖ్య 20.69 కోట్లు, 2022 జనవరి (26.97 కోట్లు), 2021 జనవరి (27.81 కోట్లు), 2020 జనవరి (23.07 కోట్లు) కంటే తక్కువగా నమోదైంది. ఫిబ్రవరిలో కూడా 20.29 కోట్లు, ఇది అంతకుముందు సంవత్సరాల్లోని సంబంధిత నెల కంటే తక్కువగా ఉంది. 2022లో 26.99 కోట్లు, 2021లో 30.79 కోట్లు, 2020లో 26.75 కోట్లు ఉపాధి నమోదైంది. దీనిపై కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి ఎటువంటి సమాచారం లేదు.

**ఉపాధి పొందిన కుటుంబాల సంఖ్య**

కోవిడ్-19 వ్యాప్తి కారణంగా 2020 మార్చిలో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించినా ఉపాధి కింద పని కోసం డిమాండ్ పెరిగింది. 2020 జూన్‌లో స్కీమ్ కింద 64 కోట్లకు పైగా పర్సనల్-డేలు రూపొందించబడినప్పుడు ఇది గరిష్ట స్థాయికి చేరుకుంది. అప్పటి నుండి ఉపాధి హామీ చట్టం కింద రూపొందించబడిన వ్యక్తుల-రోజుల నెలవారీ సంఖ్య కోవిడ్‌కు ముందు (ఆర్థిక సంవత్సరం 2019-20) కంటే ఎక్కువగా ఉంది. అయితే ఈ సంవత్సరం జనవరి నుండి, కోవిడ్‌కు ముందు ఉన్న స్థాయిల కంటే వ్యక్తిగత రోజుల సంఖ్య తక్కువగా ఉంది. అదే విధంగా ఉపాధి పొందుతున్న కుటుంబాల సంఖ్య కూడా తగ్గిపోయింది. 2023 ఫిబ్రవరిలో 1.67 కోట్ల కుటుంబాలు ఉపాధి పొందాయి. ఇది 2022 ఫిబ్రవరి (2.02 కోట్లు), 2021 ఫిబ్రవరి (2.28 కోట్లు), 2020 ఫిబ్రవరి (1.87 కోట్లు) కంటే తక్కువ.

**మార్పులతో కార్మికులకు ఉపాధి దూరం**

ఉపాధి హామీ చట్టం అమలుకు సంబంధించిన అనేక మార్పుల వల్ల కూడా కార్మికులు ఉపాధికి దూరం అవుతున్నారు. 2023 జనవరి 1 నుండి అమలులోకి వచ్చే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ (ఎన్ఎంఎంఎస్)తో హాజరును గుర్తించడాన్ని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తప్పనిసరి చేసింది. కార్మికులు కూడా 'ఉపాధి' పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన రెండు టైమ్ స్టాంప్, జియోట్యాగ్ చేయబడిన ఫొటోగ్రాఫ్‌లను పొందాల్సి ఉంటుంది. ఈ కొత్త వ్యవస్థతో పౌరుల పర్యవేక్షణను పెంచడం, పాలన సౌలభ్యం లక్ష్యంగా ఉందని మంత్రిత్వ శాఖ వాదిస్తున్నప్పటికీ, ఇది చట్టం అమలులో అవరోధాలను సృష్టిస్తోంది. అలాగే కార్మికుల వేతనాలను చెల్లించడానికి ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏబీపీఎస్) వినియోగాన్ని కూడా మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి నుండి తప్పనిసరి చేసింది. దీనివల్ల వ్యవసాయ కార్మికులు ఉపాధికి దూరం అవుతున్నారు. ఈ కొత్త హాజరు, చెల్లింపు వ్యవస్థలను వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**తగ్గిన బడ్జెట్ కేటాయింపులు**

కేంద్ర ప్రభుత్వం కావాలనే ఉపాధి హామీకి నిధులను తగ్గిస్తోంది. ఇటీవలి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి భారీగా కోతలు విధించింది. 2020-21లో ఉపాధి హామీకి రూ.1,11,500 కోట్లను కేటాయించిన కేంద్ర ప్రభుత్వం, 2021-22లో రూ.98 వేల కోట్లకు తగ్గించింది. 2023-24 బడ్జెట్‌లో అదికాస్తా రూ.60 వేల కోట్లకు తగ్గించింది.

### ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర



ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అఖిల భారత వ్యకాస (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. కుట్రలో భాగంగానే ఒక పక్క బడ్జెట్ కేటాయింపులు తగ్గి స్తుందని, మరోపక్క చట్టం అమలులో మార్పులు చేస్తుందని మండిపడ్డారు. ఈ చట్టం అమలులో బయోమెట్రిక్, ఆధార్ ఆధారిత చెల్లింపులతో ఉపాధి కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతోందని, దీని వల్ల కార్మికులు ఉపాధికి దూరం అవుతారని అన్నా రు. కార్మికులు ఉపాధికి దూరమైతే, ఈ చట్టాన్ని పూర్తిగా లేకుండా చేయొచ్చనే ప్రభుత్వ అజెండాలో భాగంగానే మార్పులు చేస్తున్నారని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర కోత విధిస్తున్నారని, ఇది ఉపాధి హామీ చట్టం అమలుకు అడ్డంకిగా ఉంటుందని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా ఇతర సంఘాలతో కలిసి ఏఐఏడబ్ల్యూయూ దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతుందని పిలుపునిచ్చారు.

బి.వెంకట్

# నోటీసులు మాకు..సమాచారం కేటీఆర్‌కు

### కేటీఆర్ కనుసన్నల్లోనే సిట్ విచారణ

- సిట్ అధికారి శ్రీనివాస్ ట్రాక్ రికార్డు సరిగ్గా లేదు
- సీబీఐ, ఈడీ, ఏసీబీలతో ప్రత్యేక సిట్ వేయాలి
- ఫిర్యాదుకు సీబీఐ, ఈడీ డైరెక్టర్లు సమయం ఇవ్వడం లేదు :ఢిల్లీలో మీడియాతో రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ :** టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై ప్రశ్నించినందుకు తమకు నోటీసులు , కేటీఆర్‌కు సమాచారం ఇస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మండిపడ్డారు. సిరిసిల్లలో సోమవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు, టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ అంశంపై మంగళవారం నాడిక్కడ రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. "ఈ కేసులో బ్యాంకు లావాదేవీల కంటే ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా జరిగాయి. కోట్ల రూపాయలు చేతులు మారాయి. మనీలాండరింగ్, హవాలాతోపాటు విదేశాల్లో లావాదేవీలు జరిగాయి. కాబట్టి సిట్ ఒక్కటే ఈ కేసును విచారించలేదు. సీబీఐ, ఈడీ, ఏసీబీ శాఖలతో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలి" అని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఫిర్యాదు చేసేందుకు కాంగ్రెస్ ఎంపీలు, మాజీ ఎంపీలు గత రెండు, మూడు రోజులుగా అపాయింట్‌మెంట్ అడుగుతుంటే సీబీఐ, ఈడీ డైరెక్టర్లు తమకు సమయం ఇవ్వడం లేదన్నారు. ఈ మీడియా సమావేశం చూసైనా తమకు వెంటనే అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఆయన కోరారు.

ఈ కేసులో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారని, అందువల్ల అవినీతి నిరోధక చట్టం కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. "కానీ సిట్ అవినీతి నిరోధక చట్టం కింద ఒక్క సెక్షన్ కూడా పెట్టలేదు. అవినీతి నిరోధక చట్టం కింద కేసులు పెడితే..ఈ కేసులు ఏసీబీ పరిధిలోకి వెళ్తాయి. ఏసీబీ కోర్టుకు క్రిమినల్ కేసులను కూడా విచారించే అధికారం ఉంటుంది. తద్వారా విచారణ త్వరగా ముగుస్తుంది. సీబీఐకి కేసు ఇస్తే ఈడీ కూడా వస్తుంది. అప్పుడు ఇంకా సత్వరంగా కేసులు తేలే అవకాశం ఉంటుంది" అని అన్నారు. ప్రస్తుతం నిందితుల మీద పెట్టిన సెక్షన్లు, సాధారణ కోర్టుల్లో విచారణ జరిగితే ఈ కేసు తేలడానికి ఏండ్ల సమయం పడుతుందని రేవంత్ వ్యాఖ్యానించారు.


ఈ కేసు నుంచి మంత్రి కేటీఆర్ తప్పించుకోవడానికి.. ఎదురుదాడి చేస్తూ.. విచారణ అధికారులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒత్తిడి తీసుకువస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. పేపర్ లీకేజీ విషయాన్ని తామే పసిగట్టామని కేటీఆర్ చెప్పడం అబద్ధం అని అన్నారు. డబ్బు పంపకాల్లో వచ్చిన తేడాల వల్లే.. నిందితుల ద్వారా ప్రశ్నపత్రాల లీకేజీ బయటపడిందన్నారు. దీన్ని కప్పిపుచ్చడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబంపై ఆరోపణలు రావడంతో విధిలేని పరిస్థితుల్లోనే టీఎస్పీఎస్సీ బేగంపేట పీఎస్‌లో ఫిర్యాదు చేసిందని, ఈ కేసును పక్కదారి పట్టించేందుకు, ప్రభుత్వ పెద్దలను కాపాడేందుకు ప్రభుత్వం కేసును సిట్‌కు అప్పగించిందని తెలిపారు.

"ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారి శ్రీనివాస్ ట్రాక్ రికార్డు సరిగ్గా లేదు. గతంలో హై కోర్టుకు కంటెప్ట్ ఆఫ్ కోర్టు కింద ఆయనకు రెండు వారాల శిక్ష విధించింది. టీఎస్పీఎస్సీలో నమోదు చేసుకున్న 30 లక్షల మంది, నమోదు చేసుకొని వారు 20 లక్షల మంది ఉంటారు. మొత్తం మీద 50 లక్షల మంది నిరుద్యోగుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న సమస్య. కేసీఆర్ కు తెలంగాణ విద్యార్థులు నచ్చకపోవచ్చు. కానీ జీవితాలతో చెలగాటమాడే అధికారం కేసీఆర్, కేటీఆర్‌కు లేదు. తెలంగాణలో నిజాయితీ పరులైన అధికారులు చాలా మంది ఉన్నారు. ఇప్పటికైనా ఆంధ్రా అధికారుల చేతుల్లోంచి విచారణను తప్పించాలి. కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ బిడ్డలైతే తక్షణమే ఈ కేసును తెలంగాణ అధికారులతో జరిపించాలి. సీబీఐ, ఈడీ, ఏసీబీ డిపార్ట్ మెంట్స్ కలిపి సిట్ వేసి ఇందులో ఉన్న పెద్దలందరిని శిక్షించాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# రైతన్నల బలవన్మరణాలు

### కర్నాటకలో రోజుకు ముగ్గురు అన్నదాతల ఆత్మహత్య

- దేశవ్యాప్తంగా 22 శాతం బలవన్మరణాలు ఇక్కడే..!
- కేంద్ర ప్రభుత్వ సమాచారంలో వెల్లడి
- రాష్ట్రంలో బీజేపీ పాలనపై రైతన్నల ఆగ్రహం



**బెంగళూరు :** కర్నాటకలో బీజేపీ పాలనలో రైతులు కఠిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నదాతలకు సరైన సహకారం అందటం లేదు. దీంతో రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన ఎన్నికల హామీలు నీటి మీద రాతలుగా మిగిలిపోయాయని రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 2018 కర్నాటక అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ తన మ్యానిఫెస్టోలో రైతులకు అయ్యే ఖర్చుకు ఒకటిన్నర రెట్లు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)గా హామీ ఇచ్చింది. నిజానికి, 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపవుతుందని ప్రధాని కూడా తెలిపిన విషయం విదితమే.

**కర్నాటకలో మొత్తం రైతుల పరిస్థితి ఏమిటి?**

బీజేపీ తన రిపోర్ట్ కార్డును ప్రదర్శించడానికి బదులు వివిధ పథకాల లెక్కలను తెలుపుతున్నది. కిసాన్ సమ్మాన్ నిధి సమాచారాన్ని ప్రచారం చేసుకుంటున్నది. అయితే రైతుల పరిస్థితి ఏమిటన్న దానిపై మాత్రం ఏమీ చెప్పడం లేదు. కర్నాటకలో రైతుల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలంటే కర్నాటకలో రైతుల ఆత్మహత్యల గణాంకాలను చూస్తే పరిస్థితి తేటతెల్లమవుతుంది. రైతుల ఆత్మహత్యలపై రాజ్యసభలో వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం ప్రకారం.. రైతుల ఆత్మహత్యల్లో కర్నాటక దేశంలోనే రెండో స్థానంలో ఉంది. 2021లో ఇక్కడ 1,170 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అంటే రోజుకు ముగ్గురు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారన్న మాట. 2017లో ఈ సంఖ్య 1,157గా ఉంది. 2018 1365 మంది, 2019లో 1,331 మంది రైతన్నలు ఆత్మహత్య చేసుకున్నారు. కరోనా మహమ్మారి కాలమైన 2020లో 1072 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇది మళ్లీ 2021లో 1170కి పెరిగడం గమనార్హం. రైతుల ఆత్మహత్యల్లో తగ్గుదల లేకపోగా.. పెరిగినట్టు లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో మొత్తం రైతుల ఆత్మహత్యల్లో 22% ఒక్క కర్నాటక నుంచే కావడం గమనార్హం. అంటే దేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రతి నాలుగో రైతు కర్నాటకవారేని విశ్లేషకులు వివరించారు.

**కర్నాటక రైతుల ఆదాయ స్థితి**

కర్నాటకలో రైతుల నెలవారీ సగటు ఆదాయం రూ. 13,441గా ఉన్నది. ఇది మొత్తం రైతు కుటుంబం యొక్క ఆదాయం కావడం గమనార్హం. ఎందుకంటే సాధారణంగా పొలంలో జంతువులతో సహా కుటుంబం మొత్తం ఏదో ఒక రూపంలో పని చేయాల్సి ఉంటుంది. దీని ప్రకారం రైతు కుటుంబానికి రోజువారి ఆదాయం రూ.454 మాత్రమే. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ప్రకారం, దేశంలో నైపుణ్యం లేని నిర్మాణ కార్మికుడికి కనీస వేతనం రూ. 595గా ఉండటం గమనార్హం.అంటే, కర్నాటకలోని రైతు కుటుంబం భవన నిర్మాణ కార్మికుడికి నిర్దేశించినంత కూడా రోజుకు సంపాదించడం లేదు. నైపుణ్యం లేని భవన నిర్మాణ కార్మికుడి కంటే కర్నాటకలో రైతు కుటుంబ ఆదాయం తక్కువగా ఉందని స్పష్టమవుతున్నదని విశ్లేషకులు తెలిపారు. రైతుల జీవితాలను బాగు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సాక్షాత్తూ ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. దీంతో పాటు కర్నాటకలో రైతుల ఆత్మహత్యలకు గల కారణాలనూ ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే, బీజేపీ చేసుకుంటున్న ప్రచారాలు.. కర్నాటకలోని క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని రైతులు తెలిపారు. ఎన్నికల హామీలను విస్మరించి రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలకు కారణమవుతున్న బీజేపీకి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుతో సమాధానం చెబుతామని హెచ్చరించారు.

## కెనడాలో మరోసారి గాంధీ విగ్రహం విధ్వంసం

**టొరంటో :** కెనడాలో మరోసారి మహాత్మునికి అవమానం జరిగింది. బ్రిటీష్ కొలంబియా ప్రావిన్స్‌లోని యూనివర్శిటీ కేంపస్‌లో తాజాగా మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ప్రపంచ శాంతి దూతగా పిలుచుకునే మహాత్ముడి విగ్రహాన్ని ఖలిస్తాన్ మద్దతుదారులు ఇలా ధ్వంసం చేయడం రోజుల వ్యవధిలోనే రెండోసారి. సైమన్ ఫ్రాజర్ యూనివర్శిటీలో బుర్నాబై కేంపస్‌లో పీస్ స్క్వేర్ వద్ద వున్న మహాత్ముని విగ్రహాన్ని తాజాగా ధ్వంసం చేసినట్లు వాంకోవర్‌లోని భారత కాన్సులేట్ జనరల్ మంగళవారం తెలిపింది. శాంతి దూత విగ్రహాన్ని ధ్వంసం చేసిన హేయమైన నేరాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాన్సులేట్ ట్వీట్ చేసింది. తక్షణమే ఈ విషయమై దర్యాప్తు జరిపి, దోషులను కఠినంగా శిక్షించాల్సిందిగా కెనడా అధికారులను కోరినట్లు ఆ ట్వీట్ తెలిపింది. ఈ నెల 23న ఓంటారియో ప్రావిన్స్‌లోని హమిల్టన్ పట్టణంలో గల సిటీ హాల్‌కి సమీపంలోని మహాత్ముని విగ్రహాన్ని ఖలిస్తాన్ మద్దతుదారులు ధ్వంసం చేశారు. గతేడాది జులైలో రిచ్‌మండ్ హాల్‌లోని విష్ణు ఆలయంలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని విధ్వంసం చేయడంపై భారత కాన్సులేట్ జనరల్ నుండి తీవ్ర విమర్శలు, ఖండనలు వచ్చాయి. నేరపూరితమైన, విద్వేషంతో కూడిన చర్యను తీవ్రంగా ఖండిస్తూ దీనివల్ల కెనడాలోని భారతీయుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆ సమయంలో కాన్సులేట్ జనరల్ ట్వీట్ చేసింది.ఇటీవల కాలంలో కెనడాలో ఖలిస్తాన్ మద్దతుదారులు భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోంది. కొన్ని హిందూ ఆలయాలను కూడా ధ్వంసం చేశారు. ఫిబ్రవరి 13న మిస్సిసాగాలోని రామ మందిరాన్ని ఖలిస్తానీ తీవ్రవాదులు అపవిత్రం చేవారు. దీన్ని కూడా ఇండియన్ కాన్సులేట్ తీవ్రంగా ఖండించింది.



## రాచకొండ గుట్టల్లో సీపీఐ(ఎం) రణనినాదం


- మతోన్మాదాన్ని సహించబోమంటూ పిడికిలెత్తి నినాదం
- అడుగడుగునా కనిపించిన కృష్ణమూర్తి, పాషా, నరహరి స్ఫూర్తి
- ఆరుట్ల, మంచాలలో ఎర్రజెండా రెపరెపలు
- యాత్ర బృందం వెంట బైకుర్యాలీతో యువత
- సభలకు పెద్ద ఎత్తున తరలొచ్చిన జనం

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి చిరునామాగా నిలిచిన రాచకొండ గుట్టల్లో జయహో సీపీఐ(ఎం)...ఎర్రజెండకు జై నినాదాలు మార్మోగాయి. బీజేపీ మతోన్మాదాన్ని ఇక సహించబోమంటూ యువత పిడికిలెత్తి నినదించింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కాచం కృష్ణమూర్తి, పార్టీ ఉద్యమ నిర్మాతలు పాషా, నరహరిల స్ఫూర్తి అడుగడుగునా కపిపించింది. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల, మంచాలలో సీపీఐ(ఎం) జనచైతన్య యాత్ర బృందానికి ఉద్యమ స్వాగతం లభించింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎటుచూసినా ఎర్రజెండా రెపరెపలు కొత్త శోభను తెచ్చిపెట్టాయి. నియోజకవర్గంలో పూర్వవైభవం తెచ్చిపెట్టేందుకు దండు కదిలిందా అన్నట్టుగా ఉత్తేజపూరిత వాతావరణం నెలకొంది. పెద్దఎత్తున బైకు ర్యాలీ చేపట్టి యువత కదనరంగంలోకి దూకింది. మతోన్మాదుల చేతుల్లో హత్యగావించబడిన పాషా, నరహరి స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. ఆ ప్రాంతానికి ఉద్యమబాటలు వేసిన కాచం కృష్ణమూర్తిని స్మరించుకున్నారు. చాలా మంది వృద్ధులు వారితో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. భారీ క్రేన్‌తో యాత్ర బృందానికి గజమాల వేసి, ఎర్రజెండా పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. దారి పొడవునా పూలు చల్లుతూ ఎర్రజెండా అజేయమని నినదించారు. ఇబ్రహీంపట్నం పోటీ చేసే స్థానంలో ఉండదంటూ తమ్మినేని ప్రకటించగానే ప్రజలు, కార్యకర్తల నుంచి భారీ స్పందన వ్యక్తమైంది. ఈలలు, కేకలు వేస్తూ ఉత్సాహం పొందారు. విప్లవాల గడ్డ ఇబ్రహీంపట్నంకు వచ్చిన యాత్రకు గుండెల లోతుల్లో నుంచి చూపించిన ప్రేమాభిమానాలు అపూర్వమనీ, మరచిపోలేమని యాత్ర రథసారధి పోతినేని సుదర్శన్ ప్రకటించడంతో చప్పట్లు మార్మోగాయి. యాత్ర బృంద సభ్యులు పార్టీ శ్రేణులతో కలిసి నృత్యం చేశారు.

## పార్లమెంట్‌లో కొనసాగిన ఆందోళన

- నిమిషాల్లో ఉభయ సభలు వాయిదా



**న్యూఢిల్లీ :** పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. ప్రతిపక్షాలకు పోటీగా అధికార పక్షం కూడా ఆందోళన చేపట్టింది. అదానీ అంశంపై ప్రతిపక్షాల నిరసనలు, పలువురు నేతలు నల్ల దుస్తులు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో మంగళవారం ఉభయ సభల కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. తొలుత లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు నినాదాలను హోరెత్తించారు. దీంతో కేవలం రెండు నిమిషాల్లో సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి అదానీ సమస్యపై జేపీసీ విచారణకు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాగితాలు చింపి స్పీకర్ చైర్‌పైకి విసిరారు. అలాగే నలుపు క్లాత్‌ను కూడా విసిరారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే సభను బుధవారానికి వాయిదా వేశారు.

మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. రాజ్యసభ ప్రారంభం కాగానే ఇటీవల జరిగిన మహిళల బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు బంగారు పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన నిఖత్ జరీన్, లోవ్లినా బోర్గోహైన్, నీతూ ఘంఘాస్, సావీటీ బూరాలకు అభినందనలు తెలిపింది. అనంతరం అదానీ అంశంపై ప్రతిపక్ష సభ్యులు తమ నిరసనను కొనసాగించడంతో మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైన సభలో చైర్మన్ జగదీప్ ధన్కర్ సభలో చర్చకు నిర్ణయించిన బిల్లుల గురించి తెలియజేశారు. అయితే, ప్రతిపక్ష ఎంపీలు, వారిలో పలువురు నల్ల దుస్తులు ధరించి అదానీ అంశంపై రచ్చకు డిమాండ్ చేశారు. దీంతో సభను బుధవారానికి వాయిదా వేశారు.

## 2.38 లక్షలకు పైగా డొల్ల కంపెనీలు

- నిర్దిష్ట నిర్వచనం లేనివిగా గుర్తింపు

**న్యూఢిల్లీ:** 'షెల్ కంపెనీల' గురించి ఎటువంటి సమాచారం లేదని గతంలో మోడీ ప్రభుత్వం చెప్పినప్పటికీ.. 2018-2021 మధ్య 2,38,223 కంపెనీలను ప్రభుత్వం ప్రకటించింది. అయితే షెల్ కంపెనీలుగా లేబుల్ చేసి వాటి గురించి ఎలాంటి సమాచారాన్ని పంచుకోకపోవడం గమనార్హం. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ జూలై 27, 2021న రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయాన్ని తెలిపారు. ఈ విషయాన్ని ఎంపీ మహువా మిత్రా దీనిని ఎత్తిచూపారు. "చట్టంలో నిర్దిష్ట నిర్వచనం లేకుండా 2018 మరియు 2021 మధ్య ప్రభుత్వం 2,38,223 షెల్ కంపెనీలను గుర్తించడం విచిత్రంగా ఉంది" అని అన్నారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తన పత్రికా ప్రకటనలో "షెల్ కంపెనీ' అనే పదం కంపెనీల చట్టంలో నిర్వచించబడలేదని పేర్కొన్నది. సాధారణంగా యాక్టివ్ బిజినెస్ ఆపరేషన్‌లో లేని లేదా గణనీయమైన ఆస్తులు లేని కంపెనీని సూచిస్తుందని వివరించడంత గమనార్హం. భారతీయుల ఆఫ్‌షోర్ ఖాతాలకు సంబంధించిన డేటా తమ వద్ద లేదని కేంద్రం ఇప్పుడు పార్లమెంటుకు తెలిపింది. సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా అదానీకి చెందిన 'షెల్ కంపెనీల'లో రూ.20,000 కోట్లు 'అకస్మాత్తుగా వచ్చాయని' రాహుల్ గాంధీ ప్రకటించిన వెంటనే ఈ విషయం వెల్లడి కావడం గమనార్హం.

## సౌదీ అరేబియాలో బస్సు ప్రమాదం ..

- 20 మంది మృతి

**రియాద్ :** సౌదీ అరేబియాలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 20 మంది మృతి చెందగా పలువురికి గాయాలైనట్టు అధికారులు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్తున్న ఓ బస్సు ప్రమాదానికి గురైనట్టు అక్కడి మీడియా తెలిపింది. వివరాల ప్రకారం.. సౌదీ అరేబియా లోని అసిర్ ప్రావిన్స్‌లోగల అకాబత్ షార్ రహదారిపై సోమవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో యాత్రికుల బస్సు ఖమీస్ ముషైత్ నుంచి అభాకు వెళ్తోంది. ఆ సమయంలో బస్సు బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తాపడింది. దీంతో ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 20 మంది యాత్రికులు మృతి చెందారు. మరో 29 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న సివిల్ డిఫెన్స్ , సౌదీ రెడ్ క్రెసెంట్ అథారిటీ బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించారు. రంజాన్ నెల కావడంతో పలువురు ముస్లింలు మక్కా, మదీనా యాత్రలకు వెళ్తుంటారు. అయితే తొలి వారంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న బన్నాల ప్రవీణ్



నవతెలంగాణ-ఉప్పల్

రమజాన్ పవిత్ర మాసంలో ఉపవాస దీక్షలను పురస్కరించుకొని సోమవారం ఉప్పల్ డివిజన్లోని భారత్‌నగర్ కాలనీలో మైనారిటీ నాయకులు మగ్దూం భాయ్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాటీబ్ మునవర్ అలీ, నాయకులు బజారు జగన్, కొండల్ రెడ్డి, కాజా మొయినుద్దీన్, జవిడ్, సబర్ పాషా, అస్లాం భాయ్, ఫ్వాద్ హుస్సేన్, జహిద్ హుస్సేన్, షర్ఫుద్దీన్, గఫ్ఫార్ భాయ్, రఫిక్, నిజం అలీ, మాజీబ్ భాయ్, అబ్దుల్ కదరా, షకీల్, శ్రీనివాస్ యాదవ్, బాలు, భారత్, శ్యామ్ పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

### 200గ్రాముల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ-హయత్‌నగర్

అధిక డబ్బుకు ఆశ పడి గంజాయి విక్రయాలు చేస్తున్న వ్యక్తిని హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు రవీందర్ రావు ఆదేశాల మేరకు, హనుమంతరావు పర్యవేక్షణలో మంగళవారం పనామ వద్ద ఓం ప్రకాశ్ రెడ్డి వద్ద నుండి 200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్ తరలించినట్లు హయత్ నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపారు.

# పేదరిక నిర్మూలనే కేసీఆర్ సర్కారు లక్ష్యం

- సంక్షేమ పథకాలతో అభివృద్ధిలో పరుగులు తీస్తున్న తెలంగాణ రాష్ట్రం
- ప్రతిపక్షాలవి అవగాహన లేని విమర్శలు
- పట్టాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

పేదరిక నిర్మూలన కోసం కేసీఆర్ సర్కారు అహర్నిశలు కృషి చేస్తుందని, అందులో భాగంగానే అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నాడు మేడ్చల్ జిల్లా, మేడిపల్లి మండలం, పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని పేదలకు జీవో నెంబరు 58 ద్వారా క్రమబద్ధీకరించిన భూమి పట్టాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, అందులో భాగంగానే ప్రభుత్వ భూముల్లో తెలిసీతెలియక ఇండ్లు నిర్మాణం చేసుకున్న పేదలకు జీవో నెంబరు 58 ద్వారా క్రమబద్ధీకరించి పట్టాలు అందించారని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కెల్లా తెలంగాణ ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధిలో దూసుకుపోతుందని, తెలంగాణ అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్షాలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నాయని విమర్శించారు. ఇంకా దరఖాస్తులు చేసుకోని వారికి మరోసారి అవకాశం కల్పించడం జరిగిందని, వారందరూ దరఖాస్తు చేసుకొని పట్టాలు పొందాలని సూచించారు. అదేవిధంగా అనర్హులు ఎవరైనా తప్పుడు ధృవీకరణ పత్రాలతో ఈ పట్టాలు పొందితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి కీసర ఆర్డీవో రవి అధ్యక్షత వహించగా, మేడిపల్లి తహసీల్దారు మహిపాల్‌రెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ బోడుప్పల్ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, జంట కార్పొరేషన్లకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీని తలపిస్తున్న బీజేపీ పాలన

### కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి మల్ రెడ్డి రాంరెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

దేశంలో బీజేపీ పాలన ఎమర్జెన్సీని తలపిస్తుందని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దుపై మంగళవారం మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ జంక్షన్ వద్ద సత్యాగ్రహ సంకల్ప దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ బెల్లయ్య నాయక్, హాత్ సే హాత్ జోడో ఎల్బీనగర్ కన్వీనర్ రఘువీరారెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో ప్రస్తుతం నాయకులకంటే ఎక్కువగా ప్రజలకే అవసరం ఏర్పడిందని అన్నారు. దేశ ప్రజలందరూ కాంగ్రెస్ వైపు ఉన్నందుకే ఓర్వలేక బీజేపీ తప్పుడు కేసులను పెడుతుందని అన్నారు. హాత్ సే హాత్ జోడో ఎల్బీనగర్ కన్వీనర్ పి.రఘువీరా రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీకి మద్దతుగా జరుగుతున్న సత్యాగ్రహ సంకల్ప దీక్ష మల్ రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించమని పార్టీ తనను పంపిందని తెలిపారు. ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం ప్రశ్నించే గొంతుకని నొక్కివేయడమే అని అన్నారు. పార్లమెంటు సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తుందని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలను అణిచి వేయడమే లక్ష్యంగా బీజేపీ పాలన ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, శ్రీపాల్, సదాశివుడు, కిషోర్‌గౌడ్, నరసింహ యాదవ్, వేణు యాదవ్, మంజులారెడ్డి, రవికాంత్, మతిన్ భాయ్, సురేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్యామ్, చరణ్ రెడ్డి, రమేష్ నాయక్, రాజశేఖర్, మక్బుత్, షరీఫ్, జానీ, అరుణ్, నారాయణ, స్వర్ణ, మాధవి, కవిత, సౌమ్య, సంగీత, భాను, అస్లాం గోవర్ధన్, శరత్ కృష్ణారెడ్డి, యాదయ్య మరియు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు.

## ఆరోగ్యవంతమైన జీవితానికి యోగ ఎంతో ముఖ్యం

### ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ - సరూర్‌నగర్

ఆరోగ్యవంతమైన జీవితానికి యోగ ఎంతో ముఖ్యమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. జాగృతి అభ్యుదయ సంఘం చైర్మెన్ భావన శ్రీనివాస్, ఇస్మాయిల్ గురూజీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన యోగా శిక్షణ తరగతుల బ్రోచర్‌ను ఎమ్మెల్యే మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నటువంటి పరిస్థితుల్లో మానసికంగా, శారీరకంగా బలంగా ఉండడానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మనిషి శరీరం చేయగలిగే అత్యుత్తమ వ్యాయామాల్లో యోగ ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా యోగ ఎంతో ఆదరణకు నోచుకుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఏప్రిల్ రెండో తారీకు నుంచి యోగ శిక్షణా తరగతులు కర్మన్‌ఘాట్‌లోని మందమల్లమ్మ గార్డెన్ వద్ద గల లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయమాలు, ధ్యానము నేర్పించబడును అని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5-30 నుంచి 7గంటల వరకు సాయంత్రం 6:30 నుంచి 8 గంటల వరకు నిర్వహించబడుతుంది. ఈ శిక్షణలో పాల్గొనదలచిన వారు 9603256572 నెంబర్లను సంప్రదించగలరు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిరాజు తపోవదనగిరి, గోపాలకృష్ణ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ...

## పేద విద్యార్థి చదువు కోసం ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నాగోల్

ఉప్పల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక నిరుపేద వైశ్య విద్యార్థికి ఉన్నత చదువు కోసం ఉప్పల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ విభాగం అధ్యక్షులు మరియు ఉప్పల్ ఫౌండేషన్ చైర్మెన్ శ్రీనివాస గుప్తా ఆర్థిక సహాయం చేసి తన వంతుగా విద్యార్థికి చేయూతనిచ్చారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆర్యవైశ్య పేద విద్యార్థి, కేసెట్టి పవన్ చెన్నైలోని సెయింట్ పీటర్ యూనివర్సిటీలో బీటెక్ ఫోర్త్ ఇయర్ చదువుతున్నాడు. విద్యార్థి చదువును కొనసాగించడానికి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో పవన్ తండ్రి భాస్కర్ నాగోలులోని ఉప్పల శ్రీనివాసగుప్తను కలుసుకొని సహాయం చేయాలని కోరాడు. దీంతో వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఉప్పల శ్రీనివాస గుప్త 15వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని విద్యార్థి తండ్రి కేశెట్టి భాస్కర్కు అందించారు.

## అభివృద్ధిలో ఎల్బీనగర్ ముందంజలో ఉంది

### ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-ఎల్బీనగర్

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని లింగోజిగూడ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వరప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బుగ్గరపు దయనంద్, కార్పొరేషన్ చైర్మెన్ అమరవాది లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు గజ్జెల మధుసూదన్ రెడ్డి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో ఎల్బీనగర్ ముందంజలో ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురుతుంది అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో పలు కమిటీ పదవులు ఉన్న ప్రతి ఒక్కరు మన నియోజకవర్గ పరిధిలో జరిగే ప్రతి ఒక్క కార్యక్రమంలో పాలుపంచుకోవాలి అని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎమ్మెల్యేగా పార్టీ మారాల్సి వచ్చినపుడు ముఖ్యమంత్రిని నియోజకవర్గ అభివృద్ధి కోసం 5 డిమాండ్లు అడగడం జరిగిందని, వాటిని అమలుపరచడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడి వలే పార్టీ కోసం పనిచేయాలని, ఉద్యమకారులకు మన టీఆర్ఎస్ పార్టీ నందు ఎప్పుడు ప్రత్యేక స్థానం ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్రె శ్రీనివాస్, తిలక్ రావు, నర్సింహ గుప్తా, లక్ష్మీప్రసన్న, శ్రీధర్‌గౌడ్, భాస్కర్ గంగపుత్ర, శ్రవణ్ కుమార్, జగన్నాథ్ రెడ్డి, ఇంద్రజి, ఆశిష్, రాజు గౌడ్ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, మహిళలు, పలు విభాగాల అనుబంధ కమిటీసభ్యులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, పలు కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

### ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బి.ఎన్ రమేష్ మాదిగ



నవతెలంగాణ-హయత్‌నగర్

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టాలని జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బి.ఎన్ రమేష్ మాదిగ అన్నారు. ఏప్రిల్ 4,5 తేదీల్లో ఢిల్లీలో జరిగే ధర్నా కరప్రతాలను మంగళవారం ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు చిటుపాక యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో విడుదల చేశారు.

రమేష్ మాట్లాడుతూ మాదిగల న్యాయమైన డిమాండ్ ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు. న్యాయమైన డిమాండ్ నెరవేర్చకపోతే రాబోయే రోజులలో బీజేపీ ప్రభుత్వానికి మాదిగలు, మాదిక ఉపకులాలు తగ్గిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం జరిగే ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మోదుగు లాజరు మాదిగ, ఎంఎస్పీ జాతీయ అధ్యక్షులు మల్లేశ్వర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిటపాక ప్రభాకర్ మాదిగ, పాల్వాయివేణు మాదిగ, బీఆర్ఎస్ ఎల్బీనగర్ నియోజక వర్గం ఎస్సీ సెల్ చైర్మెన్ జోగు రాములు మాదిగ, ఈదుల పరుశురాములు, మామిడి కిషోర్ మాదిగ, లక్ష్మణ్ మాదిగ, తీగల యాదగిరి, చిప్పలపల్లి నరసయ్య, కొండగడుపున నగేష్, మామిడికాయల జనార్ధన్, ఉడుగు యాదయ్య, నిమ్మల అంజయ్య, విష్ణువర్ధన్, కృష్ణ, చిప్పలపల్లి యాదగిరి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు ప్రశాంతంగా జరుపుకోండి

### మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి




నవతెలంగాణ - మీర్‌పేట్

రాబోయే శ్రీరామనవమి, హనుమాన్ జయంతి పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ మద్ది మహేందర్ రెడ్డి అన్నారు. శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి పండుగల సందర్భంగా వివిధ సంఘాలు, భక్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంతోషంగా పండుగలు, ఉత్సవాలు, శోభ యాత్రలు జరుపుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా నిర్వహించుకోవాలని తెలిపారు. ఎవరు వేరొకరిని విమర్శించకుండా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఎక్కడ ఏమైనా అనుమానాస్పదంగా ఎవరు కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సత్యనారాయణ, ఉదయ్ భాస్కర్, బద్యా నాయక్, పోలీసు సిబ్బంది, వివిధ సంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

### కౌన్సిలర్ జోర్క గీత శ్రీరాములు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తానని కౌన్సిలర్ జోర్క శ్రీరాములు అన్నారు. అభివృద్ధిలో భాగంగా 20వ వార్డులో ఆరు లక్షల నిధులతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్‌రెడ్డిలతో కలిసి వార్డు కౌన్సిలర్ జోర్క గీత శ్రీరాములు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ జోర్క గీత శ్రీరాములు మాట్లాడుతూ 20వ వార్డులోని సన్‌రేసు కాలనీ రోడ్ నెం.5లో 6లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. దశలవారీగా వార్డులోని సమస్యలు గుర్తించి తక్షణమే పరిష్కరిస్తానని తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో మరిన్ని నిధులతో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ పథకాన్ని పేదలకు అందేవిధంగా కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు జోర్క రవి, పృథ్వి, రమేష్, నరేందర్, రామకృష్ణ, సోమేశ్, సతీష్, ఆంజనేయులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సెర్చ్ ఒలంపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ - మీర్‌పేట్

మీర్‌పేట్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయ సెర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 143 మంది విద్యార్థులు 1వ, 3వ, 5వ తరగతికి చెందిన 28మంది విద్యార్థులకు మీర్‌పేట్ శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్ గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఎస్ఇ పరీక్షలకు ఎంపిక అయినందుకు విద్యార్థులను అభినందించారు.

ఇదే పట్టుదలతో విద్యార్థులు చదివి మరింత ముందుకు వెళ్లాలని పాఠశాలకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏజీఎం సతీష్, డీన్ ప్రవీణ్, కోఆర్డినేటర్ రఘువంశి, వైస్ ప్రిన్సిపల్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఏసీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ జీ.శంకర్‌రాజు తెలిపారు. మంగళవారం దిల్‌సుఖ్ నగర్‌లోని సిద్ధార్థ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నింబధనలపై అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. యువతీ యువకులు తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయడం, వారు పంపించిన లింక్‌లను క్లిక్ చేయడం మంచిదికాదన్నారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ డా.జి.నాగయ్య, ప్రిన్సిపాల్ సల్మా సుల్తానా, అబ్దుల్, మజద్‌ఖాన్‌తోపాటు మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్ పోలీసులు, విద్యార్థులు కాలేజీ సిబ్బంది దాదాపు 160మందికిపైగా పాల్గొన్నారు.

## 'గ్రామ కంఠం భూమిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఎలా సాధ్యం?'



నవతెలంగాణ-హయత్‌నగర్

మన్సూరాబాద్ గ్రామ కంఠం భూమిలో బీజేపీ కార్పొరేటర్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఎలా సాధ్యం అని మన్సూరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి విమర్శించారు. మంగళవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని జక్కిడి సత్తి రెడ్డి కాలనీలో ఉన్న ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మన్సూరాబాద్ బీజేపీ కార్పొరేటర్ రాజకీయ లబ్ధి కోసం, తన ఉనికిని చాటుకోవడం కోసం బీఆర్ఎస్ నేతలపై, స్థానిక ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించం అని హెచ్చరించారు. చిన్న చెరువు వద్ద ఉన్న భూమి తన కుటుంబ వారసత్వ సంపద అని 1963 నుండి కబ్జాలో ఉన్నామని, 2009లో అప్పటి అధికారులు ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించారని, 2016లో అనుమతి కోసం ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు ఎన్ఓసీ ఇచ్చారన్నారు. 2022 నవంబర్‌లో దరఖాస్తు చేసుకుంటే 3000గజాలకు 5అంతస్థుల వరకు అనుమతులు మంజూరు అయ్యాయని వెల్లడించారు. కానీ స్థానిక కార్పొరేటర్ మాత్రం అనుమతి లేకుండా బార్ నిర్మాణం, చెరువుకు ఆనుకుని ఉన్న స్కూల్ ఏర్పాటు, తన కార్యాలయం ముందు అనుమతి లేని ద్విచక్ర వాహనం షెడ్డు ఏర్పాటు. కాస్మోపాలిటన్ కాలనీలో నిర్మిస్తున్న ఇల్లుకు ప్రస్తుతం జీ01 వరకే అనుమతి వున్నా అదనంగా నిర్మాణం చేయడం ఒక ప్రజాప్రతినిధి అయిన కొప్పుల నర్సింహారెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని, నీకు దమ్ము ఉంటే చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఆయన వెంట బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, నర్రి వెంకన్న, ఇరిగి రమేష్, సంరెడ్డి రాజిరెడ్డి, ఏర్పుల యాదయ్య, జగదీష్, సతీష్, టిల్లు, శివశంకర్, సాయి గౌడ్, జెనిగా అఖిల్ పాల్గొన్నారు.

### ఎఫ్‌టీఎల్ రిపోర్ట్‌ను మార్చిన అధికారులు : కార్పొరేటర్ కొప్పుల

మన్సూరాబాద్ చిన్న చెరువు విషయంలో ఎఫ్‌టీఎల్ హద్దులను రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు స్థానిక బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులతో కుమ్మక్కు అయి రిపోర్ట్‌ను మార్చారని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆరోపించారు. గతంలో చెరువు హద్దులు చెరిపివేశారని, అప్పటి తహశీల్దార్‌లు చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు హయాంలో 54లక్షల రూపాయల జరిమానా విధించారని గుర్తుచేశారు. అసలు జక్కిడి కుటుంబంది కేవలం 10ఎకరాలు మాత్రమే అని, కానీ స్థానిక యాదవుల భూమి 4ఎకరాలు కబ్జా చేశారని, మాములు వ్యక్తులు అయితే వెంటనే అక్కడికి కూల్చివేసేవారని, వారికి ఎమ్మెల్యే అండ ఉండడం వలన నిర్మాణాలు కొనసాగుతున్నా, వాటిని ఆపాలని అధికారికంగా ఫిర్యాదు చేసినా ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. తాను ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తే అధికారులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు.

## ఏప్రిల్ 9న ఓయూ వేదికగా విద్యార్థి నిరుద్యోగ గర్జన భారీ బహిరంగ సభ

**నవతెలంగాణ-ఓయూ**

తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ సమాజానికి బాసటగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కొట్లాడటనికి ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు మంగళవారం తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ ఐక్యవేదిక ఆర్ట్స్ కళాశాలలో సమావేశమయ్యారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ ఐక్యవేదిక చైర్మన్‌గా కోట శ్రీనివాస్ గౌడ్, అధ్యక్షుడిగా కొర్ర శరత్ నాయక్, ఉపాధ్యక్షుడు సుబ్బు నాయక్, జనరల్ సెక్రెటరీ వలిగొండ నరసింహ, అధికార ప్రతినిధిగా శ్రీకాంత్ యాదవ్, కార్యదర్శిగా మాండ్ల రవి, పెంచాల సతీష్, జాయింట్ సెక్రెటరీలుగా మహేష్ పెంటల, చింతోజు శ్రీకాంత్,.మీర్జా మొసిన్ బేగ్, కో-ఆర్డినేటర్, రమేష్ రాథోడ్ కో-ఆర్డినేటర్ సంతోష్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా అనిల్ ఎన్నుకున్నారు.

## మహ్మద్‌గూడలో కార్పొరేటర్ పర్యటన

- పలు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

**నవతెలంగాణ-ఓయూ**

సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి మహ్మద్‌గూడలో పర్యటించారు. రంజాన్ మాసం సందర్భంగా రోడ్లపై మురుగు నీరు నిల్వకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు స్థానికుల ఫిర్యాదు మేరకు డ్రయినేజీ ఉప్పొంగడంతో అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ నవ్య, బీఆర్ఎస్ నాయకులు జాకీర్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆత్మీయ సమ్మేళనం

**నవతెలంగాణ-ఓయూ**

సీతాఫలమండి మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ పద్మారావు, బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్టు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# బీజేపీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

- బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్

**నవతెలంగాణ-హైదరాబాద్**



మోదీ నాయకత్వంలోని కేంద్ర బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను గౌతమ్ అదానీ, అంబానీ కంపెనీలకు దోచిపెడుతూ, ఆ దోపిడీని వ్యతిరేకించిన ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ లాంటి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి ఇబ్బందులకు గురి చేస్తుందని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో బీఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి లొంగని వారిపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం, అభివృద్ధి 20 ఏండ్ల వెనక్కి వెళ్లిందన్నారు. పెరుగుతున్న ధరలు, వంట గ్యాస్ సిలిండర్ల డీజిల్, పెట్రోల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిసిందన్నారు. ఏప్రిల్ 11 మహాత్మా జోతిబా పూలే, ఏప్రిల్ 14న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలను బీజేపీ కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా జరపాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 10న డబుల్ బెడ్ రూం ఇండ్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద బీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు వనం సుధాకర్, వల్లేపు ఉపేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సుకన్య, తుకారాం నాయక్, మట్టయ్య సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

# జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలి



**నవతెలంగాణ-హైదరాబాద్**

నేడు ఇందిరాపార్క్ వద్ద జరిగే జనచైతన్య యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని సౌత్ జిల్లా సీఐటీయూ నాయకులు పి.నాగేశ్వర్ అన్నారు. గోషామహల్ బేగం బజార్ డివిజన్‌లో హమాలీ యూనియన్ నాయకులతో కలిసి బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. అన్ని రంగాల కార్మికులు పాల్గొని ఈ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.జంగయ్య, తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ సౌత్ జిల్లా ఉపాధ్యక్షులు నెమ్మది గోపాల్, ముక్తార్ గంజ్, మహారాజ్ గంజ్ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సాయిలు, జి.నర్సింహ్మా, కమిటీ సభ్యులు, సంతోష్, జి.అశోక్, ఎస్.కేశవరావు, కె.కిషన్, కె.రాములు, వి.విఠల్, కిరణ్, జి.సంజు, తదితరులు పాల్గొన్నారు.

**జూబ్లీహిల్స్** : జనచైతన్య యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎస్పీఆర్ హిల్స్ 2 బొమ్మల వద్ద సీపీఐ(ఎం) జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, టి.సాయి శేషగిరిరావు, జె.స్వామి, టి.భాగ్యరాజ్, బాలయ్య, సికిందర్, సత్యనారాయణ, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీకి చరమగీతం పాడాలి : సీపీఐ(ఎం)



**నవతెలంగాణ-అడిక్‌మెట్**

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీకి చరమగీతం పాడాలనీ, మతోన్మాద బీజేపీ కార్పొరేట్ విధానాలను నుంచి దేశాన్ని రక్షించుకుందామని సీపీఐ (ఎం) ముషీరాబాద్ నియోజకవర్గ కార్యదర్శి ఎం.దశరథ్, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.వెంకటేష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జన చైతన్య యాత్రలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.దశరథ్ మాట్లాడుతూ దేశంలో 15 మంది అత్యధికంగా సంపన్నులు ఉన్నారన్నారు. ఆదానీ, అంబానీ లాంటి వారిపై బీజేపీ ప్రభుత్వం ఈడీ, ఐటీ, సీబీఐ దాడులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ పరం చేయడం బీజేపీ, మోడీ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఈ దాడుల అనంతరం కాషాయ కండువా కప్పుకోగానే కేసులు లేకుండా కుళ్ళ రాజకీయాలు చేస్తారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. నిత్యావసర ధరలు పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. కార్పొరేట్లకు 10 శాతం రాయితీలు ఇస్తూ పన్ను రద్దును చేస్తున్నారన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ప్రశ్నించే నాయకులపైన, సామాజిక సంఘాల పైన, పత్రిక విలేకరుల పైన, మహిళలపైన దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. ఇప్పటికైనా బీజేపీని ఓడించే దిశగా ప్రజలందరూ చైతన్యంతో ముందు సాగాలని సూచించారు. నేడు ఇందిరా పార్కు దగ్గర జరగబోయే ప్రజా చైతన్య యాత్ర ముగింపు సభలో ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ర్యాలీలో సీపీఐ(ఎం) నగర కమిటీ సభ్యులు ఎస్.మారన్న, ముషీరాబాద్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ఎ.శ్రీరాములు, ఆర్‌ఈ బాబు, పి.విమల, కమిటీ సభ్యులు కె.రమేష్, ఏఏకె పాషా, ఏ.పద్మ, నర్సింగరావు, ఎల్లయ్య, సిరాజుదిన్, సైదులు, పుల్లారావు, కృష్ణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



## కింగ్ కోఠి జిల్లా హాస్పిటల్‌ను సందర్శించిన లక్ష్య అసెస్మెంట్ బృందం

**నవతెలంగాణ-సుల్తాన్‌బజార్**

గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సూచన మేరకు లక్ష్య అసెస్మెంట్ టీమ్ మంగళవారం కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించింది. కేరళకు చెందిన డా.స్వాతి లక్ష్మి, నాగాలాండ్‌కు చెందిన డా.ఛావాయ్ న్యూమామ్ లా ఆస్పత్రిలోని మెటర్నిటీ, చైల్డ్ వార్డులను సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్ఎంఓ డాక్టర్ సాధన, గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ జలజతో కలిసి పరిశీలించారు. ఈ వార్డుల్లో తల్లులకు, పసిపిల్లలకు అందుతున్న వైద్య సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత వంటి విషయాలపై లక్ష్య టీం పరిశీలించింది. ఈ టీమ్ హాస్పిటల్లోని అన్ని విషయాలను రికార్డులను పరిశీలించింది. కింగ్ కోఠి ప్రభుత్వ హాస్పిటల్‌లో ఇప్పటికే ఎన్నో ప్రత్యేకతలు, సౌకర్యాల్లో రాష్ట్రంలో ఉన్న జిల్లా హాస్పిటల్స్‌లో ప్రథమ స్థానంలో ఒకటిగా కింగ్ కోఠి ప్రభుత్వ హాస్పిటల్‌కు గుర్తింపు దక్కిన విషయం తెలిసిందే. లక్ష్య టీం ఇక్కడి సౌకర్యాలు బాగున్నాయని కితాబిచ్చింది. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రజీయ, షాహిదా, స్టాఫ్ నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన రెండు రోజుల జాతీయ సదస్సు



**నవతెలంగాణ-ఓయూ**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఐసీహెచ్ఆర్ సహకారంతో రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ కొండా నాగేశ్వర్ అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.గణేష్ మాట్లాడారు. కింది స్థాయి వర్గాలు ఇటీవల కాలంలో ఉన్నత వర్గాల సంస్కృతిని అనుకరించి, వారి జీవన విధానాన్ని తమ జీవితంలో భాగంగా చేసుకునేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ సంస్కృతి ప్రభావం సామాజిక జీవనంపై తప్పనిసరిగా ప్రభావం చూపుతున్నదని పేర్కొన్నారు. కార్ల మార్క్స్, వెబర్ల సిద్ధాంత ఆలోచన విధానాన్ని, మతం పట్ల వారి ఆలోచన సరళిని విమర్శనాత్మకంగా వివరించారు. కార్ల మార్క్స్ మతం మత్తుమందు వంటిదని పేర్కొనగా, వెబ్ నార్ మతం వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారని తెలిపారు. ఒకే విషయం పట్ల రెండు ఆలోచన ధోరణలు ఉన్నప్పుడు వాటిని సునిసితంగా అధ్యయనం చేయాల్సిన బాధ్యత మేధావి వర్గంపై ఉన్నదని పేర్కొన్నారు. కొండా నాగేశ్వర్ మాట్లాడుతూ మతం వ్యక్తిగత జీవన విధానంలో అంతర్భాగంగా ఉండాల్సిన అవసరం ఉన్నదన్నారు. అంతర్గతంగా ఉండాల్సిన మతపరమైన విషయాలు బాహ్య ప్రేరకంగా పని చేయటం తిరోగమి ఆలోచన విధానం వైపు మొగ్గు చూపే ప్రమాదం ఉందన్నారు. భారతదేశం లాంటి నిచ్చెన మెట్ల వ్యవస్థను అర్థం చేసుకోవాలంటే శ్రమ విభజనను శాస్త్రీయపరమైన, హేతువాదపరమైన దృష్టి అవసరమని పేర్కొన్నారు. ప్రొ.అడపా సత్యనారాయణ మాట్లాడారు. శామ్యూల్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ డైరెక్టర్లు, అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ ఉద్యోగులు, స్కాలర్స్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి

**నవతెలంగాణ-అడిక్‌మెట్**



డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలనీ, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 26 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమీపించక ముందే నోటిఫికేషన్ విడుదల చేసి ఎగ్జామ్‌కు 6 నుంచి 8 నెలల గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆరు నెలలకోసారి టెట్ నోటిఫికేషన్ నిర్వహించాలన్నారు. నోటిఫికేషన్ లేక చాలా నెలలు అవుతున్నా ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి పెట్టకపోవడం శోచనీయమన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని చెప్పి ఇప్పటివరకు వాటిని అభివృద్ధి పథంలో పెట్టకపోవడం టీచర్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు లేక వెలవెలబోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. నిరుద్యోగులు బీఈడీ, డీఈడీలు చేసి ఉద్యోగాలు రాక పెళ్లిళ్ల చేసుకోకుండా నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఒకవైపు నోటిఫికేషన్లు వేసిన గ్రూప్ వన్ అసిస్టెంట్ ఇంజినీరింగ్ పోస్టులలో అవకతవకలతో నిరుద్యోగుల ప్రాణాలను బలి తీసుకోవాల్సి వచ్చిందనీ, నోటిఫికేషన్ సజావుగా జరుగుతుందో లేదో అని ఆలోచన ఒకవైపు ఎన్నికలలోపు నోటిఫికేషన్ భర్తీ చేస్తారా లేదా అని నిరుద్యోగులు దిగ్భ్రాంతిలో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నోటిఫికేషన్‌లకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## ఓయూలో ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష

**నవతెలంగాణ-ఓయూ**




కేంద్ర ప్రభుత్వం ఇటీవల కుట్రపూరితంగా రాహుల్ గాంధీ లోకసభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడాన్ని వ్యతిరేకిస్తూ, నియంతృత్వ పోకడలకు పూనుకుంటున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసన తెలియజేస్తూ ఓయూలో మంగళవారం న్యాయ కళాశాల ఎదుట వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా చెరకు సుధాకర్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్, బాలలక్ష్మీ లా డీన్ ప్రొ.గాలి వినోద్ కుమార్, హెడ్ ప్రొ.చంద్రుతో పాటు ఓయూ జేఏసీ నాయకులు, కోట శ్రీను, రవితేజ గౌడ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, గిరిజన శక్తి, టీఎస్‌యూ విద్యార్థి నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రెటరీలు అక్బర్, మనోహర్యాదవ్, ప్రవీణ్, పరమేశ్, నిహారిక, న్యాయ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేద్దాం

**నవతెలంగాణ-ఓయూ**




బీజేపీ కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలను నిరసిస్తూ, కార్మికుల హక్కుల సాధన కోసం ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక కర్షక, సంఘర్ష ర్యాలీ ఏప్రిల్ 5వ తేదీన విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. వారాసిగూడ లేబర్ అడ్డా దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టి.మహేందర్ మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయకుండా కార్పొరేటర్ వర్గాలకు ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కారు చౌకగా తాకట్టు పెడుతుందన్నారు. కార్మిక చట్టాల్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, కృష్ణ, ఎల్లస్వామి, పరుశరాములు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# 'డిజిటల్ విద్యావిధానం ఒక్కటే మార్గం'



**నవతెలంగాణ-ఓయూ**

భవిష్యత్ ఉన్నత విద్యా అవసరాలను తీర్చేందుకు కేవలం డిజిటల్ విద్యావిధానం ఒక్కటే పరిష్కారమని కన్సార్షియం ఆఫ్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ సీఈసీ డైరెక్టర్ ప్రొ.జగత్ భూషణ్ నడ్డా అభిప్రాయపడ్డారు. సంప్రదాయ బోధనా పద్ధతుల నుంచి డిజిటల్ విప్లవం వైపుగా మనస్తత్వాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీఈసీ నిధులతో "మ్యాసివ్ ఆన్ లైన్ కోర్సుల దక్పథం-ఉన్నత విద్యా బోధనలో డిజిటల్ టెక్నాలజీ" అనే అంశంపై మంగళవారం ఓయూ ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న యువతకు సంప్రదాయ విద్యా బోధనకు తీవ్రమైన అంతరం ఉందనీ, సవాళ్లను పరిష్కరించి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని పరిష్కారాలు చూపాలని హితవు పలికారు. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ విద్యావిధానం ద్వారా విద్యారంగానికి ఉన్న ప్రయోజనాలను వివరించిన ప్రొఫెసర్ నడ్డా ఆధునిక విద్యాబోధనలతో ఉద్యోగావకాశాలు తగ్గుతాయన్న వాదనను కొట్టిపారేశారు. ప్రస్తుతం 27శాతంగా ఉన్న విద్యార్థుల నమోదు 2035 నాటికి 50 శాతం లక్ష్యాన్ని చేరుకోనుందని వివరించారు. డిజిటల్ విద్య ద్వారానే ఇది సాధ్యమవుతుందనీ, స్వయం ద్వారా 40 క్రెడిట్‌లతో కూడిన మూక్స్ కోర్సులను విద్యార్థులకు అందించాలన్నారు. విద్యా బోధనా లెర్నింగ్ ప్రక్రియలను ప్రారంభించటానికి స్వయం, మూక్స్, డాక్యుమెంటరీలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా న్యూఢిల్లీలోని సీఈసీ ప్రయాణానికి సంబంధించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పాతతరం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఓయూ వీసీ ప్రొ.రవిందర్ అన్నారు. విద్యా బోధన, లెర్నింగ్‌లో వస్తున్న డిజిటల్ విప్లవంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్న ఈఎంఆర్సీ బందాన్ని ఆయన అభినందించారు. సమకాలీన ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఉస్మానియా విశ్వవిద్యాలయం చర్యలు తీసుకుంటోందనీ, ఇప్పటికే టీసాట్‌తో కలిసి ఉస్మానియా టీవీ ద్వారా విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అందించనున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొ.శ్రీనగేశ్, ప్రొ.చింతా గణేష్, ప్రొ.స్వాతి, ప్రొ.హరీశ్ గుప్తా, ప్రొ. ఝాన్సీ, ఆయా విభాగాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, పరిశోధకులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**నవతెలంగాణ-ఓయూ**



ఉస్మానియా యూనివర్సిటీలో బోధనేతర సంఘాల, ఉస్మానియా యూనివర్సిటీ మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మంగళవారం ఓయూ సైన్స్ కళశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వారి సాధికారిత, మహిళా చట్టాల గురించి, రాజ్యాంగంలో మహిళల ఆర్టికల్స్, రిజర్వేషన్స్ ఓటు హక్కు, విద్య ప్రాధాన్యత గురించి వివరించారు. మహిళా ఇంటా, బయటా ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారానికి మార్గాలు, స్వయం నిర్ణయశక్తి, సమాజంలో స్త్రీ పురుష పాత్ర, సోషల్ మీడియా పాత్ర, ప్రభుత్వం మహిళా సంక్షేమం గురించి చేస్తున్న కృషి భవిష్యత్తు సవాళ్లు అనే అంశాలపై మాట్లాడారు. ప్రభుత్వం నిర్బంధ మహిళా విద్య, బాల్యం నుంచి ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నిర్బంధంగా ప్రాథమిక విద్యా స్థాయి నించి పాఠశాల విద్య (బాల్యం) నుండి నేర్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొ. విజ్జులత, నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, ఓయూ వీసీ ప్రొ.రవీందర్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీ నారాయణ, యూజీసీ డీన్ ప్రొ.మల్లేశం, ఓయూ మహిళా సంఘం చైర్మన్ ప్రణీత, డిప్యూటీ రిజిస్ట్రారు షర్మిల, వైస్ చైర్మన్ హైమావతి, ప్రెసిడెంట్, స్వాతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి అపర్ణ, ప్రీతి, సుహాసిని, వరలక్ష్మి, రమాదేవి, రేణుక, పద్మావతి, స్నేహలత, నీరజ, వీరమని, అనిత, రాగిని, అంభరాని, భూలక్ష్మితోపాటు సుమారు 500 మహిళా ఉద్యోగులు, ఓయూ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అధ్యక్షుడు బియాని జ్ఞనేశ్వర్, నాగరాజ రావు, శివ శంకర్, రవి, విజయ్ కుమార్, అక్బర్ బేగ్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌కు అభినందనలు

**నవతెలంగాణ-సిటీబ్యూరో**



మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఇటీవల గెలిచిన భారతీయ బాక్సర్ నిఖత్ జరీన్ తమ బ్రాండ్ అంబాసిడర్ నిఖత్ జరీన్‌ను అభినందించేందుకు లైఫ్‌స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్ గర్విస్తోంది. లైఫ్‌స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ నరేంద్ర రామ్ నిఖత్ జరీన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జరీన్ కృషి, దృఢ సంకల్పం, పట్టుదల, అంకితభావం ఫలించాయనీ, ఆమె సాధించిన అత్యుత్తమ విజయానికి దేశం గర్విస్తోందని ఆయన అన్నారు. ఈ ప్రత్యేక సందర్భంగా నరేంద్ర రామ్ తన సందేశంలో నిఖత్ జరీన్ వంటి ఆరోగ్యకరమైన, ఫిట్ జీవనశైలిని నడిపించాలని కలలు కనే వ్యక్తులకు లైఫ్‌స్పాన్ ఉత్పత్తులు సహాయపడతాయని పేర్కొన్నారు. ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనం గురించి భారతీయ జనాభాలో పెరుగుతున్న దృష్టితో, లైఫ్‌స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి బ్రాండ్ కస్టమర్‌లకు సరైన మార్గంలో ఫిట్‌గా ఉండేలా ఎంపికలను అందించడానికి ముందంజలో రావడం సముచితం అన్నారు. సరైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ముఖ్య అంశం అయితే, ఈ కార్యకలాపాల్లో ఆకస్మిక పెరుగుదల అంతకుముందు సులభంగా పొందుతున్న అవసరమైన పోషకాలు, ప్రోటీన్ల శరీరాన్ని హరించవచ్చు. లైఫ్‌స్పాన్ ప్రొడక్ట్ పోర్ట్‌ఫోలియోలో ప్రోటీన్ డిస్కెట్‌లు, కిడ్స్ డిస్కెట్‌లు, ప్రొటీన్ సప్లిమెంట్ పౌడర్‌లు, 100శాతం వెయ్ ప్రొటీన్‌లు ఉన్నాయి. ఇది సమాజంలోని అన్ని డెమోగ్రాఫిక్‌లకు వారు టార్గెట్ చేయాలనుకుంటున్న వారి ఫిట్‌నెస్ స్థాయిలను చేరుకోవడానికి ఎంపికల గుర్తించి అందించడంలో సహాయపడుతుంది అని తెలిపారు.

## హేవ్ మోర్ ఐస్ క్రీం బ్రాండ్ అంబాసిడర్‌గా హార్ధిక్ పాండ్యా

**నవతెలంగాణ - హైదరాబాద్**

భారతదేశంలోని ప్రముఖ ఐస్ క్రీం బ్రాండ్ అనగానే అందరికి గుర్తుకువచ్చేది హేవ్ మోర్. హేవ్ మోర్ ఐస్ క్రీంని ప్రతీ ఒక్కరూ ఎంతో ఇష్టంగా తింటారు. ఇక గుజరాత్ లో అయితే హేవ్ మోర్ ఐస్ క్రీమ్ కు విపరీతమైన అభిమానులు ఉన్నారు. ఇంకా చెప్పాలంటే గుజరాత్ లో ఐస్ క్రీంకు హేవ్ మోర్ పర్యాయ పదంగా ఉంది. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్ అయినటువంటి గుజరాత్ టైటాన్స్‌తో తన అధికారిక భాగస్వామ్యాన్ని ప్రకటించింది హేవ్ మోర్. భారతదేశం యొక్క హార్ట్‌త్రోబ్ క్రికెటర్ హార్ధిక్ పాండ్యాను తన బ్రాండ్ అంబాసిడర్ గా ఎంపిక చేసింది హేవ్ మోర్. బ్రాండ్ అంబాసిడర్ హార్ధిక్ పాండ్యా నటించిన రెండు టీవీ కమర్షియల్స్ సమ్మర్ క్యాంపెయిన్‌ను ఆవిష్కరిస్తున్నాయి. ఇందులో అభిమానులు హేవ్ మోర్ ఐస్‌క్రీమ్‌ల గొప్పతనాన్ని గదిలో, క్రికెట్ స్టేడియంలో లేదా హాస్పిటల్ బెడ్‌లో ఎక్కడ ఉన్నా ఆస్వాదించవచ్చు. 'ఇట్స్ దట్ గుడ్' అనే ట్యాగ్‌లైన్ చుట్టూ ప్లే చేస్తూ, ఆహ్లాదకరమైన క్యాంపెయిన్ క్రీము మరియు రుచికరమైన హవ్‌మోర్ ఐస్‌క్రీమ్‌ని ఏ పరిస్థితిలోనైనా చల్లగా మరియు ఆనందించే ప్రపంచానికి ఎలా తీసుకెళ్లగలదో పునరుద్ఘాటిస్తుంది.

## ఉపహార్, డీఆర్ఓపీ లతో కియా ఇండియా అవగాహన

**నవతెలంగాణ - హైదరాబాద్**

భారతదేశంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న కారు తయారీదారులలో ఒకటైన కియా ఇండియా అట్టడుగు స్థాయిలలో ప్రభావాన్ని కలిగించడానికి తమ రెండు జాతీయ కమ్యూనిటీ చొరవలు డీఆర్ఓపీ మరియు ఉపహార్ లను అమలుచేయడం ఆరంభించింది. ఆటో ఎక్స్ పో 2023లో మొదట ప్రకటించింది, సుస్థిరమైన ప్రపంచాన్ని రూపొందించడానికి ఈ రెండు చొరవలు కియా వారి అంతర్జాతీయ సీఎస్ఆర్ కల "పరిశుభ్రమైన వాతావరణం" మరియు "స్వేచ్ఛాయుతమైన మరియు సురక్షితమైన ఉద్యమం"తో అనుసంధానం చేయబడ్డాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు గురించి ప్రమాదకరమైన ఆందోళనను పరిష్కరించి మరియు జలాశయాలు, ల్యాండ్ ఫిల్స్‌లో అది వ్యాపించడాన్ని తగ్గించే లక్ష్యాన్ని డీఆర్ఓపీ కలిగి ఉండగా ఉపహార్ చొరవ అట్టడుగు వర్గానికి చెందిన వ్యవసాయ సమాజానికి మద్దతు ఇవ్వడానికి చెట్లను నాటే కార్యక్రమంగా ఆరంభించబడింది మరియు వాతావరణం మార్పుతో పోరాడుతోంది. మొదటి ప్రాజెక్ట్ 5 మెగా పట్టణాలలో చురుకుగా ఉంది. గురుగ్రామ్, ముంబయి, బెంగళూరు, విజయవాడ మరియు విశాఖపట్టణం, కాగా రెండవది 15 రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, తెలంగాణా, మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశ్శా, ఉత్తర్ ప్రదేశ్, హర్యాణా, అస్సాం, మేఘాలయ, జార?ండ్, పశ్చిమ బెంగాల్, మరియు హిమాచల్ ప్రదేశ్ లలో పని చేస్తోంది.

## నాగారం మున్సిపల్ వార్షిక బడ్జెట్ ఆమోదం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

నాగారం మున్సిపాల్టీ 2023 -24 ఆర్థిక సంవత్సరానికి రూ. 33.47 కోట్ల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగారం మున్సిపాల్టీలో అభివద్ధి పనుల కోసం వార్షిక బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వాణి రెడ్డి , వైస్ చైర్మెన్ బండారి మల్లేష్ యాదవ్ , కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, కార్యాలయం మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్ రెడ్డి పాల్గొన్నారు.

## బాలికతో అసభ్యకర ప్రవర్తన.. నిందితుడి అరెస్ట్

నవతెలంగాణ-జవహర్‌నగర్

మైనర్ బాలికపై ఓ ప్రబుద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తించడంతో అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ పరిధిలో ఓ బాలికతో మిట్టె తిరుపతి అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# కార్పొరేట్ కంపెనీలకు రూ. లక్షల కోట్లు కట్టబెడుతుండ్రు..

- ప్రజలపై భారాలు మోపుతూ.. 23 కోట్ల మందిని పేదలుగా మార్చింద్రు
- దేశమంటే అంబానీ, అదానీ సొత్తుగా మార్చేశారు
- తల్లిలాంటి ప్రభుత్వరంగ సంస్థలను అడ్డికి పావుసేరు లెక్క అమ్మేస్తున్న మోడీ
- నమ్మి ఓటేసిన జనానికి మోడీ సర్కారు మొండిచెయ్యి
- కంపెనీల యాజమాన్యాలకు అండగా ఆర్ఎస్ఎస్, బీజేపీ
- జన చైతన్య యాత్ర మేడ్చల్-మల్కాజిగిరి సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య
- జనచైతన్య యాత్రకు భారీ స్పందన..దారిపొడువునా ప్రజలు, కార్యకర్తల నీరాజనం




నవతెలంగాణ-సిటీబ్యూరో

నరేంద్ర మోడీ, అమిత్ షాల నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ.. ప్రజలపై భారాలను మోపుతూ.. 23కోట్ల మందిని పేదలుగా మార్చారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య ఆవేదన వ్యక్తం చేశా రు. దేశమంటే అంబానీ, ఆదానీల సొత్తుగా మార్చేశారని, తల్లిలాంటి ప్రభుత్వరంగ సంస్థలను మోడీ సర్కారు అడ్డికి పావు సేరు లెక్క అమ్మేస్తున్నారని విమర్శించారు. మంగళవారం సాయంత్రం 4గంటలకు జనచైతన్య యాత్ర అవుషాపూర్‌కి చేరుకుంది. ఈ సందర్భంగా యాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి జాత ఘట్కేసర్, మేడిపల్లి, ఉప్పల్, హౌసింగ్‌బోర్డు మీదుగా ఈసీఐ ఎల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన వేదికకు చేరుకోగా.. పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాయకులు, కార్యకర్తలు ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ జన చైతన్య యాత్ర బహిరంగ సభకు భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యారు. ఈ జన చైతన్య యాత్ర 23వ తేదీ నుంచి ఆదిలాబాద్‌లో ప్రారంభమై మంగళవారం ఈసీఐఎల్ అంబేద్కర్ చౌరస్తాలో వేదికకు చేరుకుంది. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్ బాబు, జయలక్ష్మి, బాలకృష్ణ, అడువయ్య, జగదీష్, బృందా నాయ కులు పాల్గొన్నారు. సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం అధ్యక్షతన జరిగిన సభలో ఎస్.వీరయ్య మాట్లాడుతూ..

మోడీ తొమ్మిదేండ్ల పాలనలో నూనెలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్, సహా అన్ని సరుకుల ధరలు రెండు, మూడు రెట్లు పెరిగియన్నారు. 2014లో రు.410లు ఉన్న గ్యాస్ సిలిండర్ నేడు రు.1150లకు పెరిగిందని, ఈ ధరల పెరుగుదల వల్ల కార్పొరేట్లు వేల కోట్ల రూపాయల లాభాలను పోగేసుకుంటున్నారని తెలిపారు. లక్షల కోట్లు ఖర్చు పెట్టి బలోపేతం చేసిన ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు అమ్మే స్తున్నారన్నారు. భూములను, మార్కెట్లను, పరిశ్రమలను, ఉపాధి కల్పించే రంగా లను పూర్తిగా కార్పొరేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు.



ఫలితంగా ఒక శాత మున్న బడా కార్పొరేట్ల వద్ద 10 శాతం సంపద పోగుపడిందని, శత కోటీశ్వరుల సంఖ్య 102 నుంచి 166కి చేరిందన్నారు. మోడీకి అత్యంత అప్తుడైన అదానీ బీజేపీ అండతో ప్రజల ధనాన్ని లూటీ చేశాడన్నారు. కంపెనీల డొల్లతనాన్ని, మోసాన్ని అమెరికన్ సంస్థ బట్టబయలు చేసిందని, రు. 15 లక్షల కోట్ల ప్రజాసంపద ఆవిరై పోయిందన్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. సంక్షేమం మోడీ జల్లెడతో నీళ్ల తెచ్చి మీ అందరి దాహం తీరుస్తానని ప్రజలను నమ్మిస్తున్నారని, ప్రపంచ మానవాభివృద్ధి ఆకలి సూచికలో మన దేశం 141వ స్థానానికి దిగజారిందన్నారు. విద్యలో 30వ స్థానంలో ఉందని, లక్షల కోట్ల నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి కుటుం బానికి రూ.15 లక్షలిస్తానని ఎన్నికల ముం దు చెప్పి మోసం చేశాడన్నారు. గద్దెనెక్కాక తినే తిండి మీద, కట్టుకునే బట్టల మీద, మనం రోజు వాడుకునే ప్రతి వస్తువు మీద ఒకేదేశం-ఒకే పన్ను పేరుతో జీఎస్టీ విధిం చడంతో ధరలు పెరిగాయని విమర్శిం చారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పి స్తానని ఉన్న ఉద్యోగాలు పీకేస్తూనా్న రన్నారు.

పట్టణ ప్రాంతాల్లో 8.3 శాతం, గ్రామీ ణ ప్రాంతాల్లో 30 శాతం నిరుద్యోగం పెరిగిందని, ఉపాధిహామీకి రు.2లక్షల కోట్లు కేటాయించాలని, ఏటా 200 పని దినాలు కల్పించాలని, రోజుకూలి రూ.600లు ఉండాలని ప్రజలు కోరుతుండగా, అందుకు విరుద్ధంగా ఉపాధిహామి పథకాన్ని ఎత్తేస్తోందన్నారు. దుర్మార్గమైన కార్మిక చట్టాలను తీసుకొస్తోందని, అత్యంత ప్రమాదకరమైన విద్యుత్ చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోందన్నారు.మోడీ విధానాల వల్ల ఏటా 12,600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని, కనీస మద్దతు ధరల చట్టం చేయాలని, ఏకకాలంలో రుణమాఫీ చేయా లని, 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలివ్వాలని రైతాంగం కోరుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి మాట్లాడుతూ మనదేశం భిన్నత్వంలో ఏకత్వంలా ఉంటుందనీ, అలాంటి దేశాన్ని కుల, మతాల పేరుతో చీల్చే ప్రయత్నం బీజేపీ, ఆర్ఎస్ఎస్ చేస్తున్నదని మండిపడ్డారు. మహిళలకు బీజేపీ వ్యతిరేకమని, మనుధర్మాన్ని అమలు చేయడం ద్వారా అణిచివేతకు పాల్పడుతున్నదని విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి. సత్యం, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, చింతల యాదయ్య, ఎర్ర అశోక్, జె. చంద్రశేఖర్, వినోద, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు, కార్మికులు, కర్షకులు, మహిళలు యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ (సీఅండ్‌టీ, కేవీఆర్) కార్మికుల జనచైతన్య యాత్ర బృందాన్ని ఘనంగా సత్కారించింది.








## కంటోన్మెంట్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తాం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి దివంగత ఎమ్మెల్యే సాయన్న ఎంతో కృషి చేశారని.. ఇప్పుడు ఆయన లేకున్నా నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తానని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మంగళవారం మొండా మార్కెట్ డివిజన్ అంబేడ్క ర్ నగర్‌లో రూ. 56 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, రూ. 54 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఫుట్ పాత్ నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ అభివద్ధి కోసం దివంగత సాయన్న ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మరణం చాలా బాధాకరమన్నారు. నియోజకవర్గ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దీపిక, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ రమణారెడ్డి, నాయకులు హరికృష్ణ, జయరాజ్, శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొన్నారు.



## కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

నవతెలంగాణ-నేరేడ్‌మెట్/మల్కాజిగిరి

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన ఓ వరమని మల్కాజిగిరి, అల్వాల్ సర్కిల్ కు చెందిన బీఆర్ ఎస్ కార్పొరేటర్లు అన్నారు. మంగళవారం ఆనంద్ భాగ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు మల్కాజిగిరి ఆల్వాల్‌కు సంబంధించిన మొత్తం 228 మందికి కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులు, జీవో నంబర్ 58, 345 జీవో నంబర్ 59, 52 పట్టాలను కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, సునీత రాముయాదవ్, మీనా ఉపేందర్ రెడ్డి ,జితేంద్ర నాథ్, సబితా అనిల్ కిషోర్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, పంపిణీ చేశారు. జీవో నంబర్ 58, 345 జీవో నంబర్ 59, 52 పట్టాలను అల్వాల్ (58 జీఓ కింద - 108మందికి, 59 జీఓ కింద - 17 మందికి, మల్కాజిగిరిలో -58 జీఓ కింద - 237, 59 జీఓ కింద -35 మందికి పట్టాలను అందచేశారు.మల్కాజిగిరి డిప్యూటీ ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, అల్వాల్ ఎమ్మార్వో నిర్మల, ఆర్ఐ లు రజినీ కాంత్, వినీత, శ్రీశైలం, నాయకులు సతీష్ కుమార్,పిట్ల శ్రీనివాస్, రాముయాదవ్, గుండా నిరంజన్, ఉపేందర్ రెడ్డి, సంతోష్ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి

- సర్పంచ్ అండాలు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని రాంపల్లి దాయరా సర్పంచ్ గరుగుల అండాలు అన్నారు.మంగళవారం కీసర మండలంలోని రాంపల్లి దాయర గ్రామంలో నాబార్డ్ వారి సహకారంతో అభయ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ముందంజలో నడవాలని ,మహిళలు అని రంగాల్లో ముందుండాలని స్వయం ఉపాధితో డబ్బులు సంపాదిం చాలని సర్పంచ్ కోరారు. ఫినాయిల్ తయారీ సబ్బుల తయారీ పచ్చళ్ళు, మిల్లెట్స్ నిర్వ హణ, అగరవత్తుల తయారీ, కొవ్వొత్తుల తయారీ, కుట్టు మిషన్లు, చేనేత వస్తు వుల తయారీ వివిధ కార్యక్రమాలను 40 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నామని అధికారులు తెలిపారు. వార్డు మెంబర్లు కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

## కార్పొరేటర్‌కు లక్ష్మారెడ్డి పరామర్శ



నవతెలంగాణ-కాప్రా

అనారోగ్యంతో బాధ పడు తున్న కాప్రా డివిజన్ కార్పొ రేటర్ స్వర్ణ రాజ్ శివమణిని వారి స్వగృహంలో బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థా పకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు బైరి నవీన్ గౌడ్, సికింద‌ర్, డివిజన్ ప్రెసిడెంట్ సుడుగు మహేందర్ రెడ్డి, మచ్చ పాండు గౌడ్, బైరి భాస్కర్ గౌడ్, రవీందర్ రావు, పవన్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.






సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్ర మంగళ వారం అవుషాపూర్‌కు చేరుకోగా సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా నాయకులు చింతల యాదయ్య, ఏ అశోక్, ఎన్ .సబితతో కలిసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ ఘట్కేసర్ మండల అధ్యక్షులు ఎన్ రమేష్, ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, జిల్లా రైతుబంధు సభ్యులు డి.బిక్షపతి గౌడ్, ఉపసర్పంచ్ ఐలయ్య యాదవ్,కీసరగుట్ట ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు మెరుగు నరేష్, నర్సింగ్ రావు, మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, ఎం మల్లేష్, శ్యామ్ రావు, బాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-ఘట్కేసర్




## మోడి ఫాసిస్ట్ విధానాలను తిప్పి కొట్టాలి

- ఉప్పల్ డిపో వద్ద జనచైతన్య యాత్రలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య
- జనచైతన్య యాత్రకు విశేష స్పందన

నవతెలంగాణ-బోడుప్పల్

పేదలను కొట్టి పెద్దలకు పెట్టిన తీరుగా కేంద్ర ప్రభుత్వ పాలన ఉందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య అన్నారు. సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జనచైతన్య యాత్ర మంగళ వారం ఉప్పల్ డిపో వద్దకు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోడి నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ సర్కారు గత ఎనిమిది సంవత్సరాలుగా కేవలం కార్పొరేట్ సంస్థలకు లబ్ది పొందేలా వ్యవహరిస్తూ పేదలపై మోయలేని భారాలను మోపుతున్నదన్నారు. మోడి పాలన ఫాసిస్ట్ విధానాలను తలపిస్తున్నదని, రాబో యే కాలంలో బీజేపీకి ఖచ్చితంగా బుద్ధి చెప్పాలని కోరారు. అంతకు ముందు యాత్రకు సీపీఐ(ఎం) మేడిపల్లి మండల కార్యదర్శి ఉత్తర్వులు ఎన్.సృజన ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుధా, శైలజ, కొలిపాక విజయ,అంజయ్య, కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు పుట్ట లక్ష్మణ్, అన్వర్, సీపీఐ నాయకులు రచ్చ కిషన్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అన్ని రంగాల్లో ముందంజ

- రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికైన 27 గ్రామ పంచాయతీలు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

రాష్ట్రంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అన్ని రంగాల్లో ఎంతో ముందుకు దూసుకెళ్తోందని ఈ విషయంలో జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి ఎంతో ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ అవార్డుల కుగాను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని 27 గ్రామ పంచాయతీలు తొమ్మిది విభాగాల్లో జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అమోయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ఆయా గ్రామపంచాయతీలకు సన్మానోత్సవాలు, జ్ఞాపికల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయ కత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి చరిత్ర సృష్టిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామపంచాయతీల్లో పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా పారిశుధ్య నిర్వహణ, మొక్కల పెంపకం, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సౌకర్యం, ట్రాక్టర్, ట్రాలీ, వాటర్ ట్యాం కర్, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకతి వనాలు, నర్సరీలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి దేశంలోనే చరిత్ర సష్టించామని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. అభివద్ధికి చిరునామాగా రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ స్థానంలో నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాల అవార్డులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి తొమ్మిది విభాగాల్లో 27 గ్రామాలు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి అన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించడం జరుగుతుందని.. ఇదే స్ఫూర్తితో మరింత అభివద్ధిపథంలో తీసు కెళ్ళేందుకు అందరూ సహకరించాలన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్ళాల్సిన అవసరం ఉందని, మరింత బాధ్యత పెరిగిందని దీనికి అందరి సహకారం ఎంతో అవసరమని తెలి పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జెడ్పీ సీఈవో దేవసహాయం ,జిల్లా పంచాయతీ అధికారి రమణ మూర్తి, జిల్లాలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పం చ్‌లు, వార్డుసభ్యులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు బృహత్తర పథకం

- జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య



నవతెలంగాణ- జవహర్‌నగర్

కంటి వెలుగు బృహత్తర పథకం అని, అంధత్వ నివారణే సీఎం కేసీఆర్ అభిమతమని, తెలంగాణ ప్రజలు కంటి చూపుతో అవస్థలు పడొద్దని, ప్రతీ పల్లెకు, పట్టణానికి కంటి వెలుగు కార్యక్రమం తీసుకువచ్చి కంటి చూపును ప్రసాదిం చిన గొప్ప మనసున్న మహానుభావుడు ఆయన అని మేయర్ మేకల కావ్య అన్నారు. మంగళవారం కార్పొరేషన్ లోని 12వ డివిజన్ కార్పొరేటర్ ఎమ్.సతీష్. ఆధ్వర్యంలో ఆర్యవైశ్యభవన్ లో కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేసీఆర్ పనిచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అమ్ములు, క్యాంపు కోఆర్డినేటర్ షౌకత్లీ, నరేషడవ్, ఆశావర్కర్లు, డివిజన్ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు చంద్రశేఖర్, సంపత్యాదవ్, లక్ష్మి, బాబు, శ్రీనివాసులు, విజయ, మహేశ్వరి, పద్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## 'నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ'



**నవతెలంగాణ-బాలానగర్**

నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం టెక్ మహీంద్ర ఫౌండేషన్, నియోకర్సర్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు సంస్థ సెంటర్ మేనేజర్ విజయ్ సింహ ఒక ప్రకటనలో తెలిపారు. కూకట్ పల్లి ప్రశాంత నగర్ ప్లాట్ నెం: 31బీ సోనీ బిజినెస్ కాంప్లెక్స్‌లోని సంస్థ చిరునామాలో శిక్షణ ఉంటుందన్నారు. బ్యాంకింగ్ ఫైనాన్స్, సర్వీస్, ఇన్సూరెన్స్, బేసిక్ ఐటీ స్కిల్స్, ఎం.ఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, అడ్వాన్సుడ్ ఎక్సెల్, స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్ తదితర కోర్సులల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిలైన అభ్యర్థులు ఈ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులన్నారు. ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వివరాలకు 7799594242, 7799694242 లో సంప్రదించవచ్చన్నారు.

## ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే



**నవతెలంగాణ-కూకట్ పల్లి**

కూకట్ పల్లిలోని రామాలయం వద్ద శ్రీరామనవమి పనులకు సంబంధించి పటిష్ట చర్యలు తీసుకునే విధంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులతో ఆలయ పరిసర ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. ట్రాఫిక్, శాంతి భద్రతల విషయంలో ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకునే విధం గా సూచనలు చేశారు. అలాగే భక్తులకు ఎండ వేడిమి దష్ట్యా మంచినీరు, చలువ పందిళ్ల వంటి మౌలిక సదుపాయాలు కల్పన విషయంలో రాజీ పడవద్దని, వాటర్ ట్యాంకులు, అంబులెన్స్ కూడా అందుబాటులో ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజా దేవి రంగారావు, మాజీ కార్పొరేటర్ పగడాల బాబు రావు, చిన్న తులసి, ఏసీపీ చంద్రశేఖర రావు, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, సీఐ నరసింగ రావు, ఈఓ ఆంజనేయులు, ఆలయ కార్యనిర్వాహక అధికారులు పాల్గొన్నారు.

# మ్యాన్ హెూల్ కనిపిస్తలేదా..?

- గత కొన్ని నెలలగా మేడ్చల్‌లోని 14వ వార్డులో పారుతున్న మురుగు నీరు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



**నవతెలంగాణ-మేడ్చల్**

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డులో గత కొన్ని నెలలగా నుంచి మ్యాన్ హెూల్ నుంచి మురుగునీరు పారుతున్నా స్థానిక ప్రజా ప్రతినిధి, అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను పట్టించుకోవాల్సిన కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ప్రజ్ఞా హాస్పిటల్ వెంకట్రామయ్య నగర్ కాలనీలో ట్రాక్టర్, ఆటో,కార్లతో పాటు అనేక వాహనాలు ప్రమాదాలకు గురవగా అందులో ప్రయాణించిన ప్రయాణికులు నానావస్థలు పడ్డారని కాలనీ వాసుడు కాళధర్ రెడ్డి పేర్కొన్నారు. గత కొన్ని నెలల క్రితం నాగార్జున టాలెంట్ స్కూల్ వైపు నుంచి వెళ్లే అంతర్గత మురికి కాలువను అటు సైడు వదిలేసేవారు కానీ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి నిర్మించిన భవనాన్ని (ప్రజ్ఞ ఆస్పత్రి) నిర్మించే సమయంలో గతంలో ఉన్న మాన్‌హెూల్ ను స్థాయికి మించి ఎత్తు పెంచడంతో సదరు స్థలంలో ఉన్న మ్యాన్ హెూల్ డామేజ్ అయ్యి 14వ వార్డు నుంచి వస్తున్న మురుగునీరు ఎరులై పారుతున్నది. ఇదిలా ఉంటే మ్యాన్‌హెూల్ పక్కనే విద్యార్థుల హాస్టల్ ఉండడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు.

**కమిషనర్‌తో కలిసి వచ్చి చూసిందే కానీ చేసిందేంది...**

కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి పై గతంలో మేడ్చల్ పురపాలక సంఘం కమిషనర్, అధికారులతో కలిసి వచ్చి డ్యామేజ్ అయిన అంతర్గత మురికి కాలువను పరిశీలించారే తప్ప సమస్యను పూర్తిస్థాయి పరిష్కారం దిశగా ముందు సాగలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### ఉదయం దుర్గంధం.. రాత్రి దోమలతో ఇబ్బందులు



స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది బీఆర్ఎస్ పార్టీలో చేరిన కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి ఓట్లేసి గెలిపించిన ప్రజల వైపా...? కాదా. ఉదయం సమయంలో దుర్గంధం వెదజల్లుతుంటే రాత్రి సమయంలో దోమలతో ఇబ్బందులు పడడమే కాకుండా గతంలో అనేక మంది ప్రజలు అనారోగ్యాల పాలయ్యారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు,కౌన్సిలర్ స్పందించి సమస్యను పరిష్కరిం చకుంటే కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం.

– కాలనీ వాసుడు కళాధర్ రెడ్డి

## ప్రగతి యాత్రలో 33వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద..



**నవతెలంగాణ-కుత్బుల్లాపూర్**

సుభాష్ నగర్ 130 డివిజన్ పరిధిలో ప్రగతి యాత్రలో భాగంగా 33 వ రోజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద పర్యటించారు. ఈ సందర్భంగా సుభాష్ నగర్ ఫేస్- 1 , భాగ్యలక్ష్మి కాలనీలలో పాదయాత్ర చేస్తూ పూర్తిచేసిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ అభివద్ధి పనుల్లో పరిశీలించారు. కాగా సుభాష్ నగర్ ఫేస్ – 1 లో రూ.8.70 కోట్ల తో సీసీ రోడ్లు, భూగర్భ డ్రయినేజీ పూర్తి చేసినందుకు, భాగ్యలక్ష్మి కాలనీలో రూ.4.50 కోట్లతో సీసీ రోడ్లు, పూర్తి చేసినందుకు కాలనీ ప్రజలు ఎమ్మెల్యేకు హారతులతో ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సుభాష్ నగర్ ఫేస్ –1 లో మిగిలి ఉన్న డ్రయినేజీ పూర్తి చేయాలని, కమిటీ హాల్ ఏర్పాటుకు కషి చేయాలని ఎమ్మెల్యేని కోరగా అక్కడే ఉన్న అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశిచారు. భాగ్యలక్ష్మి కాలనీలో మిగిలి ఉన్న ఇంటర్నల్ సీసీ రోడ్లు పూర్తి చేయాలని, ఓపెన్ నాలా పనులలో వేగం పెంచాలని ఎమ్మెల్యేని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ పాపమ్మ, ఏఈ సురేంద్ర నాయక్, డీజీఎం రాజేష్, మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్ , సీనియర్ నాయకులు మన్నె రాజు, కుంటి మల్లేష్, రాములు, అరుణ రెడ్డి, పద్మజ రెడ్డి, కాలనీలా సంక్షేమ సంఘాల అధ్యక్షులు బి కష్ణ సాగర్ రెడ్డి, మల్లారెడ్డి, బాలరాజు, ధనరాజ్, చందర్ రావు, కె.వి.రమణ రెడ్డి , శ్రీనివాస్ గౌడ్, యాదగిరి, రాము రెడ్డి, తిరుపతిరెడ్డి, వేణుగోపాల్, ఐలేష్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడమే లక్ష్యం

- కార్పొరేటర్ బి .విజయ శేఖర్ గౌడ్



**నవతెలంగాణ-జగద్గిరిగుట్ట**

రంగారెడ్డి నగర్ డివిజన్ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించడమే తమ లక్ష్యమని కార్పొరేటర్ బి .విజయ శేఖర్ గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఆదర్శ్ నగర్ కాలనీలో జలమండలి అధ్వర్యంలో నవజ్యోతి స్కూల్, గుడ్ షేపర్డ్ స్కూల్,గాయత్రి గ్రామర్ స్కూల్స్ నేతత్వంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని పలు దేశాలు నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని, స్వచ్ఛమైన తాగునీరు లభించక కోట్లాదిమంది ప్రజలు సకల జీవరాశులు అనారోగ్యం బారినపడి ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ తమ ఇండ్లలో ఉన్న నల్లాలకు వాల్వ్‌ను ఏర్పాటు చేసుకోవాలని, తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని నీటి వధా కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ పూజిత, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, నాయకులు, బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబర్లు, మహిళా నాయకురాళ్ళు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## జనచైతన్య యాత్రకు తరలిన నాయకులు

**నవతెలంగాణ-కుత్బుల్లాపూర్**

సీపీఐ(ఎం) జనచైతన్య యాత్ర ఘట్కేసర్‌కు రావడంతో స్వాగతం పలకడానికి కుత్బుల్లాపూర్ నుంచి భారీగా మోటార్ సైకిళ్లపై తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, సీనియర్ నాయకులు ఎండీ సలీంలు పాల్గొని మాట్లాడుతూ... ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ హరిస్తున్నదన్నారు. బీజేపీ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేసిన మీడియాపై ప్రజాస్వామ్య వాదులపై తీవ్రమైన దాడులకు తెగబడుతున్నదన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కులం మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు అంజయ్య, దేవదానం, కనకయ్య జాకీర్, ఆరిఫ్, ఆంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట సాధారణ సర్వ సభ్య సమావేశంలో బడ్జెట్ ఆమోదం



**నవతెలంగాణ-దుండిగల్**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య మేయర్ కోలన్ నీలగోపాల్ రెడ్డి అధ్యక్షతన డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ , ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణా రావు తో కలిసి 2023-2024 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ , 17వ సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 సంవత్సర అంచనా బడ్జెట్ , 2022-23 సంవత్సర సవరణ బడ్జెట్ ను సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో ముఖ్యంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 2023-2024 బడ్జెట్ అంచనా 114.09 కోట్లు, దీనిలో భాగంగా గ్రీన్ బడ్జెట్ మున్సిపల్ సొంత ఆదాయాలు 15వ గ్రాంట్ అంచనా పైన 10 శాతం అనగా 9.2 కోట్లు కేటాయించడం జరిగింది.1 /3 వ వంతు బడ్జెట్ కొత్తగా విలీనమైన ప్రాంతాలలో క్లిష్టమైన మౌలిక సదుపాయాల అవసరాలు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు బలహీన వర్గాల మైనార్టీలు, మురికివాడల్లో నివసించే ప్రాంతాలకు 12.37 కోట్లు కేటాయించారు. ఈ సమావేశంలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులను, రోడ్డు వెడల్పు పనులు, డ్రయినేజీ పనులపై సమీక్ష చేశారు. ఆయా డివిజన్ కాలనీలో ప్రధాన సమస్యలు వాటి పరిష్కారం, బస్తీ దవాఖాన, ఓపెన్ జిమ్స్, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠ దామలు, శ్యానిటేషన్, మంజీర నీటి సరఫరా పెంచడం, ఫాగ్గింగ్, పట్టణ అభివధి పనులు వంటి పలు కీలక ప్రధాన అంశాలపై ఎన్ఎంసీ కార్పొరేటర్లు , కో ఆప్షన్ సభ్యులతో సుధీర్ఘ చర్చా సమావేశం నిర్వహించారు. అనంతరం జాతీయ పోషణాపక్షం సందర్భంగా ప్రతీ ఇంటికి సరైన పోషణ, పోషకాహారం, తాగునీరు, పరిశుభ్రతలపై సమాచారం ఇస్తూ అంగన్వాడి టీచర్స్ తో కలిసి ప్రతిజ్ఞ చేయడం జరిగింది.. ఈ సమావేశంలో , కార్పొరేటర్లు , కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసీ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ మాక్స్ కార్మికులకు అండగా ఉంటాం



**నవతెలంగాణ - కుత్బుల్లాపూర్**

సూపర్ మాక్స్ కార్మికులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మన్నె రాజు ముదిరాజ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో గల సూపర్ మాక్స్ కార్మికులు గత 30 రోజులుగా కంపెనీ ఆవరణలో చేస్తున్న దీక్షకు మంగళవారం వారు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో సురేష్ బాబు, సుధాకర్ రెడ్డి, శివ ప్రసాద్, నాగేందర్, అజీజ్, సి.జగదీష్ లు ఉన్నారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ సుమారుగా 1000 మంది పైగా కార్మికుల జీవితాలను, వారి కుటుంబాలను అర్ధాంతరంగా రోడ్డున పడేయడం చాలా బాధాకరమన్నారు. చాలా ఏండ్లుగా కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేసి ఇప్పుడు యజమాన్యం వారి పట్ల మొండిగా ఆలోచించి తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ల చొరవతో మళ్ళీ సూపర్ మాక్స్ పరిశ్రమ యధావిధిగా కొనసాగుతుందని కార్మికులకు ధైర్యం చెప్పారు. తాము కూడా ఎల్లప్పుడూ కార్మికులకు అండదండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సంఘం ప్రధాన కార్యదర్శులు ఐ.ఎస్ రావు , లక్ష్మారెడ్డి, ఈశ్వరరావు, కార్మికులు ఎల్ వెంకటేష్ రాజిరెడ్డి సిద్ధిరాములు, గుంటరాజు, వీరస్వామి, వెంకటరెడ్డి ,ఈశ్వర్ రెడ్డి ,ఆనంద్ రెడ్డి కార్మిక సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## మహాన్య బోటిక్ డిజైనర్స్ షాప్ ప్రారంభించిన మేయర్.

**నవతెలంగాణ-దుండిగల్**



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 7వ డివిజన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన మహాన్య బోటిక్ డిజైనర్స్ షాప్ ప్రారంభోత్సవానికి మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథు లుగా హాజరై స్థానిక డివిజన్ కార్పొరేటర్ ప్రణయ ధనరాజ్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులైన జ్యోతి రెడ్డి కీ,నరేష్ రెడ్డిలకు మేయర్ అభినందనలు తెలియచేశారు. 15 వ డివిజన్ కార్పొరేటర్ గాజుల సుజాత , సీనియర్ నాయకులు కోలన్ సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆటోమోవిల్ మార్కెటింగ్‌లోకి టోటల్ ఎనర్జీస్

**నవతెలంగాణ - హైదరాబాద్**

భారతదేశంలో ఆన్‌లైన్ టూ ఆన్‌లైన్ నుంచి ఆఫ్‌లైన్ ఆటోమొబైల్ సర్వీస్ అగ్రిగేటర్‌లతో మల్టీ ఛానెళ్లలో కస్టమర్ టచ్‌పాయింట్‌లను మెరుగుపరుచుకునేందుకు టోటల్ ఎనర్జీస్ మార్కెటింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకుంది. సర్వీస్ అగ్రిగేటర్‌లైన వెహికల్‌కేర్ మరియు ఆటోమోవిల్ వరుసగా గురుగ్రామ్ మరియు బెంగళూరులో ఉన్నాయి. ఇప్పటికి దేశంలోని పట్టణలలో 59% ఇంటర్నెట్ వ్యాప్తితో, భారతీయ వినియోగదారులు తమ ఇంటి వద్ద పారదర్శకంగా, అనుకూలమైన, అధిక-నాణ్యత సేవల కోసం ఎక్కువగా చూస్తున్నారు. వెహికల్‌కేర్ మరియు ఆటోమొవిల్ రెండూ వాహన యజమానులకు - వారి మొబైల్ మరియు డెస్క్‌టాప్ అప్లికేషన్‌లపై కేవలం కొన్ని క్లిక్‌ల ద్వారా ఒన్-స్టాప్ ఆటోమొబైల్ సేవలను అందిస్తాయి. టోటల్ ఎనర్జీస్‌లో, కస్టమర్ సెంట్రిసిటీ అనేది వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరిచే తన ప్రయత్నాలలో ప్రధానంగా దృష్టి సారిస్తుంది.

## అన్ అకాడమీ స్కాలర్ షిప్ టెస్ట్

**నవతెలంగాణ - హైదరాబాద్**

భారతదేశంలో అతిపెద్ద లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్ అనగానే అందరికి గుర్తుకు వచ్చేది అన్ అకాడమీ. పోటీ పరీక్షల్లో అద్భుతమైన విజయాలు సొంతం చేసుకోవాలనుకుంటున్న విద్యార్థులు అన్ అకాడమీ కార్యక్రమాల ద్వారా తమ కలలను సాకారం చేసుకుంటున్నారు. అందుకోసమే విద్యార్థుల కోసం అన్ అకాడమీ స్కాలర్ షిప్ టెస్ట్ ని నిర్వహిస్తోంది. ఈ పరీక్ష మార్చి 26 నుంచి ఏప్రిల్ 16 వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించబడు తుంది. ఈ స్కాలర్ షిప్ టెస్ట్ ద్వారా విద్యార్థులు తమ కలల లక్ష్యాన్ని సాధించగలిగేందుకు అవకాశం ఏర్పడుతుంది. భారతదేశంలోని అగ్రశ్రేణి అధ్యాపకులు మరియు ఉత్తమ బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థులకు నేర్పించడమే లక్ష్యంగా పెట్టుకుంటారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు అన్ అకాడమీ మరియు అనాకాడెమీ సెంటర్‌లో 100% వరకు స్కాలర్‌షిప్‌లను పొందగలుగు తారు, అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులు స్పెషల్ ర్యాంకర్స్ గ్రూప్‌కి యాక్సెస్ పొందుతారు.

## సాంసంగ్ నుంచి ప్రీమియమ్ వాక్యూమ్ క్లీనర్

**నవతెలంగాణ - హైదరాబాద్**

సాంసంగ్ భారతదేశం యొక్క అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్. భారతదేశంలో దాని ప్రీమియమ్ వాక్యూమ్ క్లీనర్స్ రేంజ్‌ని విడుదల చేసింది. బెస్పోకెన జెట్, ఒక చక్ర-రకం తీగరహిత వాక్యూమ్, మరియు శక్తివంతమైనది మరియు సులభంగా తెలుసుకోగలిగే రొబోటిక్ జెట్ బొట్‌ం. ప్రతి లివింగ్ స్పేస్‌లోని ఇండోర్స్‌ని కాప్లిమెంట్ చేసే అద్భుతమైన డిజైన్స్‌లో రావడమే కాకుండా శ్రమలేని క్లీనింగ్ పరిష్కారాలని కూడా అందించడానికి భారతీయ వినియోగదారుల కొరకు కస్టమైజ్ చేయబడిన కొత్త అప్‌గ్రేడెడ్ లైన్-అప్ వాక్యూమ్ క్లీనర్స్ ఇవి. అధునిక ఇళ్ళలోపల లివింగ్ రూమ్స్‌లోకి సరిగ్గా ఉండేట్లు డిజైన్ మరియు అభివృద్ధి చేయబడ్డాయి, ఈ కొత్త రేంజ్ 99.999% దుమ్ము-రహిత క్లీనింగ్ మల్టీ-లేయర్డ్ ఫిల్టరేషన్ సిస్టమ్‌తో నిర్ధారించుకుంటుంది.




Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

# అక్రమ మైనింగ్‌లో ఎఫ్‌ఐఆర్‌లు ఆరు శాతమే

- **16 రాష్ట్రాల్లో 60వేలకు పైగా కేసులు ఎఫ్‌ఐఆర్‌లు మాత్రం 3686 మాత్రమే..! రాజ్యసభలో కేంద్రం సమాచారం**

**న్యూఢిల్లీ :** దేశంలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతున్నది. మాఫియా ఆగడాలకు అడ్డుకట్టవేయాల్సిన అధికార యంత్రాంగాలు అంటనట్టుగా వ్యవహరిస్తున్నాయి. దీంతో అక్రమమైనింగ్‌కు సంబంధించిన కేసులలో ఎఫ్‌ఐఆర్‌లు తక్కువగా నమోదవుతున్నాయి. 16 రాష్ట్రాల అక్రమ మైనింగ్ ఘటనలకు సంబంధించి రాజ్యసభలో కేంద్రం వెల్లడించిన సమాచారంలో ఈ విషయం వెల్లడైంది. ఈ సమాచారం ప్రకారం ఎఫ్‌ఐఆర్‌ల దాఖలు రేటు చాలా తక్కువగా ఉంది. దేశంలో 16 రాష్ట్రాల్లో 60,419 అక్రమ మైనింగ్ కేసులు నమోదయ్యాయి. వీటిలో 3,686 ఎఫ్ ఐఆర్‌లు మాత్రమే నమోదవడం గమనార్హం.భారతదేశంలో మైనింగ్ మైన్స్ మరియు మినరల్స్ (అభివృద్ధి మరియు నియంత్రణ) చట్టం కింద నియంత్రించ బడుతుంది. 2015లో ఈ చట్టానికి చేసిన సవరణ ద్వారా అక్రమ మైనింగ్ కు జరిమానాలు మరింత కఠినతరం చేయబడ్డాయి. చట్టంలోని సెక్షన్ 4(1), 4(1ఏ)లను ఉల్లంఘిస్తే హెక్టారుకు రూ.25,000 నుంచి రూ.5 లక్షలకు పెనాల్టీ పెంపు, జైలు శిక్ష 2 ఏండ్ల నుంచి 5 ఏండ్లకు పెంచారు.అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు మొత్తం 22 రాష్ట్రాలు నిబంధనలు రూపొందించాయి. లైసెన్స్ లేకుండా లేదా లైసెన్స్ ప్రాంతం వెలుపల మైనింగ్ చేసినప్పుడు లేదా అనుమతించదగిన మొత్తం కంటే ఎక్కువ సేకరించినప్పుడు అక్రమ మైనింగ్ జరుగుతుంది.



ఏప్రిల్ 1, 2022 మరియు సెప్టెంబర్ 30, 2022 మధ్య కాలానికి సంబంధించి మంత్రిత్వ శాఖ అందించిన తాజా డేటా ప్రకారం.. మొత్తం 60,419 అక్రమ మైనింగ్ కేసులు ఉన్నాయి. వీటిలో 3,686 ఎఫ్ఐఆర్‌లు మాత్రమే నమోదయ్యాయి. కోర్టులో 2,931 కేసులు దాఖలు చేయబడ్డాయి.అత్యధిక కేసులు తెలంగాణ (17,938) నుంచి.. అత్యల్పం గోవా (1) నుంచి ఉన్నాయి. సిక్కింలో అత్యధికంగా ఎఫ్ఐఆర్‌లు (1,245), ఆంధ్రప్రదేశ్‌లో (4,296 కేసులు), గోవా (1 కేసు), హిమాచల్ ప్రదేశ్ (1,934 కేసులు), కేరళ (3,617 కేసులు), ఒడిశా (7 కేసులు), తమిళనాడులో జీరో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. (4,495 కేసులు) మరియు ఉత్తరప్రదేశ్‌లో (757) నమోదయ్యాయి.

2015-16లో మహారాష్ట్రలో అత్యధికంగా 33,621 కేసులతో అక్రమ మైనింగ్ కేసులు నమోదయ్యాయి. 2022 ఏప్రిల్-సెప్టెంబర్‌లో అత్యధికంగా తెలంగాణ నుంచి 17,938 అక్రమ మైనింగ్ కేసులు నమోదవుతున్నా.. అలాంటి కేసులు ఖచ్చితంగా తగ్గాయని చెప్పవచ్చు. 2009-10లో 487 కేసుల సంఖ్యను 2016-17లో కేవలం 45కి, 2022లో 7కి 90 శాతానికి పైగా తగ్గించినందున అక్రమ మైనింగ్‌ను అరికట్టడంలో ఒడిశా గొప్ప పురోగతి సాధించింది.

పండుగలు వస్తున్నాయి

## తగిన జాగ్రత్తలు తీసుకోండి

- వీడియో కాన్ఫరెన్సులో ఎస్పీలు, కమిషనర్లను ఆదేశించిన డీజీపీ

**నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి**

పండుగలు వస్తున్న కారణంగా శాంతి భద్రతల పరంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లను డీజీపీ అంజనీ కుమార్ ఆదేశించారు. మంగళవారం వీరితో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించిన డీజీపీ రంజాన్ మాసం మొదలైందనీ, తర్వాత శ్రీరామనవమి, హనుమాన్ జయంతితో పాటు ఇతర పండుగలు వస్తున్నాయనీ, వీటిని దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మతపరంగా సున్నితమైన ప్రాంతాలలో నిఘాను పెంచడంతో పాటు తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా శోభాయాత్రలు నిర్వహించే ప్రాంతాల్లో సైతం అసాంఘీక శక్తుల కదలికలపై కన్నేసి ఉంచాలని, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడతారనే అనుమానమున్న కమ్యూనల్ రౌడీలను ముందుగానే అదుపులోకి తీసుకోవాలని ఆయన కోరారు. వీటితో పాటు ఇతర నేరాల అదుపునకు సైతం తగిన ప్రణాళికలతో అధికారులు ముందుకు సాగాలని ఆయన సూచించారు. అన్ని పోలీసు స్టేషన్ల పరిధులలో పోలీసులు పని తీరును కూడా ఎప్పటికప్పుడు పోలీసున్నతాధికారులు మదింపు చేసి ఏవైనా లోపాలుంటే సరిదిద్దాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి తొలిసారిగా ఇటీవల శిక్షణను పూర్తి చేసుకున్న ఐదుగురు 74వ బ్యాచ్‌కు చెందిన ఎన్‌పీఏ యువ ఐపీఎస్ అధికారులను కూడా ఆహ్వానించారు.

## గ్రూప్-1 కోచింగ్ తరగతులు

- తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

గ్రూప్ -1 కోచింగ్ ప్రోగ్రామ్ కోసం హైదరాబాద్‌లోని ఓయూ సెంటర్‌లో తాజా బ్యాచ్ కోసం వచ్చే నెల మూడో తేదీ నుంచి కోచింగ్ తరగతులు ప్రారంభం కానున్నాయని తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె అలోక్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. . డిగ్రీ, ఇంటర్మీడియట్‌లో ప్రథమ తరగతిలో ఉత్తీర్ణులైన (200) అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ప్రోగ్రామ్ కోసం గతంలో మెయిన్సుకు అర్హత సాధించిన, ఉత్తీర్ణత సాధించని అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్న భోజనం టీఎస్‌బీసీ స్టడీ సర్కిల్లో ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.5 లక్షల కంటే తక్కువ ఉన్న వారు అర్హులని తెలిపారు. ఇంతకుముందు మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించని టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-1కి వెయిటేజీ, ఉన్నత విద్యార్హతలకు 10శాతం మార్కులు, డిగ్రీ మార్కులకు 50శాతం, ఇంటర్మీడియట్ మార్కులకు 20శాతం ఇవ్వనున్నట్టు తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలతో పాటు విద్యా అర్హతల ధృవీకరణ కాపీలతో నేరుగా బీసీ స్టడీ సర్కిల్, ఓయూ క్యాంపస్‌లో 31-03-2023 లోపు సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 040- 2018, 040-27077929 సంప్రదించాలని కోరారు.

## దళిత బంధును పకడ్బందిగా అమలు చేయాలి

- మంత్రి కొప్పుల ఈశ్వర్

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

దళిత బంధు పథకాన్ని పకడ్బందిగా అమలు చేయాలని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ బండ శ్రీనివాస్‌తో కలిసి దళిత బంధుపై సమీక్ష నిర్వహించారు. దళిత బంధు అమలు తీరుపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రౌండ్ లెవల్‌లో తిరిగి పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. కింది స్థాయిలో దళిత బంధులో అక్రమాలు జరుగుతున్నాయని సమాచారం ఉందని తెలిపారు.అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్సీ కార్పొరేషన్ ఇడీలు క్షేత్ర స్థాయిలో తిరిగాలనీ, లబ్ధిదారులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నెల నెలా ఆదాయం ఎంత వస్తుందో తెలుసుకోవాలన్నారు.

మాతా, శిశు మరణాల తగ్గింపులో లక్ష్యం

## మూడో స్థానం మొదటి స్థానమే

- నిమ్స్ ఎంసీహెచ్ ఆస్పత్రికి మంత్రి హరీశ్ రావు



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

మాతా, శిశు మరణాలను తగ్గించడంలో దేశంలోనే రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిందనీ, మొదటి స్థానం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. మంగళవారం నిమ్స్ 200 పడకల మాతా, శిశు ఆస్పత్రి (మదర్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్ - ఎంసీహెచ్) నిర్మాణానికి ఆయన శంకు స్థాపన చేశారు. ఇతర సమస్యలతో బాధపడే గర్భిణీలను పెద్దాస్పత్రులకు రెఫర్ చేసిన సమయాల్లో మార్గమధ్యంలో చనిపోతుంటారని మంత్రి గుర్తుచేశారు. ఈ పరిస్థితి తలెత్తకుండా మాతా, శిశు ఆస్పత్రులకు ప్రత్యేకంగా రూ.490 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు హరీశ్ రావు వివరించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల చెంతనే ఎంసీహెచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. తద్వారా ఇతర సమస్యలున్న గర్భిణులు మార్గమధ్యంలో చనిపోవడాన్ని నివారించేందుకు సాధ్యపడుతుందని తెలిపారు. డయాలసిస్ రోగుల కోసం ప్రస్తుతం నిమ్స్‌లో 34 బెడ్లుండగా వాటిని 100కు పెంచినట్టు మంత్రి తెలిపారు. దీనితో ప్రతి రోజు 1,500 మందికి డయాలసిస్ సేవలందుతాయన్నారు.

**త్వరలో 2,000 పడకల నిమ్స్ కొత్త బిల్డింగ్‌కు సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు.**

**26 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నియామకపత్రాలు**

నిమ్స్‌లో కొత్తగా ఎంపికైన 26 మంది బ్రాడ్, సూపర్ స్పెషాలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మంత్రి హరీశ్ రావు నియామక పత్రాలు అందించారు. నిమ్స్‌పై నమ్మకం పెంచేలా పని చేయాలని సూచించారు. బాగా పనిచేసే ప్రొఫెసర్స్‌కి ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలిపారు.

## 'భద్రాద్రి' తలంబ్రాలకు అనూహ్య స్పందన

- 10 రోజుల్లో 50 వేల బుకింగ్‌లు

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

భద్రాద్రి సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలకు భక్తుల నుంచి అనూహ్య స్పందన వస్తున్నదని టీఎస్ఆర్టీసీ తెలిపింది. కేవలం పది రోజుల్లో 50 వేల మంది తలంబ్రాల కోసం బుకింగ్ చేసుకున్నారని వివరించారు. శ్రీరామ నవమి సందర్భంగా భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలను భక్తులకు అందజేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) నిర్ణయించిన విషయం తెలిసిందే. రూ.116 చెల్లించి బుక్ చేసుకుంటే కల్యాణ అనంతరం తలంబ్రాలను భక్తులకు హోండెలివరీ చేయనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా తలంబ్రాల బుకింగ్ జరుగుతోంది. అయితే ఆర్టీసీ భక్తులకు మరో అవకాశాన్ని కల్పించింది. శ్రీరామ నవమి కల్యాణ సమయంలోనే కాకుండా.. తలంబ్రాలను ఎప్పుడైనా భక్తులు పొందే సదావకాశాన్ని కల్పించింది. కార్గో పార్శిల్ సెంటర్‌కు వెళ్లి రూ.116 చెల్లిస్తే నిర్ణీత సమయంలో తలంబ్రాలను భక్తులకు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ నియమ నిష్టలతో ధాన్యాన్ని గోటితో ఒలిచి తీసిన కోటి బియ్యం గింజలను తలంబ్రాలుగా భద్రాద్రి సీతారాముల కల్యాణోత్సవంలో ఉపయోగిస్తారనీ, విశిష్టమైన ఆ తలంబ్రాలను పొందేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని టీఎస్ఆర్టీసీ కార్గో పార్శిల్ కౌంటర్లలో వీటినిబుక్ చేసుకోవచ్చునీ, ఇతర సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ఫోన్ నంబర్లు 9177683134, 7382924900, 9154680020ను సంప్రదించాలన్నారు.

## రాష్ట్రంలో పేదలకు బలవర్ధక బియ్యం అందించేందుకు సర్వం సిద్ధం

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

- ఏప్రిల్ నెల నుంచి 11 జిల్లాల కార్డుదారులందరికీ ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ
- ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12లతో కూడిన బియ్యంతో సంపూర్ణ పోషణ

రాష్ట్రంలోని పేదలందరికీ సంపూర్ణ పోషకాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది, ఏప్రిల్ నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకాలతో పాటు 11 జిల్లాల పరిధిలో ఉన్న ప్రతీ రేషన్ కార్డుదారుకు బలవర్ధక బియ్యాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఉన్నతాధికారులతో పంపిణీ ఏర్పాట్లపై సమీక్షించారు. గ్రామీణ, పట్టణ పేద ప్రజలు పోషకాహార లోపంతో అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ముఖ్య పోషకాలైన ఐరన్, ఫోలిక్ ఆసిడ్, బీ12 విటమిన్లతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్‌కెర్నల్స్ ఉన్న బలవర్ధక బియ్యంను రేషన్ ద్వారా పంపిణీ చేయనున్నట్టు మంత్రి తెలిపారు. దాదాపు రాష్ట్రంలోని అన్ని మిల్లుల్లోనూ బ్లెండింగ్ యూనిట్లు ఏర్పాటయ్యాయనీ, ఫోర్టిఫైడ్ బియ్యాన్ని భారత ఆహార సంస్థకు కస్టమ్ మిల్లింగ్ రైస్‌లో భాగంగా 35 లక్షల మెట్రిక్ టన్నులు అందించినట్టు చెప్పారు. రాష్ట్రంలో ప్రజాపంపిణీ అవసరాల కోసం సివిల్ సప్లైస్ కార్పోరేషన్ 11 లక్షల మెట్రిక్ టన్నులను ఇప్పటికే సేకరించిందని మంత్రి వెల్లడించారు. వీటిని ఏప్రిల్ నెల నుంచి 11 జిల్లాల లబ్దిదారులకు అందజేస్తామని స్పష్టం చేశారు. మిగతా జిల్లాల్లో సైతం విడతల వారీగా 2024 మార్చి వరకూ ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

2021 సెప్టెంబర్‌లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బలవర్ధక బియ్యం పంపిణీ పైలట్ ప్రాజెక్టుగా మొదలైందని తెలిపారు. తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం, హాస్టళ్లకు అందించినట్టు వివరించారు. 2022 మే నుంచి అదిలాబాద్, అసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రజలకు పంపిణీ జరుగుతుందన్నారు. తాజాగా రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, హన్మకొండ, మంచిర్యాల, నిర్మల్, ఖమ్మం, వికారాబాద్ జిల్లాల పరిధిలో ఏప్రిల్ నెలలో దీని పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్టు వివరించారు.

## కొత్త మెడికల్ కాలేజీల పనులు వేగంగా కొనసాగించాలి

- ఎన్ఎంసీ నిబంధనలు సంతృప్తి చెందేలా పనులు ఉండాలి : మంత్రి హరీశ్ రావు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీల పనులు వేగంగా కొనసాగించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేయనున్న తొమ్మిది మెడికల్ కాలేజీలు, నిమ్స్‌పై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు సంతప్తి చెందేలా పనులుండాలని సూచించారు. జూలై నాటికి తరగతులు ప్రారంభించేందుకు వీలుగా అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల భర్తీ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. 2014 తర్వాత ఎంబీబీఎస్ సీట్లు దేశంలో 71 శాతం పెరిగితే, రాష్ట్రంలో 240 శాతం పెరిగాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీలకు అనుమతించిన కేంద్రం తెలంగాణపై వివక్ష చూపించిందని విమర్శించారు. అయినప్పటికీ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో వైద్యవిద్య విప్లవానికి నాంది పలికారని కొనియాడారు. ఈ సమావేశంలో మంత్రులు సత్యవతి రాథోడ్, అజయ్ కుమార్, ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, తొమ్మిది జిల్లాల కలెక్టర్లు, స్థానిక ఎమ్మెల్యేలు, ఆయా మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

**అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల మెరిట్ జాబితా విడుదల**

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ప్రాథమిక మెరిట్ జాబితాను మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. అభ్యంతరాలు స్వీకరించేందుకు వచ్చే నెల ఒకటి వరకు (4 రోజులు) గడువు ఇస్తున్నట్టు తెలిపింది. మెరిట్ జాబితా, ఇతర వివరాల mhsrb.telangana.gov.in సందర్శించాలని సూచించింది.

## నూతన కళారూపాలతో ప్రజల్ని చైతన్యపర్చాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

ప్రజల్ని నూతన కళారూపాలతో కవులు, కళాకారులు చైతన్యపర్చాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆర్థిక నేరాలను, మతోన్మాదాన్ని పెంచుతున్నదనీ, ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకు సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన "పల్లె పల్లెకు సీపీఐ-ఇంటింటికీ సీపీఐ" కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా జానపద గేయాలు, ఒగ్గుకథలు, వీధినాటకాలను రూపొందించుకోవాలని సూచించారు. అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణ ప్రజానాట్య మండలి సంయుక్త రాష్ట్ర సమితి సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ.. తొమ్మిదేండ్ల మోడీ పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారిందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీని, ప్రధాని మోడీని ఎక్కుపెడుతూనే, స్థానిక సమస్యలను జోడిస్తూ కొత్త రకమైన పాటలతో ముందుకు సాగాలని కవులు, కళాకారులకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకిక వ్యవస్థ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం సీపీఐ యాత్ర కొనసాగనున్నదని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడుతూ.. అరసం, ప్రజానాట్య మండలి కలిసి ఒక శక్తివంతమైన పాటలను తీసుకురావాలన్నారు. అరసం అధ్యక్షవర్గ సభ్యులు వేల్పుల నారాయణ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తే దాడులకు పాల్పడుతున్నారని, వివక్షకు గురికావాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి ప్రజా నాట్యమండలి కార్యదర్శి పల్లె నర్సింహ సభాధ్యక్షత వహించగా, ప్రజా నాట్య మండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, అరసం కార్యదర్శి రాపోలు సుదర్శన్, అరసం కార్యదర్శి కెపీఎల్‌తో పాటు కవులు,కళాకారులు పాల్గొన్నారు.

## మోడీ బండారం బయటపడుతుందనే ...

- మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్
- కేసీఆర్ అర్థం కావడం లేదని వ్యాఖ్య




**0నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

లోక్‌సభలో రాహుల్ గాంధీ అదానీ అక్రమాలను బయటపెట్టినందుకే ఆయనపై అనర్హత వేటు వేశారని మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ విమర్శించారు. ఆదానీ అక్రమాలు బయటపడితే మోడీ బండారం కూడా బయటపడుతుందనే అనర్హత వేటు వేశారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ మాణిక్‌రావు ఠాక్రేతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా కేవలం విపక్షాల గొంతు నొక్కేందుకు బీజేపీ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్ఐసీ, ఎస్‌బీఐ నిధులను కేంద్ర ప్రభుత్వం అదానీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిందని తప్పుపట్టారు. అమెరికా, శ్రీలంక దేశాల్లో రాజకీయ నేతలపై పరువు నష్టం దావాలు ఎత్తేసినట్టుగానే మన దేశంలోనూ ఎత్తేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. భావప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయ, ప్రజా పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు.

**కేసీఆర్ ఎవరికి వ్యతిరేకమో అర్థం కావడం లేదు..**

మహారాష్ట్ర రాజకీయాల్లోకి బీఆర్ఎస్ ప్రవేశించడాన్ని అశోక్ చవాన్ స్వాగతించారు. బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్.. భాజపాకి వ్యతిరేకంగా పని చేస్తున్నారో? కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. అయితే రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని కేసీఆర్ ఖండించారనీ, దీనిని స్వాగతిస్తున్నట్టు తెలిపారు.

## 4 నుంచి ఇంజినీరింగ్ కాలేజీ గుర్తింపునకు దరఖాస్తుల ఆహ్వానం

- జేఎన్టీయూ హైదరాబాద్


**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలు 2023-24 విద్యాసంవత్సరంలో అనుబంధ గుర్తింపు కోసం వచ్చేనెల నాలుగో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జేఎన్టీయూ హైదరాబాద్ ప్రకటించింది. ఈ మేరకు ఆ వర్సిటీ రిజిస్ట్రార్ ఎం మంజూర్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు వచ్చేనెల 15వ తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. ఫారం 123ని అప్‌లోడ్ చేయాలని వివరించారు. విద్యాసంస్థలు ఒఒఒ.యఅ్‌బష్రుఖుఎ.aఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. సందేహాల కోసం 8008421860 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

**జీతాలివ్వని కాలేజీలపై దృష్టిసారించండి**

జేఎన్టీయూ హైదరాబాద్ పరిధిలోని సాంకేతిక కాలేజీలు అధ్యాపకులకు జీతాలు చెల్లించడం లేదని టీఎస్‌టీసీఈఏ అధ్యక్షులు అయినేని సంతోష్‌కుమార్ తెలిపారు. ఆయా కాలేజీలపై అధికారులు దృష్టిసారించాలని కోరారు. వేతన సంఘం సిఫారసులను అమలు చేయడం లేదని పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తిని ఎక్కడా అమలు చేయడం లేదని తెలిపారు. గ్రూప్ ఇన్సూరెన్స్ లేదనీ, ఫైర్ సేఫ్టీ, హెచ్‌ఎండీఏ అనుమతుల్లేవనీ విమర్శించారు. నిబంధనలు పాటించని ఆ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 20 జిల్లాల్లో కరోనా



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

కరోనా కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతున్నప్పటికీ రాష్ట్రంలో నిలకడగా ఉంటున్నాయి. వైద్యారోగ్యశాఖ అంచనాల మేరకు మార్చి మొదటి, రెండు వారాల్లో పెరిగిన కేసులు క్రమేణా తగ్గుతున్నట్టు గుర్తించారు. అయితే మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 23 కేసులే వచ్చినప్పటికీ, అవి కాస్తా 20 జిల్లాల్లో వెలుగు చూడటం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రజలు మాస్కులు ధరించడం, ఇతర కరోనా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

## విద్యుత్ కార్మికులకు పీఆర్సీని అమలు చేయాలి

- కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలి : కూనంనేని



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న 70 వేలమంది కార్మికులు, ఉద్యోగులకు పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాన్ని అమలు చేయడం వల్ల మూడు లక్షల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంస్థలలో 1999 నుంచి 2004 వరకు ఉద్యోగంలో చేరిన వారికి రాష్ట్రంలో మిగతా ప్రభుత్వ రంగ సంస్థల్లో మాదిరిగా ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌ని అమలు చేయాలని కోరారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం, నార్త్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ నాలుగు సంస్థల్లో పనిచేస్తున్న 70 వేల మందికి ఉపయోగం జరుగుతుందని సూచించారు. 2017లో విద్యుత్ కంపెనీల్లో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న సుమారు 23 వేల మందిని రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిజన్లుగా గుర్తించిందనీ, వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. 2018లో పది శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి అన్యాయం చేశారని తెలిపారు. రాబోయే పీఆర్సీలో న్యాయం జరిగేటట్టు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని సూచించారు. టీఎస్‌జెన్‌కోలో పనిచేస్తూ మరణించిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చిన తర్వాత వారు కూడా మరణిస్తే రెండో నియామకం ఇవ్వటం కుదరదంటూ తెలియజేసిందనీ, జీవోను రద్దుచేసి కారుణ్య నియామకాలు ఇవ్వాలని తెలిపారు

పోలీసు డ్రైవర్, మెకానిక్ పోస్టులకు

## ఏప్రిల్ 2న తుది రాత పరీక్ష

**నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి**

పోలీసు కానిస్టేబుల్ (డ్రైవర్, మెకానిక్) పోస్టులకు ఏప్రిల్ 2న తుది రాత పరీక్ష నిర్వహిస్తున్నట్టు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వి.వి శ్రీనివాస్‌రావు మంగళవారం తెలిపారు. ఆ రోజున ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఈ అభ్యర్థులకు రెండు టెక్నికల్ పేపర్‌లు ఉంటాయని ఆయన తెలిపారు. అభ్యర్థులు 29 నుంచి మూడ్రోజుల పాటు తమ అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన తెలిపారు. హాల్‌టికెట్లు రాని అభ్యర్థులు ఏదేనీ తమ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.